Haqeeqat-e- Tauheed

*(Telugu)*

# తౌహీద్ వాస్తవికత

రచన

**మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)**

తెలుగు అనువాదం

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** (Regd.)
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-2. ఫోన్:040-24564583

**Name of Book : Tauheed Vaastavikatha**

**Source : Haqeeqat-e- Tauheed** ***(Telugu)***

**TIP Series No. : 355**

Writer : **Moulana Ameen Ahsan Islahi (R.A)**

Translator : **Muhammad Azeez ur Rahman**

*All Rights Reserved with Publishers*

1st Edition : March 2024

Copies : 1000

**Price : Rs.80/-**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24576237, 24564583
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అనువాదకుని ఆంతర్యం | 04 |
| 2. | పీఠిక | 05 |
| 3. | ముందుమాట | 08 |
| 4. | దేవుని ఏకత్వానికి సంబంధించిన సర్వ సామాన్యమైన నిదర్శనాలు | 19 |
| 5. | తౌహీద్‌కు సంబంధించిన అంతర్గత ఆధారాలు | 48 |
| 6. | తౌహీద్ ప్రత్యేక నిదర్శనాలు | 72 |
| 7. | మానవ జీవితంపై తౌహీద్ ప్రభావం | 95 |
| 8. | ధర్మంలో తౌహీద్ ప్రాముఖ్యత | 104 |

# అనువాదకుని ఆంతర్యం

2017 నాటి మాట–

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని బుక్ సెలెక్షన్ కమిటీ వారు "హఖీఖతె షిర్క్" ఉర్దూ పుస్తకాన్ని నాకు ఇచ్చి తర్జుమా చేయమని ఆదేశించారు. రెండు నెలల్లోనే 'షిర్క్ వాస్తవికత' పేరుతో దానిని తెనుగీకరించాను. 2017 సెప్టెంబరులో అది పుస్తక రూపం దాల్చింది.

ఏడు సంవత్సరాల తర్వాత, 2024 ఫిబ్రవరి మొదటి వారంలో టి.ఐ.పి డైరెక్టర్ ఆజ్ఞానుసారం 'హఖీఖతె తౌహీద్' పుస్తకానువాదానికి పూనుకున్నాను. దైవకృప వల్ల ఫిబ్రవరి 29వ తేదీ నాటికి నాకు కేటాయించబడిన పని పూర్తయింది. 'తౌహీద్ వాస్తవికత' పేరుతో మీ ముందున్న ఈ పుస్తకం మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ (రహ్మ) విరచితం. 'షిర్క్ వాస్తవికత' కూడా ఆయన గారు రచించినదే.

'షిర్క్ వాస్తవికత' పుస్తకానికి తతిమ్మా భాగమే 'తౌహీద్ వాస్తవికత' అంటారు రచయిత. ఇవి రెండూ ఒకే నాణానికి ఇరువైపుల వంటివి. మానవ నైజం వాంఛించేది, మానవ సమాజం కాంక్షించేది తౌహీదే అని రచయిత ఖుర్ఆన్ సాక్ష్యాధారాల వెలుగులో నిరూపించారు. 'షిర్క్' స్వామి ద్రోహమని, షిర్క్‌కి ఒడిగట్టిన మనిషి సృష్టి శ్రేష్ఠుడన్న తన స్థాయిని చేజేతులా దిగజార్చుకుంటాడని రచయిత నొక్కి వక్కాణించారు. అది ఎలాగో ఆయన మాటల్లో చదివితేనే అర్థమవుతుంది.

'తౌహీద్' లేని ధర్మం (దీన్) ధర్మమే కాదనీ, తౌహీదే హక్కులన్నింటికీ సిసలైన ప్రాతిపదిక అని వాదించారు మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ(రహ్మ) గారు.

ఈ పుస్తకాన్ని అనువదిస్తున్నప్పుడు నేను ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. ప్రతి ఏకేశ్వరోపాసి, ప్రతి సత్యాన్వేషి, ధర్మ పరిచయ కార్యంలో నిమగ్నుడై ఉన్న ప్రతి దాయి, ప్రతి కార్యకర్త తప్పనిసరిగా చదవవలసిన పుస్తకమిది. దీనిని అనువదించే మహదవకాశం లభించటం నా అదృష్టంగా భావిస్తాను.

**– ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# పీఠిక

తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించిన సూచనలు ప్రత్యేకంగా ఒక పుస్తకంలో విశదీకరిస్తామని లోగడ మేము మా పుస్తకం **'షిర్క్ వాస్తవికత'**లో వాగ్దానం చేసి ఉన్నాము. ఆ వాగ్దాన పాలనలో భాగమే మీ ముందున్న ఈ పుస్తకం. ఈ రెండు పుస్తకాలు **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** (అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేనే లేదు) వచనానికి విశదీకరణగా– దైవచిత్తమయితే– సరిపోతాయని ఆశిస్తున్నాము. ఈ పుస్తకాల సంకలనంలో మా ఉద్దేశం కేవలం దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకానికి సంబంధించిన సహేతుకమైన ఆధారాలు, నిదర్శనాలను విడమరచి చెప్పటం మాత్రమే కాదు. పైగా ఈ సంకలనం వెనుక మరో ముఖ్య ఉద్దేశం కూడా ఉంది. అదేమంటే ఈ ముఖ్యాంశాలు ఏ ఏ ఆధారాల ద్వారా దివ్య ఖుర్ఆన్‌లో తెలియపరచబడ్డాయో, వాటిని విడమరచి చెప్పవలసి ఉంది. తద్వారా ప్రజలు మౌలిక ధర్మాదేశాలను ఆకళింపు చేసుకోవడంతోపాటు ఖుర్ఆన్ అవగాహనా మార్గం కూడా వారికి సుబోధకం అవ్వాలి. ఇందలి వ్యాసాల పరంపరను లోతుగా అధ్యయనం చేసిన వారికి ఖుర్ఆన్ బోధనాశైలికి సంబంధించిన 'కీ' లభిస్తుందన్న ఆశ నాకు ఉంది. అంతేకాదు, సంవాదనకు తెర లేపేవారు సృష్టించే అనేక చిక్కుముడులకు ఇది దూరంగాను, పవిత్రంగానూ ఉంది. మానవుని బుద్ధివివేకాలను నేరుగా అప్పీలు చేస్తుంది. అంతేకాదు, వారి మస్తిష్కం ఖుర్ఆన్ సమర్పించే ఆధారాలు నిదర్శనాలతో సమరసం చెందుతుంది. వారు ఈ పుస్తకంలోని ఓ పెద్ద భాగం ద్వారా లబ్ది పొందగలరు. దానికి సంబంధించిన కొన్ని సంకేతాలు ఇందలి కొన్ని పుటలలో ఉన్నాయి.

అల్లాహ్ మరియు ఆయన గుణగణాలకు సంబంధించి ఖుర్ఆన్ ఏదైతే చెప్పిందో, ఏ సాక్ష్యాధారాలతో చెప్పిందో వాటన్నింటినీ కూలంకషంగా ప్రస్తావిస్తే విషయం సుదీర్ఘం అవుతుంది. నేను మాత్రం విషయాన్ని క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేశాను. అయితే ప్రతి అధ్యాయంలోనూ సందేహాల నివృత్తికి అవసరమయిన విషయాలను విడమరచి చెప్పాను. భవిష్యత్తులో ఎప్పుడయినా ఈ పుటలపై పునఃపరిశీలన చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, ఇన్షాఅల్లాహ్ ఈ సంక్షిప్తీకరణను మరింతగా విడమరచి చెప్పే కృషి చేస్తాను.

ఆధునిక తత్వశాస్త్రం హృదయాలలో గుచ్చిన సంశయాల ముళ్ళను నేను ఖుర్ఆన్ వెలుగులో ఒక్కొక్కటిగా తీయడానికి ప్రయత్నించాను. ఈ ప్రయత్నంలో నేను సఫలీకృతుణ్ణి అయ్యానో లేదో పాఠకులే నిర్ణయించాలి. ఒకవేళ సఫలీకృతుణ్ణి అయివుంటే ఏ మేరకు అయ్యానో వారే చెప్పాలి. ఎవరికి నిజంగా సందేహం ఉందో వారి సందేహం ఈ పుస్తకం ద్వారా పటాపంచలై వారికి ప్రయోజనం చేకూరుతుందన్న నమ్మకం నాకు ఉంది. కాని ఎవరి సంశయం 'ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించేది లేదు' అన్న ఉద్దేశంపై ఆధార భూతమై ఉందో, వారి రోగానికి చికిత్స చేయటం ఏ మానవ మాత్రుని వల్ల కూడా సాధ్యమయ్యేది కాదు. కేవలం అల్లాహ్ మాత్రమే వారికి స్వస్థతను ప్రసాదించగలడు. **యుజిల్లు మంయ్యషావు వ యహ్దీ మంయ్యషావు.**

ఈ పుస్తకంలో మేము **'వహ్దతె వజూద్'** విశ్వాసం✦ పై కూడా చర్చిస్తామని వాగ్దానం చేశాము. అంతేకాదు, తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించి ఏర్పడి ఉన్న తప్పుడు భావాలు, దృక్పథాలపై కూడా ప్రత్యేకంగా ఒక అధ్యాయం రాయాలని సంకల్పించుకున్నాను. అయితే మా ముందున్న చర్చనీయాంశంపై మేము సంభాషించిన తీరు వల్ల అపార్థాలన్నీ వాటంతటఅవే తొలగిపోతాయి. రెండు : వివిధ కారణాల దృష్ట్యా 'వహ్దతె వజూద్'పై ఖుర్ఆన్ వెలుగులో ప్రత్యేకంగా ఒక పుస్తకం రాయటం సమంజసంగా

---

✦ **వహ్దతె వజూద్ :** ఈ పదానికి ఒక్క ముక్కలో అర్థం చెప్పటం చాలా కష్టం. చెప్పినా అది అందరికీ అర్థమవదు. దీనికి ఎన్నో అర్థాలున్నాయి.

– ప్రతిదీ దేవుడే

భావించటం జరిగింది. ఈ సిద్ధాంతం ప్రజాబాహుళ్యంలో జనింపజేసిన అపోహలను ఈ చిరుపుస్తకంలో చర్చించటం సాధ్యం కాదు.

ఈ పుస్తకంలో మేము 'సిఫారసు'పై కూడా చర్చించలేదు. దైవచిత్తమయితే మా రచనలు దైవదౌత్యం (రిసాలత్) వాస్తవికత, పరలోక వాస్తవికతపై తగు సమయంలో దానిపై చర్చించగలము.

ఈ పేజీలలో ఉపయుక్తమయిన, ప్రయోజకరమయిన విషయాలేమన్నా ఉంటే అవన్నీ దైవకృపకు తార్కాణాలే. ఆయన కటాక్షంతోనే నాకు గురువర్యులు, ఇమామ్ మౌలానా హమీదుద్దీన్ ఫరాహీ (రహ్మ) ద్వారా లబ్ది పొందే అవకాశం లభించింది. ఇందులో ఏ తప్పులున్నా అది నా అవగాహనా లోపానికి, పరిమిత జ్ఞానానికి నిదర్శనమే. అల్లాహ్ మన్నించుగాక!

---

- ప్రతి దానిలో, ప్రతి ఒక్కరిలో దేవుడనే వాడున్నాడు. మీలో ఉన్నాడు, నాలో ఉన్నాడు, చెట్టులోనూ, పుట్టలోనూ, పాములోనూ, జీవమున్న ప్రతి దానిలోనూ దేవుడున్నాడు, 'ఇందుగల వాడందులేడని సందేహంబు వలదు' అనే నానుడి ఉండనే ఉంది. దేవుడు సర్వాంతర్యామి.
- దీని ఆధారంగానే మషాయికీన్ ప్రబుద్ధులు 'జహూరె ఇలాహి' పరిభాషను సృజించారు. 'వహ్‌దతె వజూద్' సిద్ధాంతం ఇస్లామీయ విశ్వాసాలతో పొసగదు సరికదా, వ్యాఘాతం చెందుతుంది. ఇది దారిలో పెడదారి తీసి, మనిషిని మార్గవిహీనత, మార్గభ్రష్టతల ఆఖరి అంచులకు చేరుస్తుంది. **– తెలుగు అనువాదకుడు**

# ముందుమాట

ఈ పుస్తకం మేము రచించిన 'షిర్క్ వాస్తవికత' పుస్తకానికి తతిమ్మా వంటిది. 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో మేము బహుదైవభావన గురించి ఎంత కూలంకషంగా చర్చించామంటే, అందులో తౌహీద్ వాస్తవికత దానంతట అదే మీ ముందుకు కొట్టొచ్చినట్టే ప్రస్ఫుటమయింది. ఆ కృతి తర్వాత తౌహీద్ (దేవుని ఏకత్వం) విశదీకరణకు సంబంధించి వేరుగా పుస్తకం రాయాల్సిన అవసరం లేకపోయింది. కాని షిర్క్ వాస్తవికత రచనలో షిర్క్ రకాలను, వాటి పాక్షిక సాపేక్షిక విషయాలను సుబోధకం చేయాలన్న ఆలోచన నా దృష్టిలో ఉండటం వల్ల తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించిన ఆధారాలను విశ్లేషించడానికి పూర్తి అవకాశం లభించలేదు. ఈ పుస్తకం ఆ వెలితిని పూరించగలదు. ఈ రెండు పుస్తకాలు కలిస్తే షిర్క్, తౌహీద్ అధ్యాయానికి సంబంధించినంతవరకు సరిపోగలవు.

దేవుని ఏకత్వానికి సంబంధించిన సాక్ష్యాధారాలు, నిదర్శనాలపై చింతన చేసేముందు కొన్ని అంశాలను ముందు మాటగా తెలుసుకోవటం ఎంతో అవసరం.

## ఖుర్ఆన్ తొలి సంబోధితులు

లోగడ మేము 'షిర్క్ వాస్తవికత'లో చెప్పినట్లు ఖుర్ఆన్ తొల్దొలి సంబోధితులైన వర్గీయులలో ఏ ఒక్క వర్గం కూడా దేవుడు లేడని చెప్పలేదు. ఇస్మాయిల్ సంతతి వారుండేవారు. వారు దైవాన్ని నమ్మటమే కాదు, దేవుని ఉన్నత గుణగణాలెన్నింటినో అంగీకరించేవారు. వారిలో ఉన్న కుఫ్ర్ (తిరస్కారం) దైవాన్ని తిరస్కరించటం వల్ల తిష్ఠ వేసిన కుఫ్ర్ కాదు. కాకపోతే కొన్ని

విషయాలను వారు నమ్మి నడుచుకుంటూ ఉండటం వల్ల లేదా త్రోసిపుచ్చటం వల్ల దేవుని ఉన్నత గుణగణాలను వారు తిరస్కరించినట్లయ్యేది. లేదా ఆ గుణగణాలలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించినట్లయ్యేది.

మరోవైపు ఇస్రాయీల్ సంతతి వారుండేవారు. వారు దైవాన్ని, దేవుని ఉన్నత గుణాలన్నింటినీ అంగీకరించేవారు. ఆ గుణాలు వాంఛించే వాటిని, వాటి పరిణామాలను కూడా ఒప్పుకునేవారు. కాని వారు కొన్ని విశ్వాసపరమైన, ఆచరణాత్మకమైన అపమార్గాలకు లోనై పోయారు. అవి వారు అవలంబించే విశ్వాసాలకు విరుద్ధంగా ఉండేవి. అవి వారిని బహుదైవారాధనకు లేదా అవిశ్వాసానికి లోనైనవారుగా నిలబెట్టేవి. అందువల్ల ఖుర్ఆన్ ఈ వర్గాల వారిని నాస్తికులుగా ఖరారు చేసి మాట్లాడలేదు, పైగా వారు అంగీకరించిన తిరుగులేని యథార్థాలను ప్రాతిపదికగా చేసి, వారు తమలో ప్రవేశపెట్టుకున్న లోప భూయిష్టమైన అంశాలను ఖండించింది.

ఈ పరిస్థితి కేవలం ఖుర్ఆన్ తొలి సంబోధితులది మాత్రమే కాదు, పైగా మేము 'షిర్క్ వాస్తవికత'లో వివరించినట్లు ప్రపంచంలోని ప్రాచీన జాతులలో దైవాన్ని కాదనే ధోరణి బహు అరుదుగా ఉండేది. గత కాలంలోని అన్ని జాతులలో ఏదో ఒక రకంగా దేవుని ఏకత్వపు భావన ఉండేది. కాకపోతే ఈ భావనను ఎటువంటి మూఢనమ్మకాలు చుట్టుముట్టి ఉండేవంటే, వాటి మూలంగా ఈ జగతికి సంబంధించిన పజిల్‌ను ఛేదించటానికి ఎలాంటి వెలుగూ లభించేది కాదు. పోనీ విశ్వాసం (ఈమాన్) సదాచరణ (అమలె సాలెహ్) కొరకు పునాది ఏర్పడేదా అంటే అదీ సంభవమయ్యేది కాదు. మొత్తానికి దేవుడు అసలెక్కడున్నాడు? లేదా దేవుడు లేనేలేడు అని నిష్కర్షగా చెప్పే ధోరణి ఈ కాలంలో ప్రబలినదే. ఈ రకమయిన దుస్సాహసం చరిత్రలో ఎప్పుడయినా, ఎక్కడయినా పొడసూపినా, అదొక చిన్న ప్రదేశానికే పరిమితం అయింది. అదొక సిద్ధాంతంగా, ఇంకా చెప్పాలంటే అది కూడా ఒక మతధర్మంగా రూపొందినది మాత్రం ఈ కాలంలోనే.

## ఖుర్ఆన్ చూపే ఆధారాల వైనం

ఈ కారణంగానే ఖుర్ఆన్ దైవత్వ నిరూపణ గురించి చెప్పేటప్పుడు– మన వక్తల పద్ధతిననుసరించి– దేవుడున్నాడండీ అంటూ చర్చను మొదలెట్టదు.

ఒకవేళ అలా గనక చేసినట్లయితే దాని వాక్కు ప్రభావవంతంగా ఉండదు. మనో మస్తిష్కాలలో ప్రకంపనను, అలజడిని సృష్టించిన వివేకపూరితమైన దాని పలుకులు ఏ మాత్రం ఆకర్షణ, పసలేని వాదనగా మిగిలిపోయేవి. దాని సంభాషణలోని ఓ పెద్ద భాగం సందర్భ రహితంగా, నిరర్థకంగా ఉండిపోతుంది. కాని ఖుర్‌ఆన్ తన సంబోధితుల మనస్తత్వాన్ని బట్టి తిరుగులేని విధంగా వాదించింది. వారి భావాలు భావనలలో గల తప్పును, వారి విశ్వాసాలలో గల వక్రతను వారి ముందు విప్పి చూపించింది– ఆ విధంగా వారు సత్యాన్ని స్వీకరించనయినా స్వీకరించాలి. ఒకవేళ వారు దానిని నిరాకరించినట్లయితే వారు మంకుతనం కలవారుగానయినా ఉండిపోవాలి. అజ్ఞాన కూపంలో తప్ప వేరొకచోట వారికి ఆశ్రయం లభించకుండా చేయాలి.

అయితే దైవత్వపు వ్యవహారం ఎంతో కీలకమైనది. అది ధర్మానికి (దీన్‌కు) కేంద్ర బిందువు, విశ్వాస మూలసూత్రాలలోని అంశమది. ఈ అంచు (లేక కొన) చేతికి అందనంతవరకూ జగతి యొక్క పజిల్ పరిష్కృతం కావటంగానీ, మనిషి అడుగు ముందుకు పడటం గానీ, సత్యాసత్యాల, పాపపుణ్యాల సూత్రాలు నెలకొనటం గానీ జరగదు. అంతేకాదు, దివ్య ఖుర్‌ఆన్ శాశ్వత మార్గదర్శకత్వ గ్రంథం, ఏదో ఒక ప్రత్యేక జాతి కొరకో, కాలం కొరకో అది పరిమితం కాదు. అది ఆదమ్ సంతతి లోనైె ఉన్న అపమార్గాలన్నింటికీ ప్రళయదినం వరకూ చికిత్స చేయాల్సిన అవసరం ఉంది. అందువల్ల ఈ విషయంలో ఒక సమగ్రమైన విధానాన్ని అవలంబించవలసి ఉంది. తద్వారా అల్లాహ్ పరిపూర్ణ గుణాలన్నీ నిరూపితం కావాలి. ఉదాహరణకు– సృష్టి, కరుణ, జ్ఞానం, న్యాయం, వివేకం మొదలైన గుణాలు దైవానికి ఉన్నాయన్న విషయం రుజువు కావాలి. తద్వారా, ఎవరయితే దైవాన్ని నామకా నమ్ముతున్నారో, ఆ దేవుని నిజమైన గుణగణాల గురించి తెలిసిలేదో వారు కాదనలేని విధంగా విషయం చేరవేయాలి. అలాగే దైవాన్ని అస్సలు నమ్మని నాస్తికులకు తిరుగులేని రీతిలో దేవుడున్నాడని నిరూపించాలి.

కాబట్టి ఖుర్‌ఆన్‌లో దేవుడున్నాడని వాదించేటప్పుడు, సంబోధితుల ఆలోచనలను, నమ్మకాలనుబట్టి వాదన మూడు స్వరూపాలలో ముందుకు వస్తుంది. వాటిలో ఒక స్వరూపం: కేవలం తిరస్కారుల కొరకు తిరుగులేని ప్రమాణం సమర్పించటం. వారి కోసం అనేకచోట్ల దేవుని ఏకత్వపు ప్రసంగం

ఉంటుంది. మరి ఆ ప్రసంగం కూడా ఎంత సమగ్రంగా, మరెంత మనోహరంగా ఉంటుందంటే, దాని ద్వారా దేవుడనేవాడున్నాడనే విషయం నిరూపితం అవటంతోపాటు ఆ దేవుని ఏకత్వం కూడా రుజువవుతుంది. రెండవ స్వరూపం : ఇది ఎవరి కోసం అవలంబించబడిందంటే, వారు దైవాన్ని నమ్మటానికైతే నమ్ముతారు గాని, ఆయన సద్గుణాల దృక్పథం దగ్గరికొచ్చే సరికి పెడదారి పడతారు. వారి ముందు దేవుడు సద్గుణ సంపన్నుడనే విషయం రూఢీ చేయటం జరిగింది. ఇక పోతే మూడవ వర్గం; వీరు, దేవుడు సకల సద్గుణ సంపన్నుడన్న విషయాన్ని అంగీకరిస్తారు గాని కొన్ని లోపభూయిష్టమైన చేష్టలకు ఒడిగడుతున్నారు. భ్రమల వలయంలో చిక్కుకుని ఉన్నారు. తమ అంగీకారానికి విరుద్ధమైన ఏఏ చర్యలకు వారు ఆలవాలంగా మారారో వాటిని వారి ముందరే ఎత్తిచూపి, నిర్ద్వంద్వంగా ఖండించటం జరిగింది.

పైన ప్రస్తావించబడిన మొదటి రెండు సాక్ష్యాధారాలు బనీ ఇస్మాయీల్ (ఇస్మాయీల్ వంశీయులకు, అరబ్బులకు) వర్తిసాయి. వారిలో అత్యధికులు దైవాన్ని నమ్మనివారు కారు. కాని దేవుని గుణగణాల విషయంలో వారి ఆలోచనలు గాడి తప్పాయి. వారి బుద్ధి తికమక పడి ఉండేది. అందుకే ఖుర్ఆన్ వారి ముందు తౌహీద్ (దేవుని ఏకత్వం) గురించి ప్రసంగించేటప్పుడు, దేవుని అస్తిత్వానికి సంబంధించి వారి హృదయ కవాటాలు తెరచుకునేలా, దేవుని గుణగణాలకు సంబంధించి వారి మెదడులో అల్లుకుపోయిన చిక్కుముడులన్నీ విచ్చుకునేలా అద్భుతమైన రీతిలో ప్రసంగించింది. అందుకే వారిని సంబోధించి ఖుర్ఆన్ ఏదైతే చెప్పిందో ప్రళయదినం వరకు దైవ తిరస్కారులకు, నాస్తికులకు, దేవుని గుణగణాల విషయంలో తికమకపడే వారికి అదొక తిరుగులేని ప్రమాణం.

ఇక సాక్ష్యాధారాలకు సంబంధించి ఖుర్ఆన్ ముందున్న మూడవ రకం సంబోధితులు ఇస్రాయీల్ సంతతివారు. వారు తౌరాతు, బైబిల్ (ఇంజీల్) గ్రంథాలను నమ్మే వారమని బల్లగుద్ది మరీ చెప్పుకునేవారు గాని, ఆచరణ దగ్గరికొచ్చే సరికి– తమ మూలాల నుండి తొలగిపోయి– తమ ప్రమాణబద్ధమైన విషయాలకు విరుద్ధంగా ఎన్నో కాల్పనిక విషయాలను అవలంబించేవారు. వారు తొక్కే కొత్త పుంతలను ఎత్తిచూపుతూ దేవుని గుణగణాల విషయంలో, అవి కాంక్షించే వాటిలో వారు అవలంబించిన సైద్ధాంతిక, క్రియాత్మక లోపాలను

ఎండగడుతూ వారికి వ్యతిరేకంగా సమర్పించబడిన 'ప్రమాణం' ప్రళయదినం వరకూ ఆ కూటములన్నింటికీ తిరుగులేని ప్రమాణం. కొన్ని కొన్ని చోట్ల ఇస్మాయీల్ సంతతికి చెందిన వారికి కూడా ఇది వర్తిస్తుంది. కాని దీనికొక ప్రత్యేక పరిమితి ఉంది. దైవచిత్తమయితే దీనికి సంబంధించిన వివరాలు ముమ్ముందు రానున్నాయి.

## ఖుర్‌ఆన్ చూపే సాక్ష్యాధారాలకు మూలం

అలాగే ఖుర్‌ఆన్ చూపే సాక్ష్యాధారాల మూలాన్ని అవగతం చేసుకోవటం కూడా ఎంతో అవసరం. ఖుర్‌ఆన్ సమర్పించే ఆధారాలు సంబోధితుల అంగీకారంపైనయినా ఆధారపడి ఉంటాయి లేదా సంబోధితుల స్వీకార తిరస్కారాలతో సంబంధం లేనివైనా అయి ఉంటాయి. ఈ రెండవ దానిలో కూడా మరో రెండు రకాలున్నాయి. ఆ ఆధారాలు మనిషి మనసులో నుండైనా గ్రహించినవై ఉంటాయి లేదా బయటి ప్రపంచం నుండి సంగ్రహించబడినవైనా అయి ఉంటాయి. మొదటి రకాన్ని అంతర్గతమైన ప్రత్యేక ఆధారాలుగానూ, రెండవ రకాన్ని బాహ్యాపరమైన సర్వసామాన్య ఆధారాలుగానూ అభివర్ణించవచ్చు-

**1) వ్యతిరేకించే వాని అంగీకారాలు, ఆక్షేపణలపై ఆధారభూతమై ఉన్న ఆధారాలు. దీని పార్శ్వాలు అనేకం. ఉదాహరణకు- ఏ జాతులైనా ఎవరో ఒక దేవుణ్ణి నమ్ముతున్నప్పుడు, ఆ దేవుని గుణగణాలన్నింటినీ, ఆయనకు సంబంధించిన విషయాల న్నింటినీ అంగీకరించటం అవశ్యం. లేదా ఏ జాతి ప్రజలైనా దేవుని మౌలిక గుణాలను నమ్ముతున్నప్పుడు, ఆ గుణాలు వాంఛించే వాటిని వారు ఒప్పుకోవటం కూడా అవసరమే. అంతేకాదు, ఆ గుణగణాలకు వ్యతిరేకంగా ఉన్న గుణాలను పరిత్యజించటం కూడా అవసరమే. ఈ గుణగణాలను అంగీ కరించటం వల్ల మనిషిపై విధితమయ్యే హక్కులు బాధ్యతలను కూడా అంగీకరించాల్సిందే. ఇంకా ఏ జాతులైనా తమ వద్ద ఏదయినా ఆకాశ గ్రంథం కలిగి ఉంటే, లేదా తమ వెనుక**

ఏదయినా ఘనమైన చరిత్రను కలిగి ఉంటే, లేదా తమ సమాజంలో మంచీ చెడులకు సంబంధించిన ఏదయినా నైతిక నియమావళిని కలిగి ఉంటే, వారు తమ మౌలిక యథార్థాలను, తమ ప్రఖ్యాత అంశాలను, తమ మూలాల సహజ పరిణామాలను విస్మరించకూడదు. అలా చేయటమంటే తాము అంగీకరించిన మాట నుండి పలాయనం చిత్తగించటమే. స్వయంగా తమ నోటితో తమను తాము అబద్ధీకరించుకోవటమే.

2) రెండవ రకపు ఆధారాలు బాహ్య ప్రపంచంతో ముడివడినవి. దీని కోణాలు కూడా అనేకం. అన్నిటికన్నా ముందు గమనార్హమైన శాసనాలు ఈ జగతిలో అనునిత్యం, అనుక్షణం కళ్ళ ముందు కదలాడుతూ ఉన్నాయి. వాటి ద్వారా ఖుర్‌ఆన్ దేవునికై వివరించిన ఆ ఒక్కడైన దేవుని ఉనికి, ఆయన గుణగణాల దర్పం కొట్టొచ్చినట్లే కానవస్తూ ఉంది. ఆ పైన ఈ జగతిలో సంభవించే సంఘటనల, జాతుల ఉత్థాన పతనాల వెనుక పనిచేస్తున్న శాసనాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ వాస్తవానికి ఆ సృష్టికర్త గుణగణాల దర్పమే.

3) మూడవ రకపు సాక్ష్యాధారాలు అంతర్గతమైనవి (ప్రత్యేకమైనవి). మనిషిలోని మనసే దీనికి మూల సరోవరం. అది సహజమైన వివేచనా శక్తి. భూమ్యాకాశాల సృష్టికర్త దానిని అంతర్యాలలో పొందుపరిచాడు. దానికి సంబంధించిన కొన్ని కోణాలు చాలా స్పష్టమైనవి. ఆ అనుభూతి ఎప్పటికప్పుడు మనకు కలుగుతూనే ఉంటుంది. కాకపోతే అలసత్వానికి, ఏమరుపాటుకు గురైన మనుషుల దృష్టికి అవి కనిపించకుండా పోతాయి. అయితే దేవుడు వివిధ పరీక్షలకు గురిచేసి, వివిధ విపత్తులను పంపి వారికి నోటీసులు ఇస్తూ ఉంటాడు–

మేము త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు

**ఈ ఖురాన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమై పోతుంది. నీ ప్రభువు ప్రతిదానికి సాక్షి అనే విషయం సరిపోదా? తెలుసుకో, వారు తమ ప్రభువును కలుసుకునే విషయం పట్ల సందేహం కలిగి ఉన్నారు. విను, ఆయన ప్రతి వస్తువునూ పరివేష్టించి ఉన్నాడు. (హామీమ్ అస్సజ్దహ్- 53,54)**

ఈ ఆయత్‌లో తీర్పుదినం, ప్రళయం తథ్యం అన్న విషయం చెప్పబడింది. దీనికిగాను మొదట బయటి ప్రపంచంలోని ఆధారం ఇవ్వబడింది. తరువాత లోపలి ఆధారాల ప్రస్తావన వచ్చింది. ఆపైన అల్లాహ్ యొక్క గుణగణాలను ఆధారంగా సమర్పించటం జరిగింది.

అజ్జారియాత్ సూరాలో ఇంతకన్నా స్పష్టమైన ఉపమానం ఇవ్వబడింది-

**(నమ్మేవారి కొరకు) భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి, స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచించరా? ఆకాశం లోనే ఉంది మీ ఉపాధి కూడా, మీకు వాగ్దానం చేయబడుతున్నది కూడా. కనుక భూమ్యాకాశాల ప్రభువు సాక్షిగా! ఇది సత్యం, మీరు ఇప్పుడు మాట్లాడుతున్నంత నమ్మకమైనది.**

***(అజ్జారియాత్: 20-23)***

ఇక్కడ కూడా శిక్షా బహుమానాల దినం తథ్యం అన్న విషయమే చెప్ప బడింది. భూమ్యాకాశాలను సాక్ష్యంగా పెట్టి ఈ ఆయత్‌ల ద్వారా చెప్పబడిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ ప్రపంచాన్ని నిర్మించి దానిని దాని మానాన ఇట్టే వదలిపెట్టడం విశ్వ సృష్టికర్తకు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఈ జగతి సంప్రదాయం, అందలి శాసనాలు, దాని చారిత్రక వృత్తాంతాలు, వాటి స్థితిగతులు, పరిణామాలు ఇచ్చే సాక్ష్యం ఏమిటంటే ప్రతిఫలం లభించే ఒక రోజు తప్పకుండా రానున్నది. ఆ రోజు దుర్వర్తనులు తమ దురాగతాలకు గాను దుష్ఫలితం పొందుతారు. సద్వర్తనులకు వారి సదాచరణల మంచి ప్రతిఫలం లభిస్తుంది. ఆ తర్వాత చెప్పబడిన ఒక ముఖ్య విషయం ఏమిటంటే, భూమ్యా కాశాలలోనూ స్వయంగా మీ లోపల కూడా దీనికి సంబంధించిన నిదర్శనా

లున్నాయి. ఆ తర్వాత భూమ్యాకాశాల ప్రభువుపై ప్రమాణం చేసి– సాక్ష్యంగా పెట్టి– అసలు విషయం చెప్పబడింది.

ఈ రెండు ఉపమానాలను మేము ఖుర్ఆన్ ద్వారా పేర్కొనటంలో ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, ఖుర్ఆన్ తన సాక్ష్యాధారాలకు గల ప్రాతిపదికలు ఏవో స్వయంగా వివరించింది. ఇక మిగిలినవి ఆ మూడు విషయాలు– తౌహీద్ (దేవుని ఏకత్వం), రిసాలత్ (దైవదౌత్యం), ఆఖిరత్ (పరలోకం); వీటికి సంబంధించి ఖుర్ఆన్ ఏ ఏ విధంగా ఆధారాలను సమర్పించిందో, సందర్భో చితంగా వస్తాయి– ఇక్కడ మేము చెప్పదలచిందల్లా ఖుర్ఆన్ చూపే ఆధారాలకు మూలాలు ఏవో క్లుప్తంగా సూచించటమే.

## కొన్ని అనివార్య హెచ్చరికలు

మేము ఖుర్ఆన్ చూపే ఆధారాలు, నిదర్శనాలను విభిన్న రకాలుగా విభజించటాన్ని ఎవరూ అపార్థం చేసుకోనవసరం లేదు. మీరు ఒక విషయం గమనించే ఉంటారు. సంబోధితుని స్థితిని బట్టి ఖుర్ఆన్ సమర్పించే ఆధారాలలో, వాటి మూలాలలో మార్పు జరిగినట్లే, సంబోధితుని భేదాభిప్రాయం కారణంగా బోధనాశైలిలో కూడా మార్పులు జరిగాయి. కొన్ని చోట్ల కేవలం సంబోధితుని అంగీకృత విషయాలపై చర్చ జరిగింది. కొన్ని చోట్ల మనిషిలోని మనసులో ఉన్న విషయాల ఆధారంగా ప్రస్తావించటం జరిగితే, మరికొన్ని చోట్ల బాహ్య ప్రపంచంలోని తిరుగులేని ఆధారాలను చూపించటం జరిగింది. కొన్ని చోట్ల అంతర్బాహ్య ఆధారాలు – రెండింటినీ సంబోధితుని ముందు ఉంచటం జరిగింది. మరి కొన్ని చోట్ల మూడింటినీ ఒక చోట చేర్చటం జరిగింది. అలాగే అసలు దావా (సందేశ ప్రధానమైన అంశం)లో కూడా కొన్నింటిలో ఉమ్మడి చర్చ ఉంటే, మరి కొన్నింటిలో వ్యక్తి లక్ష్యంగా ఉంటాడు. కొన్నిచోట్ల దేవుని ఏకత్వంపై సాక్ష్యాధారం ఉంటే, కొన్నిచోట్ల పరలోకంపై సాక్ష్యాధారం ఉంటుంది. మరికొన్ని చోట్ల ఈ రెండింటి సమాహారం ఉంటుంది. కొన్ని చోట్లయితే ఈ మూడింటి (తౌహీద్, రిసాలత్, ఆఖిరత్) మేళవింపు ఉంటుంది. వీటిలోని వ్యత్యాసాన్ని, విచక్షణను పరికించటం సద్విమర్శకుని పని. ఇకపోతే ఖుర్ఆన్ లోని సాక్ష్యాధారాల పద్ధతి సహజ సిద్ధమైనది. అందుచేత ఆధారాలు, నిదర్శనా లకు సంబంధించి కేవలం కృత్రిమ పద్ధతులకు అలవడిన వారు, ఖుర్ఆనీ

సాక్ష్యాధారాల లోతుపాతులను గ్రహించలేరు. వారు రకరకాల అపార్థాలకు, దురనుమానాలకు లోనవుతుంటారు.

కొంతమంది తెలియనివారు మతం పూర్తిగా ఆజ్ఞల పునాదిపై నిలబడి ఉందని అనుకుంటారు. 'వహీ' (దివ్యావిష్కృతి) ద్వారా అందిన మాటే సత్యమని, దానికి తగు ఆధారం ఉన్నా లేకున్నా అదే తిరుగులేనిదని భావిస్తారు. నిశ్చయంగా విశ్వసించిన వారి కొరకు దైవం, దైవప్రవక్త చెప్పినదే తిరుగులేని ప్రమాణం. ఇందులో వారికి ఎలాంటి సంశయం, సందిగ్ధం ఉండదు. కాని మతం అన్నది విశ్వాసులలో రాదు, అవిశ్వాసులలోకి వస్తుంది. వారి కొరకు దైవం, దైవప్రవక్త చెప్పిన మాట ప్రమాణబద్ధం కాజాలదు. ఆ మాట సహేతుకమైన ఆధారంపై, ప్రకృతి యథార్థంపై లేనంతవరకు వారు దానిని నమ్మరు. అందుకే ఖుర్‌ఆన్– వెనుకటి పంక్తుల్లో చెప్పినట్లుగా– ప్రపంచంలోని ప్రత్యేక విషయాలను, బయటి విషయాలను ఆధారాలుగా, నిదర్శనాలుగా ఉపయోగించింది. ప్రతి విభాగంలోనూ తన దావాననుసరించి అంతర్బాహ్యాల లోని శాసనాలను, ఆనవాయితీని ముందుంచింది. ఏ విషయాలకు సంబంధించిన సాక్ష్యాలు జగతిలోని అన్ని మూలల్లో లభిస్తున్నాయో, మానవ నైజం ఏ యథార్థాలపై సాక్షిగా ఉందో ఆ యథార్థాల వైపునకే ఖుర్‌ఆన్ పిలుపు నిస్తోంది. కాబట్టి ధర్మానికి (దీన్‌కు) సంబంధించిన మౌలిక అంశాల గురించి ఖుర్‌ఆన్ చూపే ఆధారాలను ఆకళింపు చేసుకునేందుకు యత్నించాలి– షరీఅత్ మరియు ప్రపంచంలోని బాహ్య విషయాలు, లోపలి విషయాల మధ్యన గల సమన్వయం తేటతెల్లం కావటానికి, ఖుర్‌ఆన్ సహేతుకతపై ఏర్పడిన అనుమానాలు పటాపంచలు కావటానికి ఈ అవగాహన చాలా అవసరం.

ఈ ముందుమాటలో ఈ విషయాలపై ముందస్తు హెచ్చరిక అవసరమనిపించింది– ఎందుకంటే ఖుర్‌ఆన్ తొలికాలపు సంబోధితులలోని వివిధ వర్గాల, సముదాయాల స్థితిగతుల గురించి క్షుణ్ణంగా తెలియనివారు లేదా ఖుర్‌ఆన్ సమర్పించిన ఆధారాలలో సంబోధితుని పరిస్థితులకు గల ప్రాధాన్యతను గుర్తెరగనివారు లేదా ఖుర్‌ఆన్ చూపిన ఆధారాలకు గల మూలాలేమిటో తెలియనివారు ఇక్కడ పప్పులో కాలేసే అవకాశం ఉంది. ఖుర్‌ఆన్ సమర్పించిన ఆధారాలన్నీ వట్టి ఊహలనీ, విమర్శనాత్మకమైనవని, తాత్విక ప్రమాణాలతో వాటికి ఎట్టి సంబంధం లేదని భావించే ప్రమాదం

ఉంది. ముస్లింలలో ఎవరయితే గ్రీకు శాస్త్రాలకు ప్రభావితులై ఉన్నారో వారు ఈ దురనుమానం కారణంగా ఖుర్‌ఆన్ మహదానుగ్రహానికి దూరమైపోయారు. వారు ఖుర్‌ఆన్ వైపునకు అసలు రాలేదని అయినా అనుకోవాలి లేదా వారు ఈ విజ్ఞాన ఖనిని మరేదోగా భావించి అయినా వచ్చి ఉండాలి. వారు కేవలం విమర్శనాత్మకమైన, వక్తృత్వ ప్రధానమైన ఆధారాల కోసం వచ్చి ఉంటారు. హేతువుకు సంబంధించిన బంగారు రేణువుల ఆశాభావం వారికి లేకుండింది.

ఆధునిక తత్వ శాస్త్రానికి, సైన్స్‌కు బాగా ప్రభావితులైన ఈ కాలపు ముస్లింలు కూడా ఖుర్‌ఆన్‌కు సంబంధించి ఇలాంటి దురనుమానాలకే లోనై ఉన్నారు. ఖుర్‌ఆన్ సమర్పించే తర్కం కేవలం మధ్యతరగతి మేథకు మాత్రమే అప్పీలు చేయగలదనీ, బుద్ధిజీవులకు, ప్రముఖులకు అది చూపే సాక్ష్యాధారాలు వారి ఊహకు అందనివనీ (దైవం మన్నించుగాక!) వారు సాధారణంగా తలపోస్తున్నారు. వారి ఈ అపోహకు కారణమేమంటే, ఖుర్‌ఆన్ సమర్పించే సాక్ష్యాలకు గల మూలాధారాలేమిటో వారికి అసలు తెలియదు. సంబోధితుని స్థాయిని బట్టి ఆ సాక్ష్యాధారం ఎన్నెన్ని విధాలుగా ముందుకు వచ్చిందో కూడా వారికి తెలీదు. అందుకే మేము ఈ పుస్తకంలో తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించి ఖుర్‌ఆన్ చూపే ఆధారాలను విడమరచి చెప్పదలిచాము.

## ఈ పుస్తకంలోని చర్చ ఈ క్రమంలో ఉంటుంది

**(తౌహీద్ యొక్క సర్వసామాన్యమైన ఆధారాలు)**

1. సర్వసాధారణమైన ఆధారాలు
2. ప్రత్యేకమైన ఆధారాలు
3. సంబోధితుని అంగీకృత అంశాల దృష్ట్యా ఆధారాలు
4. వ్యక్తిపై, సంఘంపై తౌహీద్ విశ్వాసం చూపే ప్రభావం
5. ధర్మం (దీన్)లో తౌహీద్ విశ్వాసానికి గల ప్రాముఖ్యం

ఈ పుస్తకం 'షిర్క్ వాస్తవికత' పుస్తకానికి తతిమ్మా భాగం గనక ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయక ముందు దానిని చదవటం అవసరం. ఈ రచన యొక్క ముఖ్య ఉద్దేశం తౌహీద్‌కు (దేవుని ఏకత్వానికి) సంబంధించిన ఆధారాలు, నిదర్శనాలను విశదీకరించటం మాత్రమే. దీనికి సంబంధించిన

ఇతర చర్చనీయాంశాలు 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో వివరించబడ్డాయి. నా కలము ద్వారా జాలువారిన సత్యబద్ధమైన విషయాలకు మనోక్షేత్రంలో చోటు కల్పించాలనీ, ఎక్కడయినా మరపు వల్ల పొరపాటు దొర్లి ఉంటే దాని ప్రభావాన్ని చెరిపి వేయాలని కారుణ్య ప్రభువు అల్లాహ్‌ను వేడుకుంటున్నాను.

# దేవుని ఏకత్వానికి సంబంధించిన సర్వసామాన్యమైన నిదర్శనాలు (దలాయలె ఆఫాఖ్)

మన కళ్ల ముందు విస్తరించి వున్న ఈ ప్రపంచం వివిధ కోణాల రీత్యా కేవలం హేతుబద్ధంగా మాత్రమే లేదు, పైగా అది ఒక నిజ ఆరాధ్య దైవం అస్థిత్వానికి సాక్షిగా ఉంది. ఆ దైవం పరిపూర్ణ గుణగణాలతో విరాజిల్లుతు న్నాడు. ఈ సాక్ష్యాధారాలకు గల ప్రాతిపదికను మనం బయటి ప్రపంచంలో నిత్యం చూస్తూ ఉంటాము. వాటికి సంబంధించి మన బుద్ధి, మన నైజం వాంఛించేదేమిటంటే, మనం ఆ సాక్ష్యాలు, నిదర్శనాలను వాటికి తగిన అస్తిత్వా నికే ప్రత్యేకించాలి. ఈ విషయాలను ఖుర్‌ఆన్ పరిభాషలో **'ఆయాతుల్లాహ్'** (అల్లాహ్ సూచనలు)గా అభివర్ణించటం జరిగింది. మేము ఈ అధ్యాయంలో అవసరం మేరకు వాటిని విశదీకరించగలము.

## 1. జగతి సౌందర్యం

అన్నిటికన్నా మొట్టమొదటి వస్తువు– మన కళ్లకు ఆకట్టుకునే వస్తువు– ఈ ప్రపంచ సౌందర్యం. అది ఎల్లెడలా ఉట్టిపడుతూ ఉంది. మనం వీక్షించే ఈ ప్రపంచ వస్తువులలో ఏదీ సాదాసీదాగా, కళావిహీనంగా లేదు. నింగి నుండి నేల వరకూ సర్వత్రా పరచుకుని ఉన్న ప్రతి వస్తువూ మనిషి దృష్టిని తన వైపునకు మరల్చుకుంటూ ఉంటుంది. ప్రతి చోటా అది అతనిని అలరిస్తూ, ఆకర్షిస్తూ ఉంటుంది. అతని కళ్లను తెరిపించే, అతని చెవులను రిక్కించే మనోరంజక

దృశ్యాలు ఈ జగతిలో అసంఖ్యాకం. వీచే గాలులు, తలలు ఊపే వృక్షాలు చేసే స్తుతిగానాలు మనిషిని ఆనంద డోలికల్లో ఓలలాడేలా చేస్తాయి. అదీగాక మనిషి లోపల అందాన్ని ఆస్వాదించే గుణం ప్రోది చేయబడింది. అందువల్ల అతను తన పరిసరాలలో అందాలు జాలువారే దృశ్యాలను తిలకించినప్పుడు, వాటిని ప్రసాదించిన వాని గురించి అతని ఆంతర్యంలో ఆలోచన తప్పకుండా రేకెత్తుతుంది. ఎందుకంటే ఇంతటి అపురూపమైన, మనోహరమైన అందాలతో విరాజిల్లే ఈ ప్రపంచం దానంతట అదే ఉనికిలోనికి రాదని అతనికి అర్థమవు తుంది. అతనిలోనే గనక పాశవిక స్వభావం ప్రాబల్యం వహించి ఉండకపోతే అప్రయత్నంగా అతని నోట ఈ వాక్కు వెలువడుతుంది–

**“తబారకల్లాహు అహ్సనుల్ ఖాలిఖీన్”**

(అత్యుత్తమమైన సృష్టికర్త అయిన అల్లాహ్ ఎంతో శుభవంతుడు)

అంటే– ఈ జగతిని నిర్మించినవాడు (Designer) ఒకడున్నాడనే స్పృహ మాత్రమే అతనికి కలగదు, అంతకన్నా ముందుకుపోయి, ఆ నిర్మాత లేక సృష్టికర్త ‘అత్యుత్తమ సృష్టికర్త’, ఆయన ఎంతో శుభవంతుడు, శుభకరుడు, ఆయన ఏ పనిచేసినా, ఏ వస్తువును చేసినా అది ఆయన పనితనానికి, శుభాలకు నమూనాగా ఉంటుంది అనే భావన కూడా అతనిలో జనిస్తుంది.

నిజానికి ఈ ప్రపంచం మనగలగటానికి ఇన్ని రంగురంగుల, అందాలు జాలువారే వస్తువుల అవసరం లేదు. ఈ నేల ఉంటే సరిపోయేది. కాని ఇందులో ఆహ్లాదకరమైన ఉద్యాన వనాలు, ఎత్తుపల్లాలు, లోయలు, జలపాతాలు, ఎత్తిపోతలు ఉన్నాయి. అవి లేకపోయినా పని నడిచేది. శూన్యం ఉంటే సరిపోయేది. అందులో పిల్లగాలులు, మలయ మారుతాలు, పక్షుల కిలకిలారావాలు లేకున్నా ఏం పోయేది? అలాగే ఆకాశాన్ని నక్షత్రాలతో ముస్తాబు చేయకపోయినా, ఆకాశపుటంచుల్లో అరుణిమ కాంతులు కానరాకపోయినా, పడమటి సంధ్యారాగం లేకపోయినా ముంచుకు పోయేదేముండేది? కాని అలా జరగలేదు. ఈ ప్రపంచమంతా ఈ సుందర దృశ్యాలతో నిండి ఉండటం మనం కళ్ళారా చూస్తున్నాం. ఎందుకిలా? అన్నది ప్రశ్న. కాని ఖుర్ఆన్ ఏమంటుందంటే, మనిషిలోని అందమైన ఆంతర్యాన్ని మేల్కొల్పడానికి, అతనిలోని మనోనేత్రాన్ని తెరిపించడానికి ఈ ఏర్పాటు

జరిగింది. ఇంతటి అందమైన లోకం ఒక సృష్టికర్త లేకుండా ఉనికిలోనికి రాదు. మరి ఆ సృష్టికర్త కూడా కేవలం సృష్టికర్త మాత్రమే కాదు, శక్తిసామర్థ్యాల రీత్యా, కార్యదక్షత దృష్ట్యా, వివేచన రీత్యా గొప్ప శుభకరుడు.

**సరే, అయితే వారు తమపై ఉన్న ఆకాశం వైపు ఎన్నడూ చూడలేదా? మేము దానిని ఎలా నిర్మించి, అలంకరించామో? అందులో ఎలాంటి పగుళ్లు లేవు. మేము భూమిని పరచాము, అందులో పర్వతాలను స్థిరపరచాము. అందులో మనోహరమైన అన్ని రకాల వృక్షజాతులను మొలకెత్తించాము. (సత్యం వైపునకు) మరలే ప్రతి దాసునికి ఇవన్నీ కళ్లు తెరిపించేవీ, గుణపాఠం నేర్పేవీ అయిన విషయాలు. (ఖాఫ్ : 6-8)**

ఎవరయినా ఒక వ్యక్తి భూమ్యాకాశాలలోని ఈ అపురూపమైన దృశ్యాలను చూసీచూడనట్లుగా సాగిపోవటం అన్నది జరగని పని. ఒకవేళ అతని కళ్లు తెరచుకుని ఉంటే, ఈ ప్రపంచ వీక్షణ మనిషిలో దానంతటదే దేవుని సౌందర్య గుణాల పట్ల నమ్మకం కలిగిస్తుంది. ఈ వాస్తవాన్ని అల్ వాఖియహ్ సూరాలోని ఈ ఆయత్ సూచిస్తోంది :

**మీరే రాజేసే అగ్నిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా? దానికి సంబంధించిన వృక్షాన్ని మీరు సృష్టించారా లేక దానిని సృష్టించిన వారము మేమా? మేము దానిని జ్ఞాపక సాధనంగాను, అవసరం ఉన్నవారి కొరకు ప్రయోజనకారిగాను చేశాము.**

**(అల్ వాఖియహ్ : 71-73)**

పై ఆయత్‌లోని చివరి భాగం ప్రత్యేకంగా గమనించదగినది. దీని ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే, ఈ ప్రపంచంలోని వస్తువులు కేవలం మన భౌతిక అవసరాన్ని మాత్రమే తీర్చవు, పైగా వాటిలోని ప్రతి ఒక్కదాని సృష్టిలో గల అందం, సుగుణం, తనంతట తానుగా ఒక ఉన్నత వాస్తవం విశ్వసించేటందుకు సావధానపరుస్తోంది. ఇలా సావధానపరచటం కేవలం దాని పాక్షిక ఉద్దేశం, పైగా వాటి అసలు సిసలు లక్ష్యం అదే. ఈ ఆయత్‌లో కూడా **'తజ్కిరతున్'** (జ్ఞాపిక, హితబోధ) అనే పదం **'మతాఅన్'** (లబ్ది)పై ఆధిపత్యం వహిస్తోంది.

దీని ద్వారా విదితమయ్యేదేమిటంటే వాటి అసలు లక్ష్యం ప్రజలు మరచిపోతున్న పాఠాన్ని జ్ఞాపకం చేయటం. కాకపోతే అందులో ఆర్థిక ప్రయోజనం కూడా ఉందన్నది ఒక అదనపు అంశం. ఎవరి ఆంతర్యం ప్రకాశమానంగా ఉంటుందో, మేల్కొని ఉంటుందో వారికి వస్తువులలోని ఈ కోణమే అన్నిటికన్నా జ్యోతిర్మయంగా కానవస్తుంది. కాని ఎవరి నైజం మసకబారిపోతుందో, జానెడు పొట్ట నింపుకుని, లైంగిక రసాస్వాదన పొందటం తప్ప మరొక ఉద్దేశం ఉండదో వారి ముందు ఏ ఉన్నత లక్ష్యం కూడా ఉండదు. వారి చర్మచక్షువులు సుదూరంలో ఉన్న వస్తువుల్ని వీక్షించగలిగే సూక్ష్మదర్శిని కలిగి ఉండి కూడా, వస్తువులో అన్నిటికన్నా ప్రస్ఫుటంగా ఉన్న యథార్థాన్ని చూడలేకపోతాయి. అందుకే ఈ ఖుర్ఆన్ ఇలాంటి వారిని చతుష్పాదులుగా అభివర్ణించింది. వారి గురించి ఏమనబడిందంటే, వారికి చెవులున్నాయి. కాని వాటితో వారు వినరు. వారికి కళ్ళున్నాయి. కాని వాటితో వారు కనరు. హృదయం ఉంది, కాని అర్థం చేసుకోరు.

పైన ప్రస్తావనకు వచ్చిన రంగురంగుల దృశ్యాలు కేవలం దీని వెనుక ఒక కర్త ఉన్నాడని మాత్రమే సాక్ష్యమివ్వవు. పైగా అవి మహోన్నత గుణగణాల దర్పంతో, సుందరేశునిగా వెలుగొందుతున్న సృష్టికర్త గురించి సాక్ష్యమిస్తున్నాయి. ఎందుకంటే మనం కేవలం ఈ ప్రపంచం నిర్మించబడిందన్న దానిని మాత్రమే చూడము. పైగా చేయబడిన ప్రతి వస్తువు బహు చక్కగా చేయబడిందన్న దానిని కూడా చూస్తాము. దీని ద్వారా నిరూపితమయ్యే విషయమేమిటంటే, ఆ నిర్మాత పరిపూర్ణత గలవాడు, వివేక ధనుడు, శక్తి సంపన్నుడు, మహాజ్ఞాని, కరుణా మయుడు, పరమ ఉదాత్తుడు. ఆయన మనల్ని ఎట్లాగంటే అట్లా పుట్టించలేదు. అత్యుత్తమ ఆకృతిలో, అత్యుత్తమ తెలివిడితో, శక్తియుక్తులతో పుట్టించాడు.

**“మేము మానవుణ్ణి అద్భుతమైన ఆకృతిలో సృజించాము.”**

**(అత్ తీన్- 4)**

ఇంకా ఈ విధంగా సెలవీయబడింది :

**“మానవుడా! పరమ ఉదాత్తుడగు నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది? చూడబోతే నిన్ను పుట్టించినవాడు, నఖశిఖ పర్యంతం నిన్ను తీర్చిదిద్దినవాడు, నిన్ను**

**తగిన రీతిలో పొందికగా రూపొందించినవాడు, తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచినవాడు ఆయనే కదయ్యా!' (అల్ ఇన్‌ఫితార్ : 6-8)**

ఇంకా ఈ విధంగా కూడా సెలవిచ్చాడు :

**ఆయన భూమిని సకల సృష్టిరాసులకై సృజించాడు. అందులో అన్నిరకాల రుచికరమైన పండ్లు పుష్కలంగా ఉన్నాయి. ఖర్జూరపు వృక్షాలు ఉన్నాయి; వాటి పండ్లు పొరలలో చుట్టబడి ఉన్నాయి. రకరకాల ధాన్యాలు ఉన్నాయి. వాటిలో పొట్టు కూడా ఉంటుంది, గింజలూ ఉంటాయి. (అర్ రహ్మాన్ : 10-12)**

ఇది కేవలం సృష్టి కాదు, అత్యుత్తమ సృష్టి. కేవలం అనుగ్రహం కాదు, కరుణానుగ్రహం. కేవలం పోషించటం కాదు, ఆ పోషకత్వం, పాలనలో ఆ దేవుని వైభవం తొణికిసలాడుతుంది.

ఈ జగతిలోని వివిధ భాగాల సౌందర్యాన్ని తిలకించినప్పుడు మన ముందుకు వచ్చే ఫలితమిది. కాని మనం ఈ విడిభాగాల ఉనికిని దాటుకుంటూ పోయి, వీటి ద్వారా క్రమబద్ధత పొందిన ఈ అందమైన ఏకత్వాన్ని- అంటే ఈ మొత్తం జగతిలోని సౌందర్యాన్ని తిలకించినప్పుడు మనకు ఒక యథార్థం తెలిసి వస్తుంది. అదేమంటే ఈ జగతిని ఉనికిలోనికి తెచ్చిన కర్త ఒకడున్నాడు. ఆ సృష్టికర్త, వ్యూహకర్త, ప్రణాళికా రచయిత ఒక్కడే. ఆయనకు భాగస్వాములు, సహవర్తులు ఎవరూ లేరు. ఈ జగతి నింగి నుండి నేల వరకు తీర్చిదిద్దబడిన ఎటువంటి సదనమంటే, అందలి ప్రతి వస్తువూ ఉండవలసిన చోటే ఉంది. అది ఆ మహా సదనంలోని అందాన్ని పెంచుతూనే ఉంది. మనం ఒక అందమైన, చక్కగా తీర్చిదిద్దబడిన వస్తువును చూసినప్పుడు ఒకే అభిరుచి గల, ఒకే చేతి పనితనం గలవాని ప్రమేయం ఇందులో ఉందన్న నిర్ణయానికి వస్తాము. ఒకవేళ ఆ వస్తువులోని వివిధ భాగాలను వివిధ నిపుణులకు ఇస్తే, వివిధ సంకల్పాలకు లోబడి ఆ వస్తువు తయారవుతే ఆ వస్తువులో ఆ పొందిక, ఆ అందం ఉండదు. అలాగే ఈ మొత్తం ప్రపంచంలోని సౌందర్యాన్ని వీక్షించిన వ్యక్తి; అందలి అందాల, రంగురంగుల వెనుక ఒకే అస్థిత్వం యొక్క సంకల్పం ఉందన్న

నిర్ణయానికి వస్తాడు. ఒకవేళ అందులో లోకోభిన్న రుచి ఉంటే అనేక సంకల్పాలు, ఉద్దేశాలకు అందులో ప్రమేయం ఉంటే, అసలు దాని స్థాపనే సంభవం కాజాలదు. ఒకవేళ దాని స్థాపన సాధ్యం అని అనుకున్నా అది తీర్చిదిద్దబడిన సదనంగా ఉండదు, దాని స్థానంలో అదొక గోదాముగా, ముడి సరుకులు వేయబడిన దుకాణంగా రూపొందుతుంది. అందమైన ఏకత్వం స్థానంలో మనం దానిని భయాందోళనలకు ఆలవాలమైన స్థలంగా చూస్తాము. అక్కడ ఉన్న ప్రతి వస్తువూ చిందర వందరగా, ఒకదానితో మరొకటి సంబంధం లేనిదిగా ఉంటుంది. ఎందుకంటే విభిన్న సంకల్పాలు, అభిరుచుల వ్యాఘాతంతో సమన్వయం, సమరసం సాధ్యం కాదు. దివ్య ఖుర్ఆన్ ఈ వాస్తవాన్ని ఎన్నో చోట్ల నొక్కి వక్కాణించింది. వాటిని ఇక్కడ పొందుపరచవలసిన అవసరం లేదు.

## 2. జగతిలోని విరుద్ధ భాగాల పరస్పర సమరసం

గమనార్హమైన మరో ముఖ్యమైన కోణం- ఈ జగతిలోని వివిధ భాగాల మధ్య సమన్వయం, సానుకూలత, సమరసం ఏర్పడటం. ఈ ప్రపంచంలోని వివిధ వస్తువులు ఒండొక దానికి విరుద్ధంగా ఉన్నప్పటికీ వాటి మధ్యన అనిర్వచనీయమైన అనుబంధం, బాంధవ్యం కనిపిస్తుంది- అచ్చం దంపతుల మధ్యన ఎలాంటి సఖ్యత, సమన్వయం ఉంటుందో అలాంటి సమన్వయమే ఈ వస్తువులలోనూ ఉంటుంది. ఒక స్త్రీ తన అంతర్బాహ్య స్వభావ స్వరూపాల రీత్యా పురుషుని కన్నా భిన్న స్థితిలో ఉంటుంది. అలాగే ఒక పురుషుడు స్త్రీకన్నా పూర్తిగా విభిన్న ప్రత్యేకతలు కలిగి ఉంటాడు. అయినప్పటికీ వారిద్దరి మధ్య గల మానసిక, శారీరక సంబంధం అనిర్వచనీయం. స్త్రీ దగ్గర ఉన్న వస్తువు పురుషునికి కావలసిన వస్తువే కాదు, అతనికి ఎంతో ఇష్టకరమయిన వస్తువు కూడా. స్త్రీయే గనక లేకపోతే పురుషుని శక్తిసామర్థ్యాల, ప్రజ్ఞాపాటవాల ఒక పెద్ద భాగం అర్థరహితం అయిపోతుంది. అలాగే పురుషుని వద్ద ఉన్నది స్త్రీ నైజం వాంఛించే వాటికి సరైన సమాధానం. ఒకవేళ పురుషుడు ఆమె కోర్కె తీర్చలేని అసమర్థుడై ఉంటే ఆమెలోని విశిష్ట గుణాలు ఫలవంతమయ్యేందుకు ఆస్కారమే

ఉండదు. ఇద్దరూ ఒకరింకొకరికి బెటర్ హాఫ్ వంటి వారు.[1] జగతిలోని వివిధ వస్తువులన్నింటి పరిస్థితి ఇంతే. నింగి– నేల, రాత్రి– పగలు, వేసవి– చలి, వెలుగు– చీకటి, వేడిమి– చల్లదనం అన్నీ ఆలుమగల మాదిరిగా పరస్పర విరుద్ధ గుణాలు కలిగి ఉండి కూడా వారి లాగానే అన్యోన్యత కలిగి ఉన్నాయి. స్త్రీ– పురుషులు ఏ విధంగానైతే ఒండొకరు లేకుండా– ఒంటరితనం వారి ఉనికిని నిరర్థకం చేసివేస్తుందో అదేవిధంగా ఈ పరస్పర విరుద్ధ స్వభావం గల వివిధ వస్తువులు (భాగాలు) తమ జంట లేకుండా ఉంటే వాటి ఉనికి అర్థరహితం అయిపోతుంది. తన జంటతో కలిసినప్పుడే ఏ వస్తువు అయినా తన లక్ష్యాన్ని ఛేదించగలుగుతుంది.

సఖ్యత, సమన్వయానికి సంబంధించిన ఈ కోణం కేవలం పరస్పర విరుద్ధ గుణాలు కల వాటిలోనే లేదు. పైగా ఈ జగతిపై దృష్టిని సారించినప్పుడు అందులో ఓ సర్వతోముఖమైన సమన్వయం, క్రియాశీలత ఉందన్న వాస్తవం అవగతమవుతుంది. ప్రతి వస్తువూ తన ఉనికిని కాపాడుకునేందుకు, తన మనుగడను సాగించేందుకు, ఇక్కడి సువిశాలమైన కర్మాగారం తన కొరకు ఎల్లవేళలా పనిచేస్తూ ఉండాలని కోరుకుంటుంది. భూమిలో మొలకెత్తిన ఒక గోధుమ మొక్కనే చూడండి, ఈ ప్రపంచంలోని శక్తులన్నీ దాని పరిపోషణలో, పర్యవేక్షణలో తమ వంతు పాత్రను పోషించనంతవరకూ అది తన పరిపూర్ణ స్థితికి చేరుకోదు. భూమి దాని కోసం మెత్తబడాలి. మబ్బుతునక దాని కోసం కారుణ్యం మోసుకురావాలి. సూర్యుడు దానికి వేడిమి ఇవ్వాలి. మంచు దానికి చల్లదనం ఇస్తూ ఉండాలి. పిల్లగాలులు దానికి జోలపాట, లాలిపాట పాడి వినిపిస్తూ ఉండాలి.[2] ఇవన్నీ సకాలంలో– నియమబద్ధంగా– పనిచేస్తేనే గోధుమ పంట చేతికి వస్తుంది. ఈ జగతిలోని వస్తువులన్నింటి పరిస్థితీ ఇంతే.

---

1. "నీవో సగం, నేనో సగం. సగాలు రెండూ ఒకటై పోతే జగానికే ఓ నిండుదనం" అని భార్యాభర్తలు చెప్పుకున్న ఊసుల్లో ఎంతో నిజముంది. (1970ల్లో వచ్చిన 'మంచివాడు' సినిమాలోని ఒక పాటలో భాగం) **– అనువాదకుడు**

2. పుస్తక రచయిత మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ (రహ్మ) పాండితీ ప్రకర్షకు ఇది ప్రతిబింబం. ఈ పంక్తుల్ని తెనుగీకరిస్తున్నప్పుడు నేను ఎంతో తన్మయత్వానికి లోనయ్యాను. గతంలోకి వెళ్ళిపోయాను. 1985లో 'ప్రభుగానం'లో భాగంగా గురువర్యులు, గీటురాయి సంపాదకులు శ్రీ ఎస్.ఎం మలిక్ వ్రాసిన స్తుతిగీతిక జ్ఞప్తికి

ఇప్పుడొక ప్రశ్న– ఈ జగతి పరిణామం దానంతట అదే జరిగిందా? లేక దీని వెనుక ఒక గొప్ప ఆలోచనాపరుడు ఉన్నాడా? ఆయన ఈ జగతిలోని విభిన్న భాగాల మధ్య సఖ్యతను, సమన్వయాన్ని ఏర్పరచి, వాటి పురోగతికి తోడ్పడుతున్నాడా? ఒకవేళ ఈ జగతి కాకతాళీయంగా జరిగిన సంఘటన (Accident) అనీ, అది దానంతటదే ఉనికిలోనికి వచ్చిందనీ, అందులోని విభిన్న భాగాల క్రమ వికాసం కూడా దానంతటదే జరుగుతుందని అనుకుంటే, మరి ఆ విభిన్న భాగాల మధ్యన సమన్వయం, సహకార భావాన్ని జనింపజేయటం కూడా యాదృచ్ఛిక సంఘటనేనా? ఈ గాలి, నీరు, అగ్ని, మట్టి, నదీనదాలు, కొండలు, ఎడారులు, సూర్యచంద్రులు, పశుపక్షాదులు– ఇవన్నీ యాదృచ్ఛిక సంఘటనలుగానే ఉనికిలోనికి వచ్చాయని, ఆ తరువాత ప్రతి భాగం స్వయంగా క్రమవికాసమొందిందనీ, ఆపైన ఆయా విడిభాగాల మధ్య ఆశ్చర్యకరమైన రీతిలో సంఘీభావం జనించిందనీ, ఇవన్నీ కేవలం మనిషి సేవ కోసం అంకితమైనాయని ఏ బుద్ధిమంతుడైనా నమ్మబలుక గలడా? మరి మానవబుద్ధి ఈ రకమయిన ఆశ్చర్యకరమైన కాకతాళీయ సంఘటనల్ని ఒక్క క్షణం కోసమైనా అంగీకరించగలదా?

---

వచ్చింది. ఆ గేయంలోని ఒక చరణం ఇది :

తొలిజాములోని తెలుపు– తొలి పొడుపులోని ఎరుపు
ఇలగాలి పాడె పాటా– తలలూపె చెట్ల రూపు
నీ జ్యోతికే ప్రతీక– నీ స్మరణకో స్వరూపం
నీ స్తుతిలో చేసే గానం– నా హృదయ లోక స్వర్గం

సాయంత్రం (9–2–2024) ఆరున్నరకు ఇంటికి చేరుకోగానే మలిక్ గార్కి ఫోన్ చేసి, ఈ పుస్తకంలో రచయిత ప్రస్తావించిన ఈ అంశాలను వినిపించి, "మీ కవిత్వం మీద దీని ప్రభావం బాగా పడినట్టుందే" అన్నాను. ఉదాహరణగా ఆయన గారి ఈ స్తుతిగీతికనే వినిపించాను. మొదట ఆయన ఉలిక్కిపడ్డారు. భావుకులయ్యారు. భావోద్వేగం నుండి తేరుకున్న మీదట, "1960ల్లో నేను మద్రాసులో ఉన్నప్పుడు, ఒక మురబ్బీ పర్యవేక్షణలో చదివిన పుస్తకాలలో ఇది కూడా ఒకటి. పుస్తకాల అధ్యయనం చేసి వాటిని జీర్ణించుకోనంతవరకూ మన మాటల్లో, చేతల్లో, రచనల్లో, కవనంలో, ప్రసంగాల్లో ఆ రిఫ్లెక్షన్ ఉండదు నాయనా!" అన్నారు.

ఇస్లామీయ ఉద్యమం తొలి కాలానికి చెందిన కార్యకర్తల్లో పుస్తక పఠనం పట్ల గల ఆసక్తికి, అనురక్తికి ఇదొక మచ్చుతునక **– అనువాదకుడు**

పరిస్థితుల ఈ స్వరూపం ఈ విషయానికి సంబంధించి ఎంతో గట్టిగా నిరూపించేదేమిటంటే; ఈ బ్రహ్మాండమైన ప్రపంచం వెనుక ఒక గొప్ప వివేకవంతుడు, వజ్ర సంకల్పం కలవాడు ఉన్నాడు. ఆయనే దీనిని ఉనికిలోనికి తీసుకువచ్చాడు. ఆయన జ్ఞానం, శక్తి, పరిపోషణ, వివేచనకు సంబంధించిన అన్ని గుణగణాలతో అలరారుతున్నాడు. ఆయనే తన జ్ఞానధనంతో, ఔచితీ విజ్ఞతలతో ఈ విభిన్న భాగాల (వస్తువుల) మధ్య సమన్వయం ఏర్పరచాడు. వాటిని మంచి లక్ష్యాల కోసం ఉపయోగిస్తున్నాడు. దీంతోపాటే మరో విషయానికి సంబంధించి కూడా లభించిన సాక్ష్యమేమిటంటే నింగి నుండి నేలవరకూ, నింగికీ-నేలకు మధ్యన ఒకే యజమాని ఉన్నాడు. నిర్వహణాధికారం అంతా ఆయనకే స్వంతం. ఇందులో మరొకరి సంకల్పానికి ఎలాంటి ప్రమేయం లేదు. ఆయనకు భాగస్వామి, సహవర్తుడు ఎవడూ లేడు. ఒకవేళ గగనభువనాలలో వేర్వేరు నిర్వహణాధికారులు ఉంటే, వేర్వేరు వ్యూహకర్తలు ఉంటే లేదా అనేక సంకల్పాలకు ఇందులో ప్రమేయం ఉంటే లేదా మేలు-కీడుకు, వెలుగుకు- చీకటికి వేర్వేరు దేవుళ్ళు ఉంటే జగతిలోని ఈ విభిన్న భాగాల మధ్యన సఖ్యత, సహకార భావం, సమన్వయం ఉండేది కాదు. (పైగా జగతిలో సర్వత్రా అలజడి, అల్లకల్లోలం నెలకొని ఉండేది). ఈ విషయాన్ని ఖుర్ఆన్ అనేక విధాలుగా, అనేక ఉపమానాలతో విశదీకరించింది. దృష్టాంతానికి మేము కొన్ని దివ్య వచనాలను పొందుపరుస్తున్నాము-

> **ప్రతి వస్తువునూ మేము జంటలుగా సృష్టించాము. బహుశా మీరు గుణపాఠం నేర్చుకుంటారని. కనుక పరుగెత్తండి అల్లాహ్ వైపునకు, నేను ఆయన తరఫున మీకు స్పష్టంగా హెచ్చరిక చేసేవాడుగా వచ్చాను. అల్లాహ్‌తోపాటు మరెవరినీ ఆరాధ్యులుగా చేసుకోకండి. నేను ఆయన తరఫున మీకు స్పష్టంగా హెచ్చరించేవానిగా వచ్చాను.** ***(అజ్ జారియాత్: 49-51)***

ఇందులో ప్రతి వస్తువూ జంటలు జంటలుగా ఉండటం వల్ల ఇది దేవుని ఏకత్వం- పరలోకం, రెండింటికీ నిదర్శనంగా ఉంది. పరలోకం ఇక్కడ చర్చనీయాంశం కాదు. దీనికి సంబంధించిన తఫ్సీళ్లు ఇన్‌షాఅల్లాహ్ 'పరలోక వాస్తవికత' అనే మా పుస్తకంలో వస్తాయి. తౌహీద్‌కు (దేవుని ఏకత్వానికి)

నిదర్శనంగా మేము చెప్పేదేమంటే, ఈ జగతిలోని ప్రతి వస్తువూ జంటలు జంటలుగా పుట్టించబడింది. ప్రతిదీ తన జంటతో జత కట్టి తన ఉద్దేశాన్ని పూర్తి చేసుకుంటుంది. దీని ద్వారా రుజువు అయ్యేదేమిటంటే ఈ జగతి యొక్క ఉనికి, దాని మనుగడ అందలి పరస్పర విరుద్ధ భాగాల సమన్వయంపైనే నిలిచి ఉంది. దీని ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే, వాటిని సృష్టించినవాడు, ప్రణాళికా రచన చేసేవాడు ఒక్కడే. ఆ వస్తువుల్లో వైరుధ్యం, వ్యాఘాతం ఉన్నప్పటికీ ఆయన వాటి మధ్యన సంఘీభావాన్ని సృజించి, వాటి చేత సత్ఫలితాలు వెలికి తీస్తున్నాడు. మనం ఈ విశ్వ వ్యవస్థలో చూస్తున్న వైరుధ్యం కేవలం బాహ్యపరమయిన వైరుధ్యం మాత్రమే. దీని వెనుక అనేక మంది ఉద్దేశ్యాలు ఉన్నాయనడానికి ఇది తార్కాణం కానే కాదు. పైగా ఈ పరస్పర విరుద్ధ వస్తువులు ఒండొక దానితో కలసి పనిచేయటం, మంచి ఫలితాలను రాబట్టడం– ఇదంతా సూచించేదేమిటి? దీనివెనుక ఒక గొప్ప శక్తిమంతుడున్నాడని, ఆయన ఆదేశాలకు లోబడి అవి తమ కర్తవ్యపాలన చేస్తున్నాయనడానికి ఇది నిదర్శనం కాదా? ఈ నిదర్శనానికి సంబంధించిన వివరణ అల్ బఖరా సూరాలో ఈ విధంగా ఇవ్వబడింది:

> **"మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి."** *(అల్ బఖరహ్ : 21,22)*

అంటే భూమ్యాకాశాలు ఏ విధంగా సమన్వయంతో, సహకార భావంతో అతని సేవలో నిమగ్నమై ఉన్నాయో మనిషి తన రెండు కళ్లతో చూస్తూనే ఉన్నాడు. భూమి అతని కోసం పాన్పులాగా పరచబడి ఉంది. ఆకాశం పందిరి లాగా తయారై ఉంది. మరి ఆకాశం నుండి వర్షం కురుస్తుంది. భూమి వర్షపు నీటిని పీల్చి పండ్లు ఫలాలను ఉత్పత్తి చేస్తుంది. ఆ పండ్లు మనిషికి ఎంతో రుచికరమైనవి. ఇష్టకరమైనవి. అవి అతని జీవితానికి, మనుగడకు ఆధారంగా

ఉన్నాయి. ఇదంతా చూస్తూ కూడా మానవుడు ఆకాశ దేవత వేరని, భూదేవత వేరని, వర్షం కురిపించే వారు వేరని, పండ్లు ప్రసాదించే వారు వేరని ఎలా ఊహించుకుంటాడు. ఒకానొక కార్యనిర్వాహకుడు, యుక్తితో, శక్తితో, ఒకానొక ప్రత్యేక లక్ష్యం కొరకు విరుద్ధ వస్తువులకు పని చెప్పినప్పుడే ఇది సాధ్యమవు తుంది. ఇదే నిదర్శనం మరింత విస్తారంగా మరోచోట విశదీకరించబడింది:

**మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాకరుడు తప్ప మరొక దేవుడు లేడు. (ఈ సత్యం గ్రహించటానికి ఏవైనా గుర్తులు, తార్కాణాలు అవసరం అయితే) వివేకం ఉన్నవారికి భూమ్యాకాశాల నిర్మాణంలో, రేయింబవళ్ళు ఒకదాని వెంట ఒకటి చేసే నిరంతరమైన పయనంలో, ప్రజా బాహుళ్యానికి ఉపయోగ పడే వస్తువులు మోసుకుంటూ నదులలో, సముద్రాలలో సంచరించే ఓడలలో, పైనుండి అల్లాహ్ కురిపించే వర్షపు నీటిలో– తద్వారా ఆయన మృత భూమికి ప్రాణం పోస్తాడు. (ఈ ఏర్పాటు ద్వారా) భువిలో వివిధ ప్రాణులను వర్ధిల్లజేస్తాడు– వాయువుల సంచారంలో, భూమ్యాకాశాల మధ్య అల్లాహ్ ఆదేశా లకు కట్టుబడి ఉన్న మేఘమాలికలలో అసంఖ్యాకమైన సూచనలు కానవస్తాయి. *(అల్ బఖరహ్ – 163, 164)***

అన్ నహ్ల్ సూరాలో ఇంతకన్నా వివరంగా ఈ విశ్వంలో గల సామ రస్యాన్ని, సంఘీభావాన్ని స్పష్టం చేయడం జరిగింది:

**"(మీరు ప్రతి వర్షాకాలంలోనూ చూస్తారు) అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. నిర్జీవంగా పడివున్న భూమిలో ఒక్కసారిగా దాని ద్వారా ప్రాణం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి ఒక నిదర్శనం ఉన్నది. మీకు పశువులలో కూడా ఒక గుణపాఠం ఉన్నది. వాటి గర్భంలో పేడ, రక్తానికి మధ్య ఉన్న ఒక వస్తువును మేము మీకు త్రాగిస్తాము. అంటే స్వచ్ఛమైన పాలు. అది త్రాగేవారికి ఎంతో కమ్మనిది. (ఇదే విధంగా) ఖర్జూరపు చెట్లు, ద్రాక్ష తీగెల నుండి కూడా మేము ఒక పదార్థాన్ని**

**మీకు త్రాగిస్తాము. దానిని మీరు మత్తు పానీయంగా కూడా చేసు కుంటారు, పరిశుద్ధమైన ఆహారంగా కూడా. బుద్ధిని ఉపయోగించే వారికి ఇందులో నిశ్చయంగా ఒక సూచన ఉంది. చూడండి, మీ ప్రభువు తేనెటీగకు వహీ ద్వారా ఈ విషయాన్ని తెలిపాడు. "కొండలలో, చెట్ల మీద, తడికలపై ఎక్కించబడిన తీగెలలో నీ తెట్టెలను నిర్మించుకో. అన్ని రకాల పండ్ల రసాన్ని పీల్చు, నీ ప్రభువు సుగమం చేసిన మార్గాలపై నడుస్తూ ఉండు". ఈ ఈగ కడుపులో నుండి రంగురంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజల కోసం వ్యాధి నివారణ శక్తి ఉన్నది. ఆలోచించే వారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉంది."**

***(అన్ నహ్ల్ : 65-69)***

ఈ దివ్య వచనాలలో విశ్వంలో గల సర్వతోముఖమయిన సామరస్యం సూచించబడింది. మేఘాల నుండి వర్షం కురుస్తుంది. దాంతో మృతభూమి కాస్తా సస్యశ్యామలం అవుతుంది. ఆ పచ్చగడ్డిని పశువులు మేస్తాయి. దాంతో ఆ పశువుల్లో పాలు తయారవుతుంది. పశువుల కడుపుల్లో రక్తానికీ– పేడకూ మధ్య నుండి తెల్లని, స్వచ్ఛమయిన పాలధారలు చిమ్ముకు వస్తాయి. త్రాగేవారికి ఆ పాలు ఎంతో కమ్మనిది, బలం చేకూర్చేదీను. మరి ఆ వర్షపు నీటితో పండిన ద్రాక్ష పండ్లు, ఖర్జూర పండ్లతో మనిషి రకరకాల పదార్థాలు తయారు చేస్తాడు. మరి తేనెటీగలనే చూడండి. అవి పర్వతాల మెరక ప్రదేశాల్లో, చెట్లకొమ్మలపై, ద్రాక్ష తీగెలపై తమ తేనెతెట్టుల్ని నిర్మించుకుంటాయి. రకరకాల పువ్వుల రసాన్ని పీల్చి, దానిని ఒకచోట సేకరిస్తాయి. వాటి రంగులూ వేర్వేరుగా ఉంటాయి. రుచులు కూడా వేర్వేరుగా ఉంటాయి. మనిషి దానిని సేవించి, రుచిని ఆస్వాదిస్తాడు. వ్యాధులకు ఆ తేనెలో నివారణ ఉంది. గుణపాఠం నేర్చుకునే ఉద్దేశంతో ఈ దృశ్యాలను చూసిన వ్యక్తి ఎవరయినా సరే, ఇదంతా కాకతాళీయంగా జరిగిన సంఘటనేనని ఎలా అనుకుంటాడు? ఈ నింగీ నేలా, వాటి లోని వివిధ సుందర దృశ్యాలు అనేకమంది దేవీదేవతల పనితనమా? ఏ జగతిలో విభిన్న భాగాల మధ్య పటిష్టమైన సంబంధం ఏర్పడిందో, ఏ ప్రపంచం తనలోని పరస్పర విరుద్ధమైన భాగాల మధ్య సఖ్యత సామరస్యానికి

సంబంధించిన ఇన్ని పార్శ్వాలను కలిగి ఉందో, అదేదో యాదృచ్ఛికమైన సంఘటన కాజాలదు. అందులో వివిధ మనస్తత్వాల జోక్యం ఉండదు. బాహ్యా చక్షువులు కేవలం ఎగిసి పడే సముద్ర కెరటాలను మాత్రమే చూడగలుగుతాయి. కాని ఆ జలనిధి అగాథంలోని ఆణిముత్యాన్ని, ఆణిముత్యం లోపల పోషించ బడుతున్న దానిని చూపులు అందుకోలేవు. ఈ యథార్థం వైపునకే దివ్యఖుర్ఆన్ మన దృష్టిని మరల్చింది– మీరు ఈ ప్రపంచంలోని వైరుధ్యాలను మాత్రమే చూడకండి, ఆ వైరుధ్యాల సంఘర్షణలో జనించే సత్ఫలితాలను చూడండి అని అంటోంది ఖుర్ఆన్. ఒకే ఒక వివేకవంతుని హస్తం ఈ విశ్వం వెనుక పని చేస్తోందని కూడా అది సాక్ష్యమిస్తోంది–

> **"నీటి వనరులు రెండూ సమానం కావు; ఒకటేమో తియ్యనిది, దప్పికను తీర్చేది, త్రాగటానికి మధురమైనది. రెండోదేమో గొంతు మండించే అంత ఉప్పనిది. కాని రెండింటి నుంచీ మీరు స్వచ్ఛమైన తాజా మాంసాన్ని పొందుతారు. ధరించటానికి అలంకరణ సామగ్రిని వెలికి తీసుకుంటారు. మీరు చూస్తూనే ఉన్నారు ఈ నీటిలోనే పడవలు దాని గుండెలను చీల్చుకుంటూ పోతూ ఉంటాయి. మీరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించేం దుకు తద్వారా ఆయనకు కృతజ్ఞులు అయ్యేందుకు. ఆయన పగలులోనికి రాత్రినీ, రాత్రిలోనికి పగలునూ జొనుపుతున్నాడు. సూర్యచంద్రులను ఆయన నియమబద్ధులను చేసి ఉంచాడు. ఇదంతా ఒక నిర్ణీత వ్యవధి వరకు సాగిపోతోంది. (ఈ పనులన్నీ చేసే) ఆ అల్లాహ్‌యే మీ ప్రభువు, సామ్రాజ్యాధికారం ఆయనదే. ఆయనను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు."** ***(ఫాతిర్ : 12,13)***

చూశారా! ఒకవైపు ఉప్పునీటి సముద్రం, మరోవైపున తియ్యని నీరున్న నదీ ప్రవాహం. ఈ రెండింటి మధ్యన ఎంత స్పష్టమైన వైరుధ్యం! అయినప్పటికీ అవి రెండూ కలసి ఒక గొప్ప ఉమ్మడి లక్ష్యసాధన కోసం ఎలా పని చేస్తున్నాయో మీరు గమనిస్తున్నారు. మానవుడు ఏ విధంగా ఈ రెండు జలనిధుల నుండి తన ఆహారాన్ని గ్రహిస్తున్నాడో కూడా మీరు చూస్తూనే ఉన్నారు. ఏ విధంగా

తన అలంకరణ కోసం ముత్యాలు పగడాలను రాబడుతున్నాడో కూడా మీరు చూస్తున్నారు. మరి ఏ విధంగా ఓడలు నీటిలో తరలిపోతూ రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాయో, ఏ విధంగా వాణిజ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాయో కూడా మీరు గమనిస్తున్నారు. మరి మీరు రాత్రి చీకటిని, పగటి వెలుతురును గురించి ఆలోచించండి. అవి రెండూ తమ గుణాలు, ప్రత్యేకతల రీత్యా ఒండొక దానికి పూర్తిగా విరుద్ధమైనవి. కాని అవి పరస్పర విరుద్ధ స్వభావం కలిగి ఉండి కూడా ఎంతో సామరస్యంతో, మరెంతో సమన్వయంతో ఈ జగతి మనుగడలో తమ వంతు పాత్రను బహు చక్కగా పోషిస్తున్నాయి. ఈ జగతిలో మనుషులు, పశు వులు, పక్షుల, వృక్షాల సేవలో అవి నిమగ్నమై ఉన్నాయి. సూర్యుడు పగటి వేళ ఉదయిస్తాడు. తన వెలుగును, వేడినీ విరజిమ్ముతాడు. చంద్రుడు రాత్రిపూట ఉదయించి కాంతినీ, చల్లదనాన్ని సమకూరుస్తూ ఉంటాడు. చూడబోతే అవి రెండూను ఒండొక దానికి ఎంతో భిన్నమైనవి. కాని ఈ ప్రపంచంలోని ఒక్కొక్క ప్రాణి వాటి ద్వారా లబ్ధి పొందుతుంది. ఇవి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మానవ సేవలో నిత్యం నిమగ్నమై ఉన్నాయి. ఏమిటీ, ఇదంతా కాకతాళీయమా? ఈ నిర్వహణా వ్యవస్థ, ఈ నియమబద్ధత, ఈ సహకార భావం, ప్రయోజనం చేకూర్చే ఈ గుణం– ఇవన్నీ వాటంతట అవే జరుగుతున్నాయా? వీటన్నింటినీ తిలకించిన మీదట కూడా, వీటిని యాదృచ్ఛిక సంఘటనలుగా ఖరారు చేసేవారు కేవలం తమ మనో రథం వెనుక పరుగెడుతున్నారు. వారి ఈ ధోరణికి ప్రధాన కారణం సత్యాన్ని అంగీకరించరాదన్న మంకుతనమే. జ్ఞానంతో, పరిశోధనతో వారికెట్టి సంబంధం లేదు.

## 3) విరుద్ధమైన దాని నుండి విరుద్ధమైనది వెలికి రావటం

అలాగే మరో పార్శ్వాన్ని గురించి కూడా ఆలోచించండి. ఈ ప్రపంచంలో ఒక విరుద్ధమైన దాని నుండి మరో విరుద్ధమైన పుట్టుక వస్తోంది. పచ్చని చెట్టు నుండి నిప్పురవ్వలు రాలుతాయి.

1) “మేమే పచ్చని వృక్షం నుండి మీ కొరకు అగ్నిని సృష్టించాము.”

2) ప్రాణం లేని దాన్నుండి ప్రాణమున్న దానిని, ప్రాణమున్న దాని నుండి ప్రాణంలేని దానిని వెలికి తీసేవాడు ఆయనే. ఆయనే అల్లాహ్. మరైతే మీరు ఎటువైపు దారి తప్పి వెళుతున్నారు?

ఇటువంటి పటిష్టమైన వ్యవస్థ వెనుక తిరుగులేని ఒక శక్తి ఉందనీ, అది తన శక్తి సామర్థ్యాలతో పనిచేస్తోందనీ, పరస్పర విరుద్ధమైన వస్తువుల నుండి విరుద్ధమైన వాటినే సృష్టించి, తన సృష్టితాలకు లాభం చేకూరుస్తోందన్నది వాస్తవం కాదా? ఎవరయితే ఈ జగతిని కేవలం యాదృచ్ఛిక సంఘటనగా భావిస్తున్నారో, వారు జీవం ఉన్న దాన్నుండి నిర్జీవాన్ని, నిర్జీవమైన దాన్నుండి జీవమున్న దానిని వెలికి తీయటానికి ఇచ్చే సమాధానం ఏమిటి? పచ్చని చెట్టు నుండి– తాజా పండ్లు ఫలాల స్థానంలో– నిప్పు రవ్వలు రాలటంపై వారిచ్చే సంజాయిషీ ఏమిటి?

## 4) ఒకే రకమయిన దాని నుండి విభిన్నమైన వస్తువుల ఉనికి

దీనినే పోలిన మరో యథార్థం కూడా ఉంది. ఒకే రకమయిన వాటి నుండి వివిధ వస్తువులు ఉత్పన్నం కావటాన్ని మనం గమనిస్తున్నాము. ఈ జగతి ఆరంభంలో పరచబడిన ఒకే వస్తువుగా ఉండేదని, ఆ తరువాత క్రమక్రమంగా దాని వివిధ భాగాలు జనించాయని సైన్సు అంటోంది. ఇది నిజమైతే, ఈ నిజాన్ని కాదనడానికి తగు కారణమేదీ లేదని అనేటట్లయితే, మరి ఈ విభజన లేక పంపకం చేసే వాడున్నాడొకడున్నాడనీ, ఆయన ఒకటిని రెండుగా, రెండును నాలుగుగా చేస్తున్నాడని అవశ్యంగా ఒప్పుకోవలసి ఉంటుంది. ఇక్కడి నుండే ఎన్నో ప్రశ్నలు జనిస్తాయి. భూమి ఒక్కటే. నీరు ఒక్కటే. వీచే గాలులు కూడా ఒకే తరహాకు చెందినవి. కాని ఆ భూమిలో మొలకెత్తే మొక్కలు, తీగలు అసంఖ్యాకం. పువ్వుల రంగులు వేరు. పండ్ల ఆకృతులు, వాటి పరిమాణం, వాటి రంగులు, రుచులు, వాసనలో వైవిధ్యం ఉంది. ఒకే టెంక నుండి ఒక్కోసారి విభిన్న రకాల వృక్షాలు మొలకెత్తుతాయి. వాటి కాండాలు, శాఖలు కూడా విభిన్నంగా ఉంటాయి.

> **"చూడండి! భూమిలో వేర్వేరు ప్రదేశాలు ఉన్నాయి. అవి ఒకదానికొకటి ప్రక్కప్రక్కన ఉన్నాయి. ద్రాక్ష తోటలూ ఉన్నాయి, పంటపొలాలూ ఉన్నాయి, ఖర్జూరపు చెట్లూ ఉన్నాయి– వాటిలో కొన్ని ఒక్కొక్కటిగానూ మరికొన్ని జంటలుగానూ ఉన్నాయి– వాటన్నింటికీ ఒకే నీరు పారుతోంది. కానీ మేము కొన్నింటిని**

**ఎక్కువ రుచికరమైనవిగా చేశాము. మరికొన్నింటిని తక్కువ రుచికరమైనవిగా చేశాము. ఈ అన్ని విషయాలలోనూ బుద్ధిని ఉపయోగించే వారికి చాలా సూచనలు ఉన్నాయి.** ***(అ(్రాద్: 4)***

విజ్ఞత, వివేచన కల వ్యక్తికి ఇందులో హెచ్చరిక ఉంది. అతను ప్రతి వస్తువు రంగుపై, పండ్లుఫలాల రంగుపై, రుచిపై చింతన చేస్తాడు. వీటి వెనుక ఒక సృష్టికర్త ఉన్నాడనీ, ఆయన ఎంతో యుక్తితో, దయతో వీటిని ఉనికిలోనికి తెస్తున్నాడన్న నిర్ణయానికి వస్తాడు. ఆ సృష్టికర్త ఒకే ఒక్కడని, ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరని అతనికి అవగతం అవుతుంది. ఎందుకంటే ఈ చెట్లు ఒకే నీటిని పీలుస్తున్నాయి. ఒకే భూభాగం నుండి మొలకెత్తిన వృక్షాలలో అపురూపమైన వైవిధ్యం ఉంది. అయినప్పటికీ మనం నీటిలో, నేలలో వ్యత్యాసం, వైవిధ్యం ఉందని అనము. అలాంటప్పుడు జగతిలో విస్తరించి వున్న రంగురంగుల వృక్షజాలను అనేకమంది దేవుళ్ళ పనితనానికి నిదర్శనంగా ఎలా చెప్పగలము? అదీగాక ఇక్కడ స్పష్టమయ్యే మరో విషయమేమిటంటే, ఈ రంగురంగుల విభిన్న వస్తువుల వెనుక ఏ గుడ్డివాడో, చెవిటి వాడో లేడు. పైగా అన్నీ తెలిసినవాడు, అసాధారణ శక్తిసామర్థ్యాలు కలవాడు ఒక నిర్ణీత అంచనా ప్రకారం వీటిని ఉనికిలోకి తెచ్చాడు. వాటి మధ్యన ఏదేని విషయంలో హెచ్చుతగ్గులు చేసినా, అది కూడా తన యుక్తిననుసరించే చేశాడు.

## 5) విశ్వంలోని వస్తువులపై నియంత్రణ

దేవుని ఏకత్వానికి మరో మచ్చుతునక ఏమిటంటే, ఈ జగతిలో మనకు కనిపించే బ్రహ్మాండమైన వస్తువులు సయితం దైవాజ్ఞల పాలనలో, ఆయనకు విధేయత చూపటంలో నిమగ్నమై ఉన్నాయి. వాటిలో ఏ ఒక్క దానిలో కూడా దైవత్వపు గుణం ఉందని చెప్పడానికి ఎంతమాత్రం వీల్లేదు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు తమ అందాలతో, వైభవంతో వెలుగొందుతూ ఉన్నప్పటికీ, భూమి, సముద్రం, కొండలు, నదులు, గాలులు, మేఘాలు, ఉరుములు, మెరుపులు– ఇవన్నీ ఈ జగతిలో తమ శక్తినీ, విస్తృతినీ చాటుకుంటున్నప్పటికీ– ఇవన్నీ ఒక పటిష్టమైన ప్రభు సత్తాకు, ఆయన ఆదేశాలకు కట్టుబడి ఉన్నాయి. మరైతే వీటన్నింటినీ సృష్టించిన ఆ సృష్టికర్త ఎవరో ఆలోచించండి. ఈ ప్రశ్నను ఖుర్ఆన్ పదేపదే లేవనెత్తింది. దాని సమాధానాన్ని కూడా అరబ్బు

బహుదైవారాధకుల నోట చెప్పించింది. ఈ జగతికి కర్త ఒకడున్నాడనీ, ఆయన సర్వాధిక్యుడనీ, వివేచనా దురంధరుడని వారు చెప్పారు– "ఈ గగన భువనాలను సృష్టించినదెవరు?" అని మీరు వారిని అడిగితే, సర్వాధిక్యుడు, సర్వజ్ఞాని అయిన దేవుడు వీటిని సృష్టించాడని వారు సమాధానం ఇస్తారు. ఎందుకంటే ఈ విశ్వ మండలంలో కానవచ్చే బ్రహ్మాండమైన వస్తువులను ఎవరయినా చూసినప్పుడు, ఘనత కలవాడు, గౌరవనీయుడు, వివేక సంపన్నుడు, మహాజ్ఞాని అయిన వాడు మాత్రమే వీటిని సృష్టించగలడన్న నిర్ధారణకు వస్తాడు.

ఇక్కడ గమనించవలసిన ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే మనకు కానవచ్చే వస్తువులలో ఏది ఎంత పెద్దగా ఉంటే, దాని నుదుటిపైన అంతే పెద్ద విధేయతా చిహ్నం కనిపిస్తుంది. ఈ ప్రపంచం ఇతరత్రా వస్తువులన్నిటికన్నా సూర్యచంద్రులను అత్యధికంగా పూజించింది. చూడబోతే దీనావస్థ, విధేయత, ఆజ్ఞాపాలన, సాష్టాంగ ప్రణామం, చంద్ర గ్రహణం, సూర్య గ్రహణం లాంటి చిహ్నాలను వాటిలో (సూర్యుడు, చంద్రునిలో) చూసినప్పుడు, ఈ రెంటిలో ఉన్నంత దీనావస్థ మరే వస్తువులో కూడా కనిపించదు. కాని ఈ మనిషి పరిస్థితి కూడా కడు విచిత్రమైనది! వీటన్నింటినీ తన కళ్లతో చూస్తూ కూడా అతను సూర్యచంద్రులను దేవతలుగా నమ్మి వాటిని పూజిస్తాడు.

తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించిన ఈ సూచనలను, ఆధారాలను ఖుర్ఆన్ కొన్ని చోట్ల క్లుప్తంగా, మరికొన్ని చోట్ల వివరంగా విశదీకరించింది. మేమిక్కడ కేవలం మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) పరిశోధనను సమర్పిస్తున్నాము. ఆయన తన జాతి జనుల ముందు ఎంతో అపురూపంగా, తిరుగులేని విధంగా తన వాదనను సమర్పించారు:

> **రాత్రి అతనిపై (ఇబ్రాహీముపై) ఆవరించగానే అతను ఒక నక్షత్రాన్ని చూశాడు. అన్నాడు : "ఇది నా ప్రభువు" అని. కాని అది అస్తమించగానే అతను "అస్తమించేవాటిని నేను ప్రేమించను" అని అన్నాడు. చంద్రుడు ప్రకాశిస్తూ కనిపించగానే అతను, "ఇదీ నా ప్రభువు" అని అన్నాడు. కాని అదీ అస్తమించగానే, "నా ప్రభువు గనక నాకు మార్గమే చూపి ఉండకపోతే, నేనూ మార్గభ్రష్టులలో కలిసి పోయి ఉండేవాణ్ణే" అని అన్నాడు. తరువాత అతను సూర్యుణ్ణి ప్రకాశిస్తూ ఉండగా చూసి, "అసలు**

**ఇదీ నా ప్రభువు! ఇది అన్నిటికంటే పెద్దది" అని పలికాడు. కాని అది కూడా అస్తమించగానే ఇబ్రాహీము ఎలుగెత్తి ఇలా ప్రకటించాడు : "నా జాతి సోదరులారా! మీరు దైవానికి భాగస్వాములుగా నిలబెట్టే వాటన్నింటితోనూ నాకు ఏవిధమైన సంబంధం లేదు. నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన శక్తి వైపునకు తిప్పుకున్నాను. నేను 'షిర్క్'కు ఒడిగట్టే వారిలోని వాణ్ణి ఎంతమాత్రం కాను."** **(అల్ అన్ఆమ్ : 76-79)**

## 6) విశ్వం- దాని పటిష్టమైన ఉపాయం

అలాగే దేవుని అస్తిత్వానికి, ఆయన ఏకత్వానికి సంబంధించిన అతి పెద్ద సాక్ష్యాధారం పటిష్టమైన, సర్వతోముఖమైన ఆయన ఉపాయం, పరిపాలనా వ్యవస్థ, జగతిలోని ప్రతి మూలన మనం దీనిని చూడగలము. ఈ భూనభాంతరాలలో ఒక దానితో ఒకటి పొసగని ఎన్నో చిన్నాపెద్ద సృష్టితాలు నెలకొని ఉన్నాయి. వాటిలో ప్రతిదీ తన తెలివితేటలను, శక్తి సామర్థ్యాలను బట్టి మనుగడ సాగిస్తున్నది. ఒకవైపు చూస్తే ఏమనిపిస్తుందంటే, ఈ జగతిలోని ప్రతి శక్తి ముకుతాడు లేని ఒంటె మాదిరిగా తన దిశలో సాగిపోతోంది. అది ఏ నియంత్రణా వ్యవస్థకు కట్టుబడి లేదని, ఏ అత్యున్నత సార్వభౌమాధికారి ఆజ్ఞలకూ లోబడకుండా యథేచ్ఛగా ముందుకు వెళ్ళిపోతోందని అనిపిస్తుంది. అంతలోనే అకస్మాత్తుగా ఒక గోప్య హస్తం దాని పగ్గాలను పట్టుకుని, దానిని ఒక దిశ నుండి మరో దిశ వైపునకు మరల్చటం మనం గమనిస్తాము. మనం ఎన్నోసార్లు చూస్తుంటాము- అంతరిక్షంలోని గ్రహాలు, నక్షత్రాదులు ఏదైనా ఒక ప్రత్యేక దిశలో సాగిపోతుంటాయి. అవి గనక అలాగే ముందుకుపోతే మన ఈ భూమండలం తునాతునకలైపోవటం ఖాయం. ఈ రకమయిన సంఘటనల ఆధారంగా అప్పుడప్పుడూ ఖగోళ శాస్త్రజ్ఞులు ప్రకటిస్తూ ఉంటారు- ఫలానా గడువులోగా ఈ భూమండలం ఫలానా గ్రహంతో ఢీకొంటుందని. కాని తీరా ఆ గడువు ముగుస్తున్నప్పుడు మనం చూసేదేమిటి? ఆ గ్రహం అత్యంత లాఘవంగా తన దిశ మార్చుకుని వెళ్ళిపోతుంది. అందులో ఉన్న వారెవరో దాని కళ్లెం పట్టుకుని, దాని రూటు మరల్చారనీ, తత్కారణంగా భూమిపై అప్పటివరకు ఖడ్గంలా వ్రేలాడిన ప్రమాదం కాస్తా తప్పిపోయిందని అనిపిస్తుంది.

కాస్త ఆలోచించండి! ఇంతకీ ఆ 'రైతు' ఎవరు? భూనభాంతరాలలోని ఈ శక్తులను, గ్రహాలను, శరీరాలను నియంత్రించే వాడెవడు? ఆయన కోరినంత మేర వాటిని వదులుతున్నాడు. ఎక్కడ ఆపాలో అక్కడ ఆపుతున్నాడు. ఆ తరువాత అవి ఒక అంగుళం కూడా ముందుకు పోయేందుకు సాహసించలేవు. ఇదంతా కాకతాళీయం అంటారా? ఏమిటీ, గుడ్డివాడు, చెవిటివాడు అయిన శక్తి దయాదాక్షిణ్యాలపై ఇదంతా నడుస్తోందా? ఏమిటి, మానవ మేథకు, మనిషిలోని మనసుకు ఈ సమాధానాల ద్వారా తృప్తి లభిస్తుందా? దీనికి ఖుర్ఆన్ ఇలా సమాధానం ఇస్తోంది :

**"అల్లాహ్ ఆకాశాలను, భూమిని నిలిపి ఉంచాడు– అవి తమ స్థానం నుండి దొర్లిపోకుండా ఉండేటందుకు. ఒకవేళ అవి గనక దొర్లిపోతే, తరువాత వాటిని పట్టి నిలిపేవాడెవడూ లేడు. నిశ్చయంగా ఆయన అత్యంత సహన శీలుడు, క్షమించేవాడూను" –ఈ సమాధానంలోని సత్యాన్ని కాదనే వాడెవడు?**

ఈ భౌతిక ప్రపంచంలో వివిధ శక్తుల మధ్యన మనం గమనించే ఉపాయం, వ్యవస్థ ఇది. ఇంతకన్నా ముందుకుపోయి మనం గనక ఈ జగతిలోని నైతిక శక్తుల వ్యాఘాతం, మరి వాటి వల్ల సంభవించే ఫలితాలను గురించి ఆలోచిస్తే అక్కడ కూడా ఇదే శాసనం పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది.

ఒక అసత్య సిద్ధాంతం జనిస్తుంది. ఆ సిద్ధాంతం ధ్వజవాహకులు జన్మిస్తారు. దానిపై ఒక మిథ్యా నైతిక వ్యవస్థ, ఒక మిథ్యా ఆర్థిక వ్యవస్థ, ఒక మిథ్యా రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకోసాగుతాయి. చివరకు పరిస్థితి ఎంతగా విషమిస్తుందంటే ఈ ఆధిపత్యం క్రింద మంచి నీతి నడవడిక గల శక్తులు ఊపిరి పీల్చుకోలేని దురవస్థ దాపురించే ప్రమాదం ఉంటుంది. అదలా ఉంచితే ఈ మిథ్యావ్యవస్థకు గడువు లభిస్తూ ఉంటుంది. కడకు నేలపైనా, నీటిలోనూ కల్లోల చీకటి అలుముకుంటుంది. ఈ ప్రపంచంలోని సంస్కరణా ప్రియులు, ఈ లోకంలో మళ్ళీ సంస్కరణా కార్యం చేపట్టే విషయంలో ఆశ వదులుకుంటారు. అంతలోనే అనూహ్యంగా ఒక తరుణం ఆసన్నమవుతుంది. ఓ గోప్య హస్తం ప్రస్ఫుటమై మిథ్యా వ్యవస్థనంతటినీ కుదిపివేస్తుంది. దాని ఒక్కొక్క ఇటుక చెల్లాచెదరైపోతుంది.

**"కడకు దైవప్రవక్తలు తమ జాతి జనులు విశ్వసించే విషయంలో ఆశ వదులుకున్నప్పుడు, తమకు అబద్ధపు హెచ్చరిక చేయబడిం దని జాతి జనులు అనుమానిస్తున్నప్పుడు, మా సహాయం- అకస్మాత్తుగా- ప్రజలకు అందింది.** *(యూసుఫ్ : 110)*

"వారు కుదిపి వేయబడినప్పుడు, ఆ ధాటికి తట్టుకోలేక దైవప్రవక్తలు, వారితోపాటు విశ్వసించినవారు, 'దైవ సహాయం ఎప్పుడు వస్తుంది?' అని ఆర్తనాదాలు చేసినప్పుడు, ఇదిగో, దైవ సహాయం సమీపంలోనే ఉంది (అని అనబడుతుంది)

ఈ సాక్ష్యాధారాలను కళ్లారా చూసిన తరువాత కూడా ఈ ప్రపంచం దానంతట అదే ఉనికిలోకి వచ్చిందనీ, దానంతట అదే నెలకొని ఉందని అనగలిగే వారెవరు? లేదా ఈ జగతిలోని అనేక శక్తులు ఒక తిరుగులేని సార్వభౌమాధికారి పర్యవేక్షణలో లేవని వాదించగల వారెవరు? ఆ తిరుగులేని సార్వభౌముని శక్తి, పరిపాలన విభజితమై ఉందని ఊహించగలవారెవరు? లేదా ఈ ప్రపంచాన్ని సృష్టించినవాడు, దానిని సృష్టించి దానిని గుడ్డిదిగా దాని మానాన వదలివేశాడని, దానిపైన ఏ నైతిక నియమావళీ పని చేయటం లేదని ఎవరయినా అనుకోగలరా?

## 7) ప్రతి సామూహిక వ్యవస్థ కోసం అవిభాజ్యమైన పరిపాలన అనివార్యం

ఈ ప్రపంచంలో నెలకొని ఉన్న తిరుగులేని వ్యవస్థ ఇచ్చే సాక్ష్యమేమిటంటే, దీని సార్వభౌముడు ఒక్కడే. ఆయన ప్రభుత అవిభాజ్యమైనది. మనం మన సామూహిక జీవితంలో ఏదేని రాజకీయ సంస్థను, అదొక ప్రత్యేకమైన ఒక కేంద్రంతో ముడిపడనంత వరకూ దాని ఉనికి గురించి ఊహించనైనా లేము. విభజించబడిన పరిపాలనలో సుదృఢమైన సామూహిక వ్యవస్థను ఊహించనైనా లేము. మొత్తం రాజకీయ సంస్థలలో ఒక్క ప్రజాస్వామిక వ్యవస్థ మాత్రమే పరిపాలనలో వికేంద్రీకరణకు తావిచ్చింది. అయినప్పటికీ ఆ వ్యవస్థలో కూడా సర్వవ్యాప్తమై ఉన్న పరిపాలనలో కేంద్రీకృతమైన ఒక బిందువును అంగీకరించి, దానితో సమన్వయం చెందవలసిన ఆవశ్యకత ఉంటుంది. ఒకవేళ

అదే గనక లేనట్లయితే అందులో అరాచకం, అవ్యవస్థ తుఫాను చెలరేగి దానిని చిందర వందర చేసేస్తుంది. ఏతావాతా తేలిందేమంటే పరిపాలనాధికారం విభజితమై ఉన్నప్పుడు, దాని సామూహిక సంస్థ సుదృఢంగా మనగలుగు తుందని ఊహించలేము.

ఇక ఇప్పుడు ఆలోచించండి! ఈ జగతి అసంఖ్యాకమైన భాగాలతో కూడుకుని ఉన్నప్పటికీ, అది నిలబడి ఉండటమే గాకుండా ఎంతో పటిష్టంగా, బలంగా నిలబడి ఉంది. అందులో విభిన్న శక్తుల సంఘర్షణ కూడా ఉంది. పరస్పర విరుద్ధ శక్తుల మేళవింపు కూడా ఉంది. మంచీచెడుల వ్యాఘాతం కూడా ఉంది. అయినప్పటికీ ఈ ప్రపంచ పడవ ఈ అలల తాకిడిలో తనను తాను కాపాడుకుంటూ– లాఘవంగా– ముందుకు సాగిపోతుంది. ఆ వైనాన్ని చూసి మనిషి బుద్ధి చకితమవుతోంది. పరిస్థితుల ఈ స్వరూపాన్ని మనలోని ప్రతి వ్యక్తి వీక్షిస్తూనే ఉన్నాడు. ఆ సార్వభౌముని పరిపాలనా వ్యవస్థపై ఆలోచిస్తూ కూడా ఉన్నాడు. ఇప్పుడు ఏ విషయం బుద్ధికి చేరువలో ఉంది? అనేది ప్రశ్న. భూమీ ఆకాశాల దేవుళ్లు వేర్వేరు అన్న బహుదైవారాధకుల నమ్మకమా? లేక భూమ్యాకాశాల దేవుడు ఒక్కడే అన్న యథార్థమా? జగతిలోని ఈ సాక్ష్యాధారాల ఆధారంగా వెలుగు– చీకట్ల దేవుళ్లు వేర్వేరు అన్నది సత్యమా? లేక వెలుగు– చీకట్లు రెండింటినీ వెలికితీసే దేవుడు ఒక్కడే అన్నది సత్యమా? ఈ జగతి అసంఖ్యాకమైన దేవుళ్ల సంగమం అన్నమాట సరైందిగా తోస్తుందా? లేక ఈ సమస్త వ్యవస్థకు పాలకుడు, పోషకుడు, తిరుగులేని అధికారం ఒక్కడే అన్నది సమంజసంగా తోస్తుందా? ఒకవేళ మొదటి మాట సరైనదైతే ఈ వ్యవస్థ చెల్లాచెదరు ఎందుకు కావటం లేదు? ఆకాశాన ఉన్న దైవానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎందుకు జరగటం లేదు? సార్వభౌమత్వం యొక్క విచ్ఛిన్నంతో పాటు ఏకత్వం ఎలా నెలకొని ఉంది? ఈ విషయాన్నే ఖుర్ఆన్ అరబ్బుల ముందు, బహుదైవభావన గల సమస్త జాతుల ముందు సమర్పించింది.

**"వారు ప్రపంచంలో కల్పించుకున్న దేవుళ్లు (ప్రాణంలేని వాటికి ప్రాణం పోసి) లేపి నిలబెట్టగలరా? ఒకవేళ ఆకాశంలో, భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్లు కూడా ఉంటే, అప్పుడు (భూమ్యాకాశాల) రెండింటి వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది. కనుక**

**అధికార పీఠానికి ప్రభువైన అల్లాహ్ వారు కల్పించే విషయాల నుండి పరిశుద్ధుడు."** ***(అల్ అంబియా : 21,22)***

**(ప్రవక్తా!) వారితో ఇలా అను : ఒకవేళ అల్లాహ్‌తోపాటు, వారు అనే విధంగా ఇతర దేవుళ్లు కూడా ఉంటే వారు సింహాసనాధీశుని స్థానానికి చేరే ప్రయత్నాన్ని తప్పకుండా చేస్తారు. ఆయన పరిశుద్ధుడు, వారు చెప్పే మాటలకు ఎంతో అతీతుడు, ఎంతో ఉన్నతుడు.** ***(బనీ ఇస్రాయీల్ : 42,43)***

## 8) సత్యానిదే విజయం

కొన్ని జాతులకు దేవుని ఏకత్వం గురించి, అసలు దేవుడనేవాడున్నాడా? అన్న దాని గురించి సంశయం ప్రపంచంలో చెడు, అసత్యం కారణంగా కలిగింది. వారి దృష్టి అసత్యం (మిథ్య) అనే నురుగుపై నిలిచిపోయింది. ఆ నురుగు క్రింద ఉన్న వెన్న వారికి కనిపించలేదు. తత్ఫలితంగా వారు సర్వాధిక్యుడు, కృపాకరుడు, పరిశుద్ధుడైన దేవుని ఉనికినే అంగీకరించలేదు. లేదా వారు దేవుని ఉనికిని అంగీకరించినా దీనిని ఎన్నో దేవీ దేవతల లీలగా తలపోశారు. వారు ఈ జగతిని, ప్రాణులను సృష్టించి, ఎక్కడో దూరాన కూచొని, అందులోని కష్టాలు కడగండ్ల తమాషా చూస్తున్నారు[1] అని భావిస్తున్నారు. లేదా మంచీ చెడు, వెలుతురు– చీకటికి సంబంధించి వేర్వేరు దేవుళ్లను కల్పించుకున్నారు. ఆ విధంగా ఈ ప్రపంచాన్ని పరస్పర విరుద్ధ శక్తులకు ఆలవాలంగా చేసుకున్నారు. వివిధ జాతుల వారికి కలిగిన ఈ అపోహకు కారణం భావ దారిద్ర్యం, నిగ్రహ లోపం, కేవలం బాహ్య దృష్టి మాత్రమే. వారు ఈ ప్రపంచం యొక్క అసలు స్వభావాన్ని తెలుసుకోలేదు. సత్యాసత్యాల కలగూర గంపలో సత్యాన్ని పరికించి చూడలేదు. దివ్య ఖుర్‌ఆన్ ఈ మూఢనమ్మకాలను నిర్ద్వంద్వంగా, నిర్దిష్టంగా ఖండించింది. ఈ సందర్భంగా మేము కొన్ని వాస్తవాలను చూచాయగా ప్రస్తావించదలిచాము. దివ్యఖుర్‌ఆన్ ఈ ప్రపంచం యొక్క అసలు స్వభావాన్ని ఈ విధంగా ప్రస్తావించింది:

---

1. "ఎక్కడో దూరాన కూచున్నావు. ఇక్కడ మా తల రాతలు రాస్తున్నావు. ఇష్టమైన గారడీ చేస్తున్నావు. స్వామీ, తమాష చూస్తున్నావు" అనే పాట తెలుగులో ఉండనే ఉంది కదా!
**– అనువాదకుడు**

**అల్లాహ్ ఆకాశం నుండి నీళ్లను కురిపించాడు. ప్రతి నదీ, ప్రతి కాలువా తన శక్తికొలది దానిని గ్రహించి బయలుదేరింది. వరద వచ్చినప్పుడు నీళ్ళ ఉపరితలంపైకి నురుగులు కూడా వచ్చాయి. అటువంటి నురుగులే నగలూ, పాత్రలూ మొదలైనవి చెయ్యటా నికి ప్రజలు కరిగించే లోహాలపై కూడా లేస్తాయి. ఇటువంటి ఉదాహరణ ద్వారా అల్లాహ్ సత్యమేదో, అసత్యమేదో సుస్పష్టం చేస్తాడు. నురుగంతా ఎగిరిపోతుంది. మానవులకు లాభం కలిగించే వస్తువు భూమిలో ఉండిపోతుంది. ఈ విధంగా అల్లాహ్ ఉదాహరణల ద్వారా తన మాటలను వివరిస్తాడు.**

***(అర్రాద్ : 17)***

అంటే– ఈ ప్రపంచం యొక్క అసలు స్వభావం ఏమంటే, ఏ విధంగా సాత్వికుడైన ఒక మనిషి ఒక ఈగను జీర్ణించుకోలేడో, అదే విధంగా అది ఈ ప్రపంచంలోని అసత్యాన్ని ఆకళింపు చేసుకోజాలదు. అది ప్రతి మూలలో అసత్యానికి పాతర వేస్తూ ఉంటుంది. ఆపైన అది సత్యాన్ని, ప్రయోజనకర మయిన దాన్ని స్వీకరిస్తుంది. వర్షం కురుస్తుంది, వాగులు, లోయలు పొంగి ప్రవహించినప్పుడు వర్షపు నీటిపై నురుగు పేరుకోవటం మీరు గమనిస్తారు. తరువాత నీరు నిలిచి పోయినప్పుడు నురుగు ఇంకిపోయి, గాలిలో ఎగిరి పోతుంది. అలాగే మీరు వెండితో ఆభరణం చేసేందుకు, దానిని కరిగిస్తారు. అప్పుడు దానిలోని కసువు వేరైపోయి, మేలిమి వెండి మాత్రం ఉండిపోతుంది. ఇదే ఈ ప్రపంచం యొక్క సిసలైన నైజం. ఇందులో ఫక్తు అసత్యం ఉనికి లేనేలేదు. అసత్యం ఎప్పుడు కనబడినా అది సత్యంతో కలగలసి ఉంటుంది. ఏవిధంగానైతే మేలు జాతి వృక్షాలతోపాటు కలుపు మొక్కలు, క్రిమికీటకాలు చేర్తాయో అదేవిధంగా దాంతో అసత్యం, అధర్మం పెనవేసుకుపోతుంది. మీరు మీ సంకుచిత దృష్టి కారణంగా ఆ నాసిరకం మొక్కలనే, కీటకాలనే అసలైనవిగా తలపోస్తారు. తరువాత మీరు ప్రకృతి వైపరీత్యాలపైననో, వివేచనా లోపం పైననో ఆక్షేపణలు తెలుపుతారు. వాస్తవానికి మీ ఈ ఆక్షేపణ మీలోని హ్రస్వ దృష్టికి, తెలివితక్కువతనానికి తార్కాణం. ప్రకృతి (దైవిక వ్యవస్థ) ఏ మూలననైనా ఎంతో వివేచనతో నిండినది. సత్యానికి స్నేహిగా ఉంది. ఒకవేళ ఏదయినా కాల్పనిక

వస్తువుతో కల్పించేవాని ప్రహసనాన్ని అంచనా వేయగలిగితే, ఈ ప్రపంచంలోని ఈ స్వభావాన్ని చూసి ఎంతో సులభంగా– ఈ విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త సత్యమనీ, ఆయన సత్య ప్రేమికుడనీ, తన పలుకుల ద్వారా సత్యాన్ని స్థాపిస్తాడన్న నిర్ణయానికి రాగలము. ఈ యథార్థమే ఈ విధంగా విశదీకరించబడింది–

> **"మేము ఈ ఆకాశాన్నీ, ఈ భూమినీ వాటిలో ఉన్న సమస్తాన్నీ కాలక్షేపం కోసం సృష్టించలేదు. ఒకవేళ మేము ఏదైనా ఆట వస్తువును చేయదలిస్తే– అసలు మేము చేయవలసింది కేవలం ఇంతే అయితే– మేము మా వద్ద ఉన్న దానినే చేసుకునేవారము. కాని మేము అసత్యాన్ని సత్యంతో దెబ్బతీస్తాము, అది దాని తలను పగలగొడుతుంది. చూస్తూ ఉండగానే అది సమసి పోతుంది. మీరు కల్పన చేస్తున్న విషయాల కారణంగా మీకు సర్వనాశనం తప్పదు."** ***(అల్ అంబియా : 16-18)***

ఈ ప్రపంచంలో ఉన్న ఆపదలు– విపత్తులు, కష్టాలు– కడగండ్లు అన్నీ ఈ ప్రపంచం వివిధ దేవీదేవతల ఆలవాలంగా మారటం వల్లనే అన్నది కూడా సరైంది కాదు. ప్రపంచంలోని సుఖదుఃఖాలన్నింటినీ ఖుర్ఆన్, ఒకే వివేకవంతుడు, శక్తిమంతుడైన దేవుని యుక్తిననుసరించి వాటిని ఆయా జాతుల నైతికత, ఆచరణల ఫలితంగా ఖరారు చేసింది. అది ఎంతో కూలంకషంగా ఇలా వివరించి చెప్పింది– ఒక్కోసారి ఈ ఆపదలు, విపత్తులు గర్విష్టులు తమ తలబిరుసుతనంలో హద్దు మీరిపోయిన కారణంగా వస్తాయి. వారు తమ అశక్తతను, నిస్సహాయ స్థితిని తెలుసుకుని దేవుని వైపునకు మరలి రావాలన్నది దీని ముఖ్య ఉద్దేశమై ఉంటుంది. ఒక్కోసారి ఈ విపత్తుకు గల కారణమేమై ఉంటుందంటే, తలబిరుసుతనం ప్రదర్శించిన జాతులకు సర్వవిధాల బోధపరిచిన మీదట కూడా అవి దారికి రాకపోవడంతో వాటిని తుదముట్టించ వలసిన అవసరం ఉంటుంది. కొన్ని పరిస్థితులలో సత్య ప్రేమికులు కూడా ఈ విపత్తుల వాతన పడుతుంటారు. తద్వారా వారి విశ్వాసం, సహనం, స్థయిర్యం, సంకల్పం పరీక్షించబడతాయి. వారిలోని బలహీనతలు దూరమై, వారిలోని సుగుణాలు శక్తి సామర్థ్యాలు ఉద్దీప్తం కావాలన్నది దీని ప్రధాన ఉద్దేశ్యమై ఉంటుంది. ఈ విషయాలన్నింటినీ దివ్య ఖుర్ఆన్ వివిధ రకాలుగా, ఎంతో

వివరంగా విశదీకరించింది. దాని ద్వారా మన ముందుకు వచ్చే యథార్థం ఏమిటంటే, ఏ విధంగానయితే రాత్రి– పగలు, చలి– ఎండ, రెండూ ఈ ప్రపంచ భౌతిక మనుగడ కోసం అవసరమో అదేవిధంగా అనుగ్రహ భాగ్యాలతో పాటు సంతోషాలతోపాటు కష్టాలు కడగండ్లు కూడా ప్రపంచ ఆధ్యాత్మిక నైతిక వికాసానికి అనివార్యం. ప్రపంచంలో సంక్షోభాలకు, అనుగ్రహ భాగ్యాలకు వేర్వేరు దేవుళ్లు ఉన్నారనడానికి ఇది తార్కాణం కానేకాదు. పైగా ఆ దేవుడు ఒక్కడే. ఆయనే కటాక్షించేవాడు, కక్ష తీర్చుకునేవాడు కూడా. ఆయన తీర్చుకునే కక్ష కూడా వాస్తవానికి ఆయన కటాక్షంలోని ఓ పార్శ్వమే. దీనిని ఖుర్ఆన్ సందర్భోచితంగా స్పష్టపరిచింది కూడా.

పాపాలు, దురాగతాల పరిస్థితి కూడా ఇంతే. ఇది కూడా దైవేచ్ఛకు లోబడే ఉంది. మానవునిపై గల దేవుని అతి గొప్ప కటాక్షం ఒకింత ఎంపిక స్వేచ్ఛాధికారం. ఇది కూడా ఆయన కారుణ్యఛాయలోనిదే. అల్లాహ్ మానవునికి మంచీ చెడులను పరికించే తెలివిడిని ప్రసాదించి అతన్ని పరీక్షించాడు. ఈ పరీక్ష వాంఛించేదేమిటంటే, మానవునికి ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడాలి. ఈ స్వేచ్ఛాధికారం మూలంగా మానవుడు మంచీ చెడుల (రెండు) మార్గాలను అవలంబిస్తాడు. మొదటి మార్గం అతని నైజం కాంక్షించే మార్గం. ఆ మార్గంపై నడవటమే దైవానికి ఇష్టం. రెండవ మార్గం ప్రకృతిపై, దేవునిపై తిరుగుబాటు చేసే మార్గం. దీనిని అనుసరించడాన్ని దేవుడు ఎంతమాత్రం ఇష్టపడడు. అయితే ఆయన తాను కోరిన వారికి ఆ మార్గంపై నడిచే వ్యవధి కూడా ఇస్తాడు. ఎందుకంటే వ్యవధి ఇవ్వనంతవరకూ 'స్వేచ్ఛాధికారం' అనే వర ప్రసాదానికి అర్థమే ఉండదు. మానవునికి లభించిన ఈ ఎంపిక స్వేచ్ఛ దేవుడిచ్చిన వరానికి, దైవప్రణాళికకు లోబడి ఉంది. అంతమాత్రాన అది దేవుడు మెచ్చిన విధానం కానే కాదు. తన పట్ల తిరుగుబాటు వైఖరిని అవలంబించే వారికి కూడా ఆయన విడుపు ఇస్తాడు. రేపటి రోజున సంజాయిషీకి ఆస్కారం ఉండకుండా చేయ డానికి ఆయన ఈ విధానాన్ని ఏర్పరచాడు. మేలు అయినా– కీడు అయినా అల్లాహ్ తరఫుననే ఉన్నాయి. ఏ వస్తువు కూడా ఆయన ఇచ్ఛకు, అధికార పరిధికి వెలుపల లేదు. బలవంతమూ సరైనది కాదు. తిరుగులేని స్వేచ్ఛాధికారం కూడా సరైనది కాదు.

సత్యం అనేది ఈ రెండింటి మధ్యన ఉంది. దీని వివరాలు దైవచిత్తమయితే సందర్భానుసారం రానున్నాయి.

పైన వచ్చిన వివరాల ద్వారా తేటతెల్లమైన విషయం ఏమంటే ఈ వ్యవస్థ అంతా సత్యసేవ కోసమే ఉంది. ఈ జగతిని సృష్టించినవాడు సత్యం, సత్యాన్నే ఆయన ప్రేమిస్తాడు. ఇంకా ఇక్కడి నుండే- దానంతట అదే వెలికి వచ్చే విషయం ఏమిటంటే మేలు- కీడు, వెలుగు- చీకటి, సుఖము- దుఃఖము, మంచీ- చెడు, శాంతి-అశాంతి, ఇవన్నీ వేర్వేరు దేవుళ్ల నిర్వాకం కాదు. వీట న్నింటి వెనుక ఉన్న కర్త ఒక్కడే. ఆయన నిర్వహణలోనే ఈ విశ్వ కర్మాగారం నడుస్తూ ఉంది.

## 9) సంజ్ఞలు

అలాగే తౌహీద్‌కు సంబంధించిన అత్యంత ముఖ్యమయిన ఆధారాలు ఈ జగతిలోని వివిధ దృశ్యాలలో అంతర్లీనమై ఉన్న సంజ్ఞల ద్వారా లభిస్తాయి. సూక్ష్మదృష్టి కలవారికి, గుణపాఠం గ్రహించే శుభాత్మలకే ఇవి కానవస్తాయి. ఇవి ఖుర్ఆన్ చూపే సాక్ష్యాధారాలలోని ఒక ప్రత్యేక రకం. ఇవి తర్కానికి, హేతువుకు అందనివి. సహజత్వంపై నిలిచి ఉండే వారిలోనే ఈ ఆభరణం ఉంటుంది. ఈ రకంగా చూసినప్పుడు ప్రపంచ జాతులన్నింటిలో అరబ్బులకు గల ఉన్నత స్థానం సువిదితమే. వారు ఎంతో నిశిత దృష్టి కలవారు. పెద్దపెద్ద పుస్తకాలను చదివి కూడా అర్థం చేసుకోలేని దానిని టూకీగా చెబితే అర్థం చేసేసుకుంటారు. అరబ్బు వక్తలపై, అజ్ఞాన కాలపు కవుల కవనంపై అవగాహన ఉన్న వారికి వారి ఈ అభిరుచి గురించి ఎరుకే. వారు తమకు ప్రియమైన గమ్యస్థానంలో చెరిగిన జాడలను ఎంత రమ్యంగా ప్రస్ఫుటం చేస్తారంటే, దాంతో ఎంతగా ప్రభావితులవుతారంటే, ఆపైన దాని గుణపాఠాలను, అందలి సూక్ష్మమైన సందేశాలను ఎంత మనోహరంగా చిత్రిస్తారంటే, దాంతో విన్నవారి మనసు నిండిపోతుంది. ఖుర్ఆన్‌కు పూర్వం వారి కళాభిరుచి అరబీ సాహిత్యంలో చాలా పరిమితమైనదే. దివ్య ఖుర్ఆన్ వారిలోని ఈ అభిరుచిని ఉద్దీప్తం చేసింది. వారి దృష్టిని జగతిలోని అద్భుత చిహ్నాల వైపునకు, వాటి వైశాల్యం వైపునకు మరల్చింది. దాని ఫలితం విదితమే- ఏ జాతి మహా అయితే అమ్రుల్ ఖైస్, జుహైర్ స్థాయి వ్యక్తులను సృజించగలదో, అందులో అబూ

బక్ర్(రజి), ఉమర్(రజి) లాంటి మహోన్నత వ్యక్తులు పైకి వచ్చారు.

ఈ సంజ్ఞలు ఖుర్ఆన్ మౌలిక అంశాలైన దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకం సందర్భంగా ప్రస్ఫుటం చేయబడ్డాయి. ఇక్కడ ఆ తఫ్సీళ్ళన్నింటికీ అవకాశం లేదు. మేము కేవలం తౌహీద్(దేవుని ఏకత్వం)కు సంబంధించిన ఒక సంజ్ఞను విశదీకరిస్తాము. ఇతర సంజ్ఞలపై కూడా ఆలోచించడానికి ఇదొక మచ్చుతునక కాగలదు.[1]

అర్రాద్ సూరాలో ఇలా సెలవీయటం జరిగింది–

**"భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువూ ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా అల్లాహ్‌కే సజ్దా చేస్తూ ఉన్నది. అన్ని వస్తువుల నీడలు ఉదయం, సాయంత్రం ఆయన ముందు వంగుతాయి. "భూమ్యాకాశాలకు ప్రభువు ఎవరు?" అని వారిని అడుగు. "అల్లాహ్" అని అను.** ***(అర్రాద్– 15,16)***

'ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా' అన్న దానికి అర్థం ఏమిటంటే, తమ అంతఃప్రేరణతో ప్రణమిల్లేవి ఎలాగూ ప్రణమిల్లుతున్నాయి. కాని తమలోని ప్రేరణతో దేవుని ముందు తలవంచనివి గత్యంతరంలేక తలవంచాల్సి వస్తుంది. ఆ తరువాత– మార్గాంతరంలేక సాష్టాంగ ప్రణామం చేయటం ఎలాంటిదో

---

1. ఈ జగతిలో వాస్తవిక సంజ్ఞలకు ఒక పరిమితి అంటూ లేదు. క్రైస్తవులనే చూడండి– వారు తమ చర్చీలలోని ప్రతి వస్తువులో తమ మౌలిక విశ్వాసాలను ప్రదర్శిస్తారు. ఉదాహరణకు– ఒకవేళ 'త్రిత్వం' (Trinity) వారి దృష్టిలో ఉంటే, ఆ కట్టడంలోని ఒక్కొక్క మూల నుండి 'త్రిత్వం' ఉట్టి పడుతూ ఉంటుంది. ఆఖరికి ఫర్నీచర్ లాంటి వస్తువుల్లో కూడా త్రిత్వం ముద్రలు ఉంటాయి. టేబుల్, కలం, పేపర్‌వెయిట్ వరకూ– అన్నింటా– త్రిత్వం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

   అలాగే అల్లాహ్ ఈ విశ్వంలోని ప్రతి వస్తువులో తౌహీద్, పరలోకానికి సంబంధించిన దృశ్యాలను ఉంచాడు. మానవుడు జగతిలోని ఏ మూలన యోచించే దృష్టితో దృష్టిని సారించినా, దేవుని ఏకత్వానికి, పరలోకానికి సంబంధించిన ఏదో ఒక వస్తువు అతని చేతికి లభిస్తుంది. దీనినే కొంతమంది వాస్తవిక జ్ఞానం కలవారు ఇలా వర్ణించారు : "కార్యాలయంలోని ప్రతి పుట దేవుని వాస్తవిక జ్ఞానంతో నిండి ఉంది". కాని అలసత్వానికి లోనైన మనిషి ఇన్ని సాక్ష్యాధారాలు ఉండి కూడా దేవుని ఏకత్వం, శిక్షా బహుమానాల విషయంలో దారి తప్పుతున్నాడు.

విశదీకరించబడింది– అంటే వస్తువులన్నింటి నీడలు ఉదయం, సాయంత్రం ఆయన సన్నిధిలో వంగుతాయి. ఈ యథార్థాన్ని ప్రతి వ్యక్తీ తన అస్తిత్వంలో చూస్తూ ఉన్నాడు.

క్లుప్తమైన ఈ వాక్యానికి విశదీకరణ ఏమిటంటే, ప్రతి వస్తువు నీడ పొద్దు వాలినప్పటి నుండి, సూర్యునికి ఎదురు దిశలో నేలపై వాలటం మొదలవు తుంది. అచ్చం నమాజ్ చేసే వ్యక్తి రుకూ, సజ్దాలలో వంగినట్టే! సూర్యా స్తమయం జరిగిన క్షణం నుంచే ఈ నీడ నేలపై ఆరిపోతుంది– అచ్చం దండ ప్రణామం చేసేవాడు తన పూజనీయుని సమక్షంలో దండ ప్రణామం చేసినట్లే!! లేదా ఒక సాష్టాంగ ప్రణామం చేసేవాడు తన దేవుని ఎదుట సాష్టాంగపడినట్టే!!! తరువాత ఆ రాత్రంతా అది సజీవ దాసుని వలే పడి ఉంటుంది. తెల్లవారు తుంది. సూర్యోదయం అవగానే ఆ నీడ సూర్యునికి ఎదురు దిశలో నెమ్మదిగా లేస్తుంది. క్రమక్రమంగా అది నిటారుగా– ఖియామ్ స్థితిలోకి వచ్చేస్తుంది– అచ్చం ఒక నమాజీ సజ్దా స్థితి నుండి లేచి నిలబడినట్లే! పిదప పొద్దువాలటం తోనే రుకూ, సజ్దాల ప్రక్రియ మొదలవుతుంది.

పరిస్థితుల ఈ స్వరూపం రెండు ముఖ్యమైన వాస్తవాలకు సాక్షిగా ఉంది. ఒకటేమంటే, ఈ జగతిలోని ప్రతి వస్తువూ ప్రతి రోజూ 24 గంటలు– రుకూ సజ్దాలలో నిమగ్నమై ఉంది. రెండవదేమంటే, ఈ సజ్దా (సాష్టాంగ ప్రణామం) సూర్య నమస్కారానికి, సూర్య పూజకు పూర్తి విరుద్ధంగా ఉంది. తూరుపు దిక్కున సూర్యుడు ఉదయించగానే ప్రపంచంలోని ప్రతి వస్తువూ పడమటి దిక్కుకు తిరిగి ప్రణమిల్లుతుంది. సూర్యుడు పడమటి దిక్కుకు వాలగానే వస్తువుల నీడ తూరుపు దిక్కున నేలపై వాలుతుంది. ఏ క్షణంలో కూడా ఏ వస్తువూ తనకు నిర్ణయించబడిన ప్రణామంలో సూర్యునితో సమన్వయం చెందదు. (సూర్య నమస్కారం చేయదు)

కాగా; స్వేచ్ఛాధికారం కలిగి ఉన్న మనిషి దేవుని సన్నిధిలో ప్రణమిల్ల కుండా, అతని ముందు నిక్కుతూ నిలబడి, సూర్యచంద్రులకు ప్రణమిల్లి నట్లయితే, దాని అర్థం ఏమిటి? అతని గురించి ఏమనుకోవాలి? అతను స్వయంగా దేవుని ఎదుట గర్వాహంకారంతో నీల్గుతూ ఉంటాడు. అతని ఉనికి యొక్క నీడ అంతా దైవ సమక్షంలో ఆర్పివేయబడింది. లేదా అతనైతే

సూర్యచంద్రుల ముందు ప్రణమిల్లుతున్నాడు. కాని అతని నీడ మాత్రం ఇబ్రాహీమ్ నైజం కలిగి ఉంది. అది నక్షత్ర పూజతో పూర్తిగా తెగత్రెంపులు చేసుకుంది. **(నా జాతి సోదరులారా!) ... నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన శక్తి వైపునకు త్రిప్పుకున్నాను. నేను షిర్కుకు ఒడిగట్టే వారిలోని వాణ్ణి ఎంతమాత్రం కాను." (6: 79)** అన్నది ఇబ్రాహీమ్(అ) నైజం... ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా దేవుని ముందు ప్రణమిల్లే వస్తువులకన్నా (ఉదాహరణకు– వస్తువుల నీడలు) స్వేచ్ఛాధికారం ఉండి కూడా దేవుని ఎదుట ప్రణమిల్లే మనిషి ఆరాధన ఎంతో విలువైనది.

ఇదే నిదర్శనాన్ని ఖుర్ఆన్ మరో చోట, దీనికి భిన్నమైన పదజాలంలో సమర్పించింది :

**"వారు అల్లాహ్చే సృష్టింపబడిన ఏ వస్తువునూ గమనించరా, అది అల్లాహ్ సాన్నిధ్యంలో సాష్టాంగపడుతూ తన నీడను కుడివైపునకూ ఎడమ వైపునకూ ఎలా తిప్పుతూ ఉంటుందో."**

***(అన్ నహ్ల్ : 48)***

ఖుర్ఆన్లో ఈ రకమయిన సంజ్ఞలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ప్రతి చోటా దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకానికి సంబంధించిన తిరుగులేని యథార్థాల వైపు సంజ్ఞ చేయబడింది. ఏ జాతులైతే చిన్న– పెద్ద క్రమం లేనిదే విషయాన్ని అర్థం చేసుకోలేవో, వాటి కొరకు ఈ సంజ్ఞలలో ఎలాంటి బోధన లేదు. కాని అరబ్బుల వంటి సెన్సెటివ్ జాతి ప్రజలు ఇలాంటి సంజ్ఞల ద్వారా లబ్ది పొందటం మాత్రమే కాదు, వారి అసలు ఆహారం ఈ సంజ్ఞలలోనే ఉండేది. ఈ వస్తువు బౌద్ధిక శిక్షణ కోసం కూడా ఎంతో లాభదాయకమే. ఇక ప్రభావం రీత్యా చూసినప్పుడు సంజ్ఞల, సంకేతాల భాష విడమరచి చెప్పే బోధనకన్నా సదా కీలకమైనదిగా భావించబడింది. మనం వేల పేజీలను తిప్పేసిన మీదట కూడా మన మనోఫలకంపై వేయలేని ముద్రను తుగ్లకాబాద్ శిథిలాలపై సారించిన ఒక్క చూపు చెరగని ముద్రను వేస్తుంది.

# తౌహీద్‌కు సంబంధించిన అంతర్గత ఆధారాలు

## ( ప్రత్యేక ఆధారాలు )

మానవుడు మొదట బాహ్య ప్రపంచంపై దృష్టిని సారిస్తాడు. పిదప తన బుద్ధీ వివేకాలు, విచక్షణా జ్ఞానం పరిపక్వతనొందిన తరువాత తన అంతరంగం వైపు దృష్టిని మళ్ళిస్తాడు. ఈ విషయం కేవలం అతని దృష్టి మరలటం వరకే. అన్యథా అతని అంతరంగమే, అతని కళ్ల ముందున్న బాహ్యంపై ముసుగును తొలగిస్తుంది. ఇన్నాళ్లుగా తన ఆంతర్యం పట్ల అతను నిర్లక్ష్యం వహించడానికి కారణం, అతని ఆంతర్యం అతనికి ఎక్కడో దూరాన ఉండటం కాదు. పైగా ఈ నిర్లక్ష్యానికి కారణం అది అతి సమీపంలో ఉండటమే. దీని అర్థమేమిటంటే బాహ్య ప్రపంచంలోని సర్వ సామాన్యమయిన ఆధారాల పునాది వాస్తవానికి అతని లోపలి ఆధారాలపై ఉంటుంది. భూమ్యాకాశాలలోని సూచనలలో ఏ ఒక్క సూచన కూడా మనిషి లోపలి సూచనపై ఆధారపడకుండా లేదు. ఒకవేళ ఈ లోపలి ఆధారాలు సూచనలే గనక లేకపోయినట్లయితే, ఈ ప్రపంచం రాళ్ళు రప్పలు వంటి జడ పదార్థాల కొరకు ఎలా అర్థరహితమైపోయేదో అలాగే మానవుని కొరకు కూడా అంధకార బంధురమై పోయేది. కనుక ఎవరు సువిశాలమైన ఈ భూమ్యాకాశాలలోని సూచనలపై చింతన చేయరో వారి కొరకు ఈ జగతి అర్థరహితమై పోతుంది. ఖుర్‌ఆన్ ఇలాంటి వారిని పశువుల కన్నా ఎక్కువ బుద్ధిహీనులుగా ఖరారు చేసింది.

ఇక ఇప్పుడు మనం అంతరంగాన్ని అవలోకన చేద్దాము. దాని ఆధారాలు మనకు చాలా దగ్గరగా కూడా ఉన్నాయి. సుస్పష్టంగా కూడా ఉన్నాయి. మనోహరంగానూ ఉన్నాయి, పటిష్టంగానూ ఉన్నాయి. వాటిని ఖుర్ఆన్ ఈ క్రింది పదజాలంలో ప్రస్తావించింది :

**"నమ్మేవారి కొరకు భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచించరా?"**

***(అజ్ జారియాత్ : 20,21)***

ఈ ఆయత్ బోధనా శైలిని బట్టి బోధపడేదేమంటే లోకంలోని ప్రత్యేక నిదర్శనాలు (లోపలి నిదర్శనాలు) మనకు సమీపంలో కూడా ఉన్నాయి. చాలా స్పష్టంగా కూడా ఉన్నాయి. మరైతే ఇవి ఇంత దగ్గరగా, స్పష్టంగా ఉండి కూడా మనిషికి ఎందుకు కానరావటం లేదు? అని సృష్టికర్త ఆశ్చర్యం వెలిబుచ్చు తున్నాడు. ఈ నిదర్శనాలన్నింటినీ పరివేష్ఠించటం మానవునికి కష్టం కావచ్చు. అందుకే ఈ సందర్భంగా మేము ఖుర్ఆన్‌లో వివరించబడిన కొన్ని స్పష్టమయిన నిదర్శనాలను ప్రస్తావించదలిచాము.

## 1. ఏది న్యాయం? ఏది అన్యాయం?

తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించిన అంతర్గత నిదర్శనాలలో మొట్టమొదటి నిదర్శనాన్ని మేము 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో చివరి రెండు అధ్యాయాలలో విశదీకరించాము. అంటే మనిషిలోని మనసులోపల 'నిజమైన ఉపకారి'కి సంబంధించిన భావన ఉంది. అది అన్నిటికన్నా పురాతనమైనది. అన్నిటికన్నా ఎక్కువగా ప్రస్ఫుటమైనది కూడా. మనిషి లోపల ఉన్న అతి పురాతన భావన 'భీతి భావన' అనీ, అది జగతిలోని బాహ్య దృశ్యాల కారణంగా జనించిందనీ, దాని మూలంగానే మనిషిలో ఆరాధనా భావం జనించిందన్న శాస్త్రవేత్తల వాదనను మేము అక్కడ ఖండించాము. అన్నిటికన్నా ముందు మనిషిలో జీవితం పట్ల, జీవన కారకాల పట్ల కృతజ్ఞతా భావం ప్రోది చేయబడిందని కూడా మేము విన్నవించుకున్నాము. ఈ జీవితం ఒక గొప్పవరం అన్న భావన లేనంత వరకూ అది ఎక్కడ లాక్కోబడుతుందోనన్న భావనకు అర్థమే లేదు. వరప్రసాదం పట్ల గల భావన వర ప్రదాత పట్ల గల భావనను ఉద్దీప్తం చేస్తుంది. వరప్రసాదం, వరప్రదాతకు సంబంధించిన చైతన్యం మనిషిలో ఆ

మహోపకారి పట్ల కృతజ్ఞతా భావాన్ని జనింపజేస్తుంది. ఈ (కృతజ్ఞతా) భావన ఏదో అలవాటుగా అబ్బినదీ కాదు, సామూహిక నాగరిక జీవితంలో పుట్టి పెరిగినదీ కాదు. పశువులలో సయితం ఈ భావన ఉంది. మనం మన ఇండ్లలో పెంచుకునే పశువులలో కూడా ఈ భావనను కళ్ళారా చూస్తాము. ఒక పిల్లి మొదలుకుని ఒక పెద్ద ఏనుగు వరకు– మనం వాటిలో దేనికి ఉపకారం చేసినా అవి తమదైన భాషలో తమ ప్రత్యుపకారాన్ని, కృతజ్ఞతా భావాన్ని అభివ్యక్తం చేస్తుంటాయి. ఇదే భావన మరింత ఉత్తమ రూపంలో మనిషిలో ఉన్నది. దానిని మనం వేరే మాటల్లో 'న్యాయం'గా 'ధర్మం'గా అభివర్ణిస్తూ ఉంటాము. దీని కారణంగా మనిషి పరిస్థితి ఎలా ఉంటుందంటే, ఏ కొలపాత్రతో అతనికి కొలిచి ఇవ్వబడుతుందో, అదే కొలపాత్రతో ఇతరులకూ కొలిచి ఇస్తాడు. ఈ న్యాయభావనే స్వచ్ఛమైన దైవదాస్యానికి, దేవుని ఏకత్వానికి పునాది వేసింది. ఇది తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించిన అత్యంత ముఖ్యమైన నిదర్శనాలలో ఒకటి. ఈ సహజ న్యాయం వాంఛించేదేమిటంటే, ఒక వైపున దేవునికి ఇవ్వవలసిన హక్కును అంగీకరించి తీరాలి. రెండవ వైపున అది కాంక్షించేదేమిటంటే దేవుని కొరకు ప్రత్యేకమై ఉన్న హక్కులలో– అకారణంగా– ఇతరులను భాగస్వాములుగా, సహవర్తులుగా ఖరారు చేయరాదు. దీనిని ఖుర్‌ఆన్ ఘోరమైన అన్యాయంగా, హక్కును హరించటంగా పేర్కొంది. వేరే మాటల్లో దీనికి అర్థం ఏమిటంటే అతి పెద్ద న్యాయం దేవుని ఏకత్వం. అన్నిటికన్నా పెద్ద అన్యాయం, దౌర్జన్యం షిర్క్ (బహుదైవ వాదన). ఈ న్యాయాన్ని ఖుర్‌ఆన్ మానవ నైజంలోని వాగ్దానంగా అభివర్ణించింది.

**ప్రవక్తా! ప్రజలకు ఆ సమయాన్ని జ్ఞాపకం చెయ్యి. అప్పుడు నీ ప్రభువు ఆదము సంతతి యొక్క వీపుల నుండి వారి సంతానాన్ని తీసి ఇంకా స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి అడిగాడు; "నేను మీ ప్రభువును కానా?" అని. వారు ఇలా అన్నారు: "నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దీనికి సాక్ష్యమిస్తున్నాము. మేము ఇలా ఎందుకు చేశామంటే, ప్రళయదినం నాడు మీరు, "మాకు ఈ విషయం తెలియదు" అని అనకుండా ఉండేటందుకు.** ***(అల్ ఆరాఫ్ : 172)***

ఈ వాగ్దానానికి సంబంధించిన యథార్థంపై మేము 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో క్లుప్తమైన ఓ ప్రసంగం రాశాము. అందులోని కొన్ని భాగాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము–

**ఈ రకమయిన 'ప్రమాణ స్వీకారం' ఒకటి ఆదిలోనే జరిగిందన్న సంగతి మాకేం తెలుసు? 'నేనే మీ ప్రభువును కానా?' అన్న విషయమూ మాకు తెలియదు. 'ఎందుకు కావు? నీవే కదా మా ప్రభువువి' అని జవాబు ఇచ్చిన సంగతి కూడా మాకు తెలీదు అని కొంతమంది అనవచ్చు. ఆ వ్యవహారానికి ఈ ఆయత్ ఒక రుజువుగా ఉంది. మరీ ముఖ్యంగా రేపు తీర్పుదినాన ఆదం పుత్రుడు సాకులు చెప్పబోయినప్పుడు ఇది అతనికి వ్యతిరేకంగా తిరుగులేని ఆధారంగా ఉండబోతోంది.**

**ఆశ్చర్యకరం! జనులకు తెలియనిదేముంది? ఒక మనిషి అత్యంత అల్పమైన ఒక నీటి బిందువు రూపంలో మాతృ గర్భంలో స్థలించబడతాడు. మాతృమూర్తి లెక్కలేనన్ని కష్టాల కోర్చి నవ మాసాలు అతనిని తన గర్భంలో మోస్తుంది. తన రక్తమాంసాలతో అతన్ని పోషిస్తుంది. తన ప్రాణాలను పణంగా పెట్టి పీడనను భరిస్తూ అతన్ని ప్రసవిస్తుంది. ఆ తరువాత తన శరీరంలోని ఒక్కొక్క రక్తపు బొట్టును పాలుగా మలచి ఆ శిశువుకు త్రాపుతుంది. ఈ విధంగా కొన్ని ఏండ్ల ప్రయాస తరువాతనే అతను ఈ నేలపై సంచరించే స్థితికి చేరుకుంటాడు. ఆ తరువాత తండ్రి అవ్యాజాను రాగాల, త్యాగాల, ఆలనా పాలనల వంతు వస్తుంది. అది కూడా ఒక సుదీర్ఘకాలం వరకూ కొనసాగు తుంది. ఆ వ్యవధిలో తండ్రి తన కోసం కోరుకునేదాని కన్నా అధికంగా ఆ పిల్లవాని కోసం కోరుకుంటాడు. అతను ఓ ముద్ద తక్కువ తిని పిల్లవానికి కడుపు నిండా పెడతాడు. తాను కష్టాల కోర్చుకుని కన్నపిల్లవానికి శాయశక్తులా సుఖసౌఖ్యాలనిస్తాడు. తాను తన ప్రాణాలను సయితం పణంగా పెట్టి పిల్లవాడికి**

పొంచివున్న ప్రమాదాల నుండి అతన్ని రక్షిస్తాడు. ఈ పరంపరలో ఏ ఒక్క లింకు తెగినా పిల్లవాని జీవితం, భవిష్యత్తు ప్రమాదంలో పడిపోతుంది.

ఇప్పుడు ఒకవేళ ఆ పిల్లవాడు యుక్త వయసుకు చేరుకుని, తల్లి దండ్రులలో వృద్ధాప్యం తొంగిచూస్తుండగా, వృద్ధ తల్లిదండ్రులు వేరొకరిపై ఆధారపడవలసిన అగత్యం ఏర్పడి ఉండగా కుమారుడు మంచి స్థితిలో ఉండి కూడా మాతాపితల బాగోగులను పట్టించుకోకపోతే ఎవరయినా తల్లిదండ్రుల హక్కులు బాధ్యతలను గుర్తు చేసినప్పటికీ అవేమిటో నేను జాన్తా నై అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తే అతని ఈ సమాధానం సమంజసం అనిపించుకుంటుందా? ఇలాంటి వాణ్ణి ఏ తండ్రీ క్షమించడు. పైగా అతన్ని తుచ్ఛుడనీ, దౌర్భాగ్యుడనీ అంటాడు. ఎందుకంటే వాడు తిరుగులేని ఒక హక్కును (తన బాధ్యతను) నిరాకరించాడు. ఈ ప్రత్యేకమైన హక్కు ప్రతి ఒక్కరినీ వెన్నంటి ఉంది. ఇది తిరుగులేనిది. దీనికి ఆధారాలు, సాక్ష్యాలు అక్కర లేదు. ఈ నిర్దిష్ట హక్కు (Privilege), ఈ బాధ్యత (Responsibility) ప్రకృతి సిద్ధమైనది. అది ప్రతి మనిషిపై- తిరుగులేని రీతిలో- విధితమై ఉంది.

ఈ ప్రాతిపదికపైనే ఒక మనిషి తాను లబ్ది పొందిన స్త్రీ పోషణా భారం వహించడానికి, ఆమె మానమర్యాదల పరిరక్షణకు బాధ్యత వహిస్తాడు. ఈ ప్రాతిపదికపైనే ఒక వ్యక్తిపై అతని కుటుంబ రక్షణ, వంశ రక్షణ బాధ్యతలు విధితమవుతాయి. ఈ ప్రాతిపదికపైనే ఒక నగర పాలక వ్యవస్థ ఆ నగర పౌరుల సంపాదనలో భాగస్వామి అవుతుంది. ఈ ప్రాతిపదికపైనే ఒక ప్రభుత్వం తన ఏలుబడిలో ఉన్న ప్రజల శక్తిసామర్థ్యాలు, తెలివితేటలు, ధన ప్రాణాలు దాని కొరకు వెచ్చించబడాలని కోరుతుంది. ఒకవేళ ఎప్పుడయినా రాజ్యం ప్రమాదంలో పడితే ప్రజలు తమ సర్వస్వాన్ని ఒడ్డి రాజ్యాన్ని రక్షిస్తారని ఆశిస్తుంది.

అయితే ఒకవేళ–

ఒక వ్యక్తి తన ఇల్లాలికి యజమాని అయి కూర్చున్నాడు. కాని ఆమెకు మనోవర్తి ఇవ్వాల్సిన బాధ్యత గానీ, ఆమె మాన మర్యాదలను కాపాడవలసిన విధిగానీ తనపైన లేదంటాడు. లేదా ఒక వ్యక్తి పురపాలక సంఘం వేసిన రోడ్లపై నడుస్తాడు. అది కల్పించిన ఆరోగ్య సదుపాయాలను ఎంచక్కా వినియోగించు కుంటాడు. దాని పార్కుల, హరిత వనాల ద్వారా లబ్ది పొందుతాడు. అది వేసిన కరెంటు దీపాల ద్వారా వెలుగును పొందుతాడు. అది స్థాపించిన పాఠశాలల ద్వారా ప్రయోజనం పొందుతాడు. కాని పురపాలక వ్యవస్థ పట్ల గల అతని బాధ్యత లను నెరవేర్చమని కోరినప్పుడు విముఖత ప్రదర్శిస్తాడు. (లేదా) అలాగే ఒక పౌరుడు తన రాజ్యంలోని పౌర హక్కులన్నింటినీ అనుభవిస్తున్నాడు. ఆ రాజ్యం కల్పించిన శాంతిభద్రతల ద్వారా, న్యాయశాఖ ద్వారా లబ్ది పొందుతు న్నాడు. కాని ఆ రాజ్యం అత్యవసర పరిస్థితిలో ఒక పౌరునిగా బాధ్యతలను నిర్వర్తించమని కోరినప్పుడు, ఆ బాధ్యతలేవీ తనకు వర్తించవని, అలాంటి వాటిని నెరవేరుస్తానని తానెప్పుడూ మాట ఇవ్వలేదని తప్పించుకున్నా డనుకోండి, అతని ఈ వైఖరి సమంజసమనిపించుకుంటుందా?

నువ్వు ఇచ్చే ఈ సంజాయిషీ తప్పుడు సంజాయిషీ అని భార్య అంటుంది. ఏ రోజున నీవు నా మానాన్ని ఉపయోగించుకునే హక్కు పొందావో, ఏ రోజున నేను నా శీలాన్ని నీకు మనస్ఫూ ర్తిగా అర్పించుకున్నానో ఆనాడే నీవు నాతో 'ఒక దృఢమయిన ఒడంబడిక' (మీసాఖె గలీజ్) చేసుకున్నావు– ఈ బాధ్యతలన్నిం టినీ నెరవేరుస్తానని! ప్రకృతి కూడా భార్యను సత్యవంతురాలిగా, భర్తను తుచ్ఛునిగా ఖరారు చేస్తుంది. ఇలాంటి సమాధానమే ఒక తెగ లేక వంశం పిరికివాడైన వ్యక్తికి ఇస్తుంది. పురపాలక సంఘం కూడా బాధ్యతా రహితుడైన పౌరునికి అదే సమాధానం ఇస్తుంది.

ప్రభుత్వం కూడా నమ్మకద్రోహి అయిన పౌరునికి అదే సమాధానం ఇస్తుంది. లోకమంతా ఈ సమాధానం సరైనదేనని, దుర్మార్గులైన వారిని శిక్షించి తీరాల్సిందేనని సాక్ష్యమిస్తుంది. ఎందుకంటే హక్కులను పొందే వ్యక్తిపై బాధ్యతలు కూడా ఉంటాయి. సూర్యచంద్రులు ఎంత సత్యమో ఇదీ అంతే సత్యం.

ఈ 'హక్కులు- బాధ్యతల' సహజమైన, సర్వతోముఖమైన శాసనం ఆధారంగా మన ఇంట్లోని పెంపుడు కోడి, మన చావిడిలో కట్టబడిన ఆవులు, గుర్రాలు, మన తోటలో నాటబడిన మొక్కలు, వృక్షాలకు కూడా మనపైన హక్కులుంటాయి. వాటిని గనక మనం కాదంటే ఎంతో బాధ్యతా రహితులమని అనిపించు కుంటాము. ఏ కోడి గుడ్డును, కోడిపిల్లలను మనం తింటామో, వాటిని పిల్లుల కుక్కల బారి నుండి కాపాడుకోవాలి. మనం ఏ ఆవు పాలు త్రాగుతామో, ఏ గుర్రంపై స్వారీ చేస్తామో వాటికి గ్రాసం వేయవలసిన బాధ్యత మనపైన ఉంది. వాటి అవసరాలను తీర్చటం వాటి యజమానిగా మన కర్తవ్యం. మనం ఏ పూవనం ద్వారా పరిమళాన్ని ఆస్వాదిస్తున్నామో, ఏ వృక్షాల పండ్లను తింటున్నామో వాటికి నీరు అందించాలి. వాటిలోని కలుపు మొక్కల్ని ఏరిపారేయాలి. వాటికి ఎరువు వేయాలి. ప్రకృతి వైపరీత్యాల నుండి, ఇతరత్రా ఆపదల నుండి వాటిని కాపాడటా నికి శాయశక్తులా యత్నించాలి. ఈ బాధ్యతను మనలోని వారెవరూ నిరాకరించలేరు. ఏ రోజు నుండి మనం వాటి ఉనికి ద్వారా లబ్ధి పొందామో ఆ రోజు నుండే వాటి రక్షణకు సంబంధించిన బాధ్యతలను కూడా అంగీకరించాము. ఇది 'హక్కులు- బాధ్యతల'కు సంబంధించిన ఒడంబడిక. ఇది ప్రతి లబ్ధిదారునిపై దానంతట అదే విధితమైపోతుంది. మనకు తెలిసిన లోకంలో, మానవ నైజంలో దీనికన్నా అనివార్యమైన వస్తువు మరొకటి లేదు.

**ఇప్పుడు ఆలోచించండి! తల్లిదండ్రుల హక్కుల్ని కాదనే హక్కు మనకు లేనప్పుడు, వారికన్నా ఎక్కువ హక్కు తల్లిదండ్రుల్ని పుట్టించిన వానికి ఉంటుంది. కట్టుకున్న ఇల్లాలి హక్కును నిరాకరించే హక్కు మనకు లేనప్పుడు మగవాని సుఖసౌఖ్యాల కోసం స్త్రీకి ఉనికిని ప్రసాదించిన వాని హక్కును మనం ఎలా కాదనగలం? మనం మన కుటుంబీకుల, వంశీయుల హక్కును అంగీకరిస్తున్నప్పుడు, పాలనాధీశుని హక్కును, ప్రభుత్వ హక్కును ఒప్పుకుంటున్నప్పుడు కుటుంబానికి, వంశానికి, పాలనాధీశునికి, ప్రభుత్వానికి ఉనికిని ప్రసాదించి, మానవ నైజంలో కుటుంబ ప్రేమను ప్రోదిచేసి, అతనిలో సంఘీభావాన్ని సృజించిన వాని హక్కును ఎలా తృణీకరించగలం? ఆయన ప్రభు సత్తాను, పోషకత్వాన్ని ఎలా కాదనగలం? మనం కోడి, పిల్లి హక్కును సయితం నిశ్శబ్దంగా అంగీకరిస్తున్నామే! ఆవు హక్కును, గుర్రం హక్కును సయితం నెరవేరుస్తున్నామే! మరలాంటప్పుడు పిల్లి, కోడి, ఆవు, గుర్రం, నదీనదాలు, సూర్యచంద్రులు, చెట్లు చేమలు, అగ్ని, వాయువు, నీరు– వీటన్నింటికీ ఉనికిని ప్రసాదించి వాటి ద్వారా మనకు లబ్ధిని చేకూరుస్తున్న సృష్టికర్త హక్కును ఎలా నిరాకరించగలం?**

ఈ ప్రసంగం ద్వారా తేటతెల్లమైన విషయమేమంటే న్యాయం అనేది మానవుని నైజంలో అంతర్లీనమై ఉంది. మరి ఈ నైజం వాంఛించేదేమిటంటే మానవుడు తన మహోపకారి హక్కును అంగీకరించాలి. ఆ మహోపకారి యొక్క అతి పెద్ద హక్కు, ఆయనకు కృతజ్ఞతాంజలి ఘటించటం. ఆ కృతజ్ఞతా భావం ఎలా ఉంటుంది? వేరొకరిని ఆయనకు భాగస్వాములుగా, సహవర్తులుగా ఎంచకుండా ఉండటం! ఈ వాస్తవమే హదీసుల్లో ఈ విధంగా బోధించబడింది: "దాసునిపై దైవానికి గల అతి పెద్ద హక్కు ఏమిటంటే అతను ఎవరినీ ఆయనకు సహవర్తులను కల్పించరాదు". ఇదే విషయం దైవప్రవక్త మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ఇలా వివరించి చెప్పారు:

**ఇంకా వారికి ఇబ్రాహీమ్ గాథను వినిపించు. అప్పుడు అతను తన తండ్రినీ, తన జాతి వారినీ, "మీరు వేటిని పూజిస్తున్నారు?" అని అడిగాడు. వారు, "ఇవి కొన్ని విగ్రహాలు, వాటిని మేము పూజిస్తాము. వాటి సేవలోనే మేము నిమగ్నులమై ఉంటాము" అని జవాబు పలికారు. అతను వారిని ఇలా అడిగాడు, "మీరు వీటిని పిలిచినప్పుడు, ఇవి మీ మొర ఆలకిస్తాయా? లేదా ఇవి మీకేమైనా లాభాన్ని గాని, నష్టాన్ని గానీ కలిగిస్తాయా?" వారు ఇలా అన్నారు 'లేదు, కాని మేము మా తాతముత్తాతలు ఇలా చేస్తూ ఉండగా చూశాము'. అప్పుడు ఇబ్రాహీమ్ ఇలా అన్నాడు, "మీరూ, పూర్వం మీ తాతముత్తాతలూ పూజిస్తూ వస్తున్న వాటిని ఎప్పుడైనా మీరు (కళ్లు తెరిచి) చూశారా? నాకు ఇవన్నీ శత్రువులే, ఒక్క సకల లోకాల ప్రభువు తప్ప. ఆయన నన్ను సృష్టించాడు. తరువాత ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు. నేను వ్యాధికి గురి అయినప్పుడు, ఆయనే నాకు స్వస్థతను చేకూరుస్తాడు. ఆయనే నాకు మృత్యువును కలిగిస్తాడు. తరువాత మళ్ళీ నాకు జీవితాన్ని అనుగ్రహిస్తాడు. తీర్పుదినం నాడు నా పాపాలను క్షమిస్తాడని నేను ఆయన మీద ఆశలు పెట్టుకున్నాను."**

**(అష్ షుఅరా : 69-82)**

అంటే మహోపకారి అయిన ఒక అస్తిత్వం, ఆయనే మనల్ని పుట్టించాడు. పుట్టించి అలాగే వదలిపెట్టేయలేదు. పైగా మన నైజంలో మార్గబోధనకు సంబంధించిన చైతన్యాన్ని పొందుపరిచాడు. మనకు అన్నపానీయాలు ప్రసాదించాడు. జబ్బు చేసిన తరువాత స్వస్థతను ఇచ్చాడు. ఆయనే మనకు మరణం ఇస్తాడు. తరువాత మన ఆచరణలకు ప్రతిఫలం ఇచ్చేటందుకు మనల్ని మళ్ళీ బ్రతికిస్తాడు. పరలోకంలో కూడా ఆయన మన పట్ల దయా దాక్షిణ్యాలతో వ్యవహరిస్తాడని ఆశిద్దాం. అలాంటి గొప్ప అస్తిత్వాన్నే మనం సేవించాలి. మన దాస్యాన్ని, సకల ఉపాసనా రీతులను ఆయనకే ప్రత్యేకించుకోవాలి. దీనికి సంబంధించిన సాక్ష్యం, నిదర్శనం మన వద్ద ఉంది.

మన సహజన్యాయం కోరేదేమిటంటే, మనం మన మహోపకారి చేసిన ఉపకార హక్కును 'కృతజ్ఞత' రూపంలో చెల్లించాలి. ఇదే న్యాయం. ఈ న్యాయం కోరుకునేదేమిటంటే; అల్లాహ్‌కు చెందవలసిన హక్కులో– నిరాధారంగా– ఇతరులను చేర్చకూడదు. ఇది చాలా పెద్ద అన్యాయం. బాహాటంగా చేసే అతి పెద్ద జులుమ్.

## 2) మానవ నైజం జ్ఞానార్జనకై తహతహలాడుతుంది

మానవ నైజంలోని రెండవ విశిష్టత ఏమిటంటే అతడు అంధకారం, అజ్ఞానపు తమస్సుకు బదులు విజ్ఞాన జ్యోతిని ఇష్టపడతాడు. అశాంతి, అలజడుల బదులు ప్రశాంతతను, నెమ్మదిని కోరుకుంటాడు. సువిశాలమైన ఈ జగతి ఒక పజిల్‌గా మిగిలిపోవడాన్ని మానవుడు ఓర్చుకోలేడు. దాని ఆరంభం– అంతం గురించి తాను చీకట్లో పడి ఉండటాన్ని అతను జీర్ణించు కోలేడు. తన జీవిత లక్ష్యం ఏమిటో, తాను చేసే మంచీచెడులేవో తెలియకపోతే అతను ఊగిసలాటలో ఉండిపోతాడు. ఏమీ తెలియకపోయినా కనీసం తాను ఎక్కడి నుంచి వచ్చాడు, ఎక్కడికి పోతాడు, తన పట్ల జరిగే వ్యవహారం ఏమిటి, తాను ఇతరుల పట్ల ఏ విధంగా జీవించాలి? అనేది తెలియాలని ఉబలాట పడతాడు. తనలో ఉత్పన్నమైన ప్రశ్నలన్నింటిపై చింతన చేయాలనీ, వాటికి పరిష్కారం వెతకాలనీ, ప్రతి దానిపై సకారాత్మకంగానో, నకారాత్మకంగానో ఆజ్ఞ విధితం కావాలని అతని నైజం కోరుకుంటుంది. అతను ఏదైనా సందేహానికి తప్పుడు పరిష్కారం కనుగొని, దానిపై స్థిరంగా ఉండటం కూడా సంభవమే. కాని ఈ ప్రశ్నల పట్ల పూర్తిగా విముఖత చూపటం అనేది జరగదు. మానవుడు ఎంతసేపటికీ చీకట్లలో తచ్చాడుతూ ఉండటం అసంభవం.

మనిషిలోని ఈ సహజ కోరిక కారణంగానే అతను సాధన చేస్తాడు. శోధన సాగిస్తాడు. ఈ శోధనలో వివిధ రకాల దక్కాముక్కాలు తింటాడు. ఒక్కో సారి అతను సరైన వస్తువును పొందలేక తప్పుడు మార్గాన్నే అవలంబిస్తాడు. కాని అతడు ఈ ప్రశ్నలకు జవాబులు అన్వేషించకుండా, నిర్లక్ష్యంగా ఉండిపోవటం అనేది మాత్రం ఎప్పుడూ జరగలేదు. ఇదొక సహజమైన దాహం. ఈ దాహం తీరటం అనివార్యం. ఏ వస్తువు ద్వారా అతని దాహం తీరుతుందో అదే దానికి సరైన జవాబు. ఈ దాహం కేవలం అల్లాహ్‌పై ఈమాన్ (విశ్వాసం)

ద్వారానే తీరగలదు. ఇది మినహా మిగిలినవన్నీ అసహజమైనవి. దాహం తీర్చనివి. వాటి ద్వారా మనిషి తన నైజానికి మోసం చేయవచ్చేమోగాని, నెమ్మదిని, ప్రశాంతతను పొందటం సాధ్యం కాదు. కేవలం అల్లాహ్‌ను కనుగొని, ఆయన్ని స్మరించటం ద్వారానే నెమ్మది ప్రాప్తిస్తుంది. **"తెలుసుకోండి! దైవ నామస్మరణ ద్వారానే మీ హృదయాలకు నెమ్మది ప్రాప్తమవుతుంది".** ఈ జ్యోతి మెరవగానే యావజ్జగతి, దాని ఆది అంతం అవగతం అవుతుంది. "అల్లాహ్ ఆకాశాలకూ, భూమికీ వెలుగు" (24: 35). ఆయన్ని పొందిన తరువాత మనిషిలో రేకెత్తిన సందేహాలన్నీ తొలగిపోతాయి. ఇప్పుడు అతను ఈ జగతి ఆద్యంతాల గురించి ఊహించగలడు. సువిశాలమైన ఈ లోకంలో తన స్థానం ఏమిటో, తన లక్ష్యం ఏమిటో నిర్ణయించుకుంటాడు. తన కర్తవ్యం ఏమిటో అర్థం చేసుకుంటాడు. ఇప్పుడు అతని కొరకు నైతిక నియమాలు, ఆర్థిక సూత్రాలు, రాజకీయ సిద్ధాంతాలు– అన్నీ నిర్ధారితమవుతాయి. ఇప్పుడు అతను తన గతానికి సంబంధించి, భవిష్యత్తుకు సంబంధించి అత్యున్నతమైన నిర్ణయాలు గైకొంటాడు. కేవలం అంచనాల ఆధారంగా ఊహాస్త్రాలు సంధించడు. ఇప్పుడతనికి బుద్ధి పంచేంద్రియాల తరఫున ఎలాంటి దురనుమానం కూడా ఉండదు. తనను నిరాశకు లోను చేసుకోడు. తనను తాను అల్పంగా భావించుకోడు. అతను ఏ దిశలో ముందడుగు వేసినా అది వజ్ర సంకల్పంతో కూడుకున్నదై ఉంటుంది.

దీని తర్వాత కూడా ఏ వ్యక్తయినా ఈ పరిష్కారాన్ని అంగీకరించకపోతే, బహుశా అతని బుద్ధిజ్ఞానాలు అతన్ని మోసపుచ్చుతూ ఉండవచ్చు. ఇది ఒక రకంగా అత్యంత జడత్వానికి ప్రతీక. నిశ్చయంగా మనిషి పంచేంద్రియాల వల్ల తప్పు జరగవచ్చు. కాని అవి సదా తప్పులు చేయటానికే లేవు. నిశ్చయంగా కొన్ని సందర్భాలలో మనం మన బుద్ధి ఫలితాలను అంచనా వేయటంలో మరుపునకు గురికావచ్చు. కాని అది మనిషిని మోసగించేందుకు లేదు. మనుషుల అభిప్రాయాలలో, వారి నిర్ణయాలలో తీవ్రమైన విభేదం ఉంటే ఉండొచ్చు. కాని మధ్యన గల ఏకాభిప్రాయ కోణాన్ని పూర్తిగా ఉపేక్షించటం సరైంది కాదు. పైగా అది మార్గబోధనను తిరస్కరించటం వంటిదే. ఈ ధోరణి మానవుని నైజానికి ఆసాంతం వ్యతిరేకమైనది. ఇదొక కృత్రిమ పరిస్థితి. దానిని

మనిషి మొగమాటం కొద్దీ అవలంబించాడు. అన్యథా అతని జీవితంలోని ఒక్కొక్క చర్య అతని నమ్మకానికి సాక్షిగా ఉంది. అతను నమ్మకాన్ని అవలంబిస్తున్నాడు. నమ్మకం లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయడు. అతను ఒక 'లా అహ్దీ' అనటం ద్వారా అసంఖ్యాకమైన నమ్మకాల ప్రకటన గావిస్తాడు. అతని నమ్మకాలన్నింటిలో అన్నిటికన్నా పెద్ద నమ్మకం ఆ ఒక్క అస్తిత్వంపై నమ్మకం. దానికి సంబంధించిన సాక్ష్యాధారం అతనికి తన అంతరంగంలోనూ, బాహ్యంలోనూ లభిస్తోంది. దానిని అంగీకరించనంత వరకూ ఈ జగమంతా అంధకారమే. కాగా, మానవుడు అంధకారంపై రాజీ పడిపోవటం అనేది జరగని పని. అతను తన సహజత్వాన్ని చెరిపి వేసుకుంటే అది వేరే విషయం. కాబట్టి దేవుడున్నాడనీ, ఆయన తన పరిపూర్ణ గుణాలన్నింటితో అలరారుతున్నాడనడానికి అతిపెద్ద సాక్ష్యాధారం ఏమిటంటే, ఆయన లేకుండా ఈ జగతికి సంబంధించిన పజిల్ పరిష్కారం కాజాలదు. స్వయంగా మానవుని ఉనికి పరమార్థం కూడా తెలిసి రాదు. ఇదొక్కటే ఈ సమస్యకు సంతృప్తికరమైన సమాధానం. దీని ద్వారా చిక్కుముడులన్నీ విచ్చుకుంటాయి. ఈ పరిష్కారానికి, దీని సత్యతకు అతిపెద్ద రుజువు ఏమిటంటే, ఇది ఆంతర్యంలో రేకెత్తిన సందేహానికి సరైన సమాధానం. మానవ నైజం కాంక్షించే దానికి తగిన జవాబు. దీని కొరకు తార్కిక, తాత్విక నిదర్శనాల అవసరం లేదు.

కాబట్టి తేలిందేమంటే సకల గుణగణాల దర్పంతో భాసిల్లుతున్న ఏకైక దైవాన్ని నమ్మి నడుచుకోవటం మానవ నైజం. దీని తరువాత కూడా ఎవరయినా, తమ కొరకు కొన్ని ఇలవేలుపులను చేసుకుంటే అది అపమార్గానికి, మార్గభ్రష్టత్వానికి తార్కాణం. ఎందుకంటే ఒక్కడైన దైవాన్ని అంగీకరించిన తరువాత మానవ నైజం వాంఛించేది నెరవేరుతుంది. ఆపైన కూడా మరో అదనపు వస్తువును అంగీకరించటమంటే, నిజమైన విషయం అంటూ ఒకటి ఉండగా, దానిపై అనుబంధ అంశాలను, పాక్షిక విషయాలను చేర్చటం అనవసరం, అనర్థదాయకం. ఇది స్పష్టమైన మార్గభ్రష్టత్వం. అందుకే ఖుర్ఆన్‌లో ఎన్నో చోట్ల సెలవీయబడిన విషయమేమంటే, ఎవరైతే నిజ ఆరాధ్య దైవంతోపాటు వేరితరులకు భాగస్వామ్యం కల్పిస్తారో అలాంటి వారి వద్ద ఏ

ఆధారమూ లేదు[1]. అంటే ఒకే దైవాన్ని నమ్మి నడుచుకోవటం ఎందుకు అవసరం అంటే మానవ నైజం అది లేకుండా నెమ్మదించదు. దీనికి సంబంధించిన సాక్ష్యాధారం మనిషి లోపలా ఉంది. బయట కూడా ఉంది. కాని దాంతోపాటు వేరితరులను దైవత్వంలో భాగస్వాములుగా చేర్చుకోవటం, ఒక నిరాధారమైన విషయం.

**కనుక అల్లాహ్ మహోన్నతుడు, నిజమైన చక్రవర్తి. ఆయన తప్ప మరొక దేవుడు లేనే లేడు, గౌరవ పీఠానికి స్వామి. ఎవడైనా అల్లాహ్‌తోపాటు మరొక ఆరాధ్యుణ్ణి వేడుకుంటే, దానికి అతని వద్ద ఏ ప్రమాణమూ లేదు. అతని లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది. అటువంటి అవిశ్వాసులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు.**

***(అల్ మోమినూన్ : 116,117)***

అంటే దేవుని ఏకత్వపు సాక్ష్యాధారాన్ని మానవుడు తన లోపల, బయట కూడా పొందుతున్నాడు. కనుక దానిని అంగీకరించటం అతని బుద్ధి, నైజం వాంఛించే విషయమే. కాని అతడు ఈ నిజ దైవంతోపాటు ఎలాంటి ఆధారం లేకపోయినా– వేరితరులను కూడా దైవత్వంలో చేర్చే మాటైతే అది మానవుని దౌర్భాగ్యానికి ఆనవాలు. పై ఆయత్‌ల ద్వారా సుబోధకమైనదేమిటంటే, ఒక బహుదైవారాధకునికి ఎదురుగా ఒక ఏకేశ్వరోపాసకుడు దేవుడున్నాడని రుజువు చేయాల్సిన పని లేదు. అలాగే భాగస్వాముల మిథ్యపై సాక్ష్యాధారాలను స్థాపించవలసిన అవసరం కూడా లేదు. ఎందుకంటే బహు దైవారాధకుడు ఒక్కడైన దైవాన్ని ఎలాగూ నమ్ముతాడు. ఇది బహు దైవారాధకునికి– ఏకేశ్వరోపాసికి మధ్యన ఉమ్మడి విషయం. ఇక మిగిలినవి వారు తమ మనసు కోరినట్లుగా కల్పించుకున్న భాగస్వాములు. వాటికి అనుకూలంగా గాని, ప్రతికూలంగా గానీ ప్రమాణాలను సమర్పించవలసిన అవసరమే లేదు. వాటిని

1. "దారిలో పెడదారి తీసి, వేరుపోయిన చెలిమి కొరకు
చేరకూడని పొందులందు– జారిపోయిన బలిమి కొరకు
నిన్ను కాదని వాడ వాడన– తలను వంచిన వాడనయ్యా
నిన్ను వదలి గడప గడపన బ్రతుకు గడిపిన వాడనయ్యా"
అని కీలెరిగి వాత పెట్టారు గీటురాయి సంపాదకులు మలిక్ గారు.

ఖండించడానికి ఒకే ఒక్క ప్రమాణం చాలు– అదేమంటే అసలు వాటి ఉనికికి సంబంధించిన రుజువు ఏదీ లేదు.

## 3) మానవ నైజం- దాని ఔన్నత్యం

దేవుని ఏకత్వానికి (తౌహీద్‌కు) సంబంధించిన ఒక చాలా పెద్ద ఆంతరంగిక ప్రమాణం మానవ నైజంలోని ఔన్నత్య భావన. మానవుడు స్వతహాగా పరాభవాన్ని, అణగి ఉండటాన్ని, దాస్యం చేయడాన్ని సహించలేడు. అతడు సర్వదా నాయకత్వం వహించాలని, పెత్తనం చెలాయించాలని కోరుకుంటాడు. అతడు తన శక్తిసామర్థ్యాలను, తెలివి తేటలను, అద్భుతాలను చూసుకున్నప్పుడు, ఈ లోకంలో తనతో సరితూగే ప్రాణి ఏదీ లేదని భావిస్తాడు. ఈ ఆధిక్యతా భావానికి గల కారణాలలో ఒక పెద్ద కారణం ఏమిటంటే, అతడు సృష్టి శ్రేష్టుడు, దేవుని ప్రతినిధి (ఖలీఫా). అతను సహజంగానే ఆ శ్రేష్ఠతను, ప్రాతినిధ్య భావనను పుణికిపుచ్చుకుని ఈ లోకంలో అడుగు పెట్టాడు. ఒకవేళ ఈ హోదా రీత్యా అతనిలో ఈ ఔన్నత్య భావనను పాదుగొల్పకుండా ఉంటే, అతడు ఖచ్చితంగా తన స్థాయికి తగినట్లుగా బరువు బాధ్యతలను మోయగలిగే వాడు కాడు. ఈ యథార్థాన్ని ఎంతో ఉత్తమ రీతిలో **ఇన్నా అరజ్‌నల్ అమానత అలస్సమావాతి..** (మేము ఈ అమానతును ఆకాశాల ముందూ, భూమి ముందు, పర్వతాల ముందూ పెట్టాము. అవి దానిని మోయటానికి సిద్ధపడలేదు. దానికి భయపడ్డాయి. కాని మానవుడు దానిని తనపై మోపుకున్నాడు) (33: 72) అని ఖుర్‌ఆన్‌లో విశదపరచటం జరిగింది. కాని ఇక్కడ దాని వివరాల్లోకి పోయేందుకు అవకాశం లేదు. అయితే ఈ ఆధిక్యతా భావం కారణంగానే మానవుడు ఒక్కోసారి తనను దైవంగా ప్రకటించుకోవటాన్ని కూడా మనం చూస్తూ ఉన్నాము. అప్పుడప్పుడూ **"అనా రబ్బుకుముల్ ఆలా"** (నేనే మీ అందరికీ ఉన్నత ప్రభువును) అనంటాడు. ఒక్కోసారి **"అనా ఉహ్‌యీ ఉమయ్యితు"** (నేనే బ్రతికిస్తాను, చంపుతాను) అని కూడా అంటాడు. ఒక్కోసారి జాతుల మెడలు తన అధీనంలో ఉన్నాయని ప్రగల్భాలు పలుకుతాడు. ఒక్కోసారి ఈ నేలకూ, సముద్రాలకు తానే చక్రవర్తినని అనుకుంటాడు. 'దాసుని' స్థానంలో 'తాగూత్'గా తయారై దేవుని ధరిత్రిలో తన శాసనాలను, తన ఆజ్ఞలను అమలుపరచటం మొదలెడతాడు.

కాని ఈ ఆధిక్యతా భావనతోపాటు అతనొక యథార్థాన్ని గమనిస్తాడు. తన శక్తియుక్తులన్నీ తెలివితేటలన్నీ బాల్యానికి– వృద్ధాప్యానికి నడుమ రెండు బలహీనతల మధ్య చిక్కుకుని ఉన్నాయని గ్రహించినప్పుడు అతను దైవత్వపు పీఠాన్ని వదిలిపెట్టి, దాస్యపు వరుసలో వచ్చి నిలబడాల్సి ఉంటుంది. ఏ ఒక్కరి ముందు కూడా వంగటానికి సిద్ధంగా లేని తన నుదుటిని భూమ్యాకాశాల నిర్మాత, సమస్త శక్తియుక్తులకు మూల సరోవరం అయిన నిజ దైవం ముందు వంచాల్సి వస్తుంది. ఈ అణకువను మనిషి అవలంబిస్తాడంటే తనలోని బలహీనతా భావం వల్లనో లేక ఎవరినయినా దేవునిగా ఆశ్రయించే ఉత్సాహం వల్లనో కాదు. అతనిలోనైతే దేవుడై కూర్చోవాలన్న తహతహ మాత్రమే ఉంటుంది. కాని అతడు తన ఆశల పల్లకిలో విహరిస్తూనే తన శక్తియుక్తుల పరిమితుల్ని కూడా చూసుకుని గత్యంతరం లేక ఒక అగోచర శక్తి ముందు ఆత్మ సమర్పణ చేసుకుంటాడు. ఇలా చేయటం వినా మార్గాంతరం ఉండదు. ఏ ఉన్నత శక్తి యొక్క పరిపూర్ణ సామర్థ్యంతో ఈ విశ్వ కర్మాగారం ఉనికిలోనికి వచ్చిందో, ఎవరి ఉపాయంతో, పరిపాలనా దక్షతతో ఈ విశ్వ వ్యవస్థ అంతా నడుస్తుందో ఆయన సార్వభౌమత్వాన్ని అంగీకరించటం తప్ప అతనికి గత్యంతరం ఉండదు. మనిషిలోని మనసులో ఈ ఔన్నత్య, ఆధిక్యతా భావన ఎంత తీవ్రంగా ఉందంటే, దీని మూలంగా అతడు ఒక్కోసారి ఏ విధంగానూ సత్యాన్ని ఒప్పుకోవడానికి సంసిద్ధుడవడు. దైవప్రవక్త మహనీయు ఇబ్రాహీమ్(అ)కి– ఒక చక్రవర్తికి మధ్య సాగిన సంవాదన అల్ బఖరా సూరాలో వచ్చింది. "చావు బ్రతుకులు నా అధీనంలోనే ఉన్నాయి. కాబట్టి నేనే మీ అందరి ప్రభువు" అని ఆ చక్రవర్తి పలికినప్పుడు, "అల్లాహ్ సూర్యుణ్ని తూర్పు నుండి ఉదయింపజేస్తాడు కదా, నీవు కాస్త దానిని పడమర నుండి ఉదయింపజెయ్యి" అని ఇబ్రాహీమ్(అ) సవాలు విసిరినప్పుడు ఆ చక్రవర్తి బిత్తరపోయాడు. అవాక్కయ్యాడు. కాని మనసులోని ఆధిక్యతా భావపు షైతాన్ ఎంత పొగరు బోతు అంటే, అతడు అవాక్కయిన మీదట కూడా నిజ దైవాన్ని అంగీకరించ డానికి సిద్ధం కాలేదు. ఎవరి బుద్ధి సరైన దిశలో ఉంటుందో, ఎవరు తమ మనస్సాక్షిని గౌరవిస్తారో వారు మాత్రమే తమలోని ఔన్నత్య భావనకు– అశక్తతకు మధ్య సమత్వం, సమతూకం పాటిస్తారు. వారు ఒక వివేచనా పరుని ఎదుట తలవంచి తమలోని అశక్తతకు, బలహీనతకు చికిత్స పొందుతారు.

తద్వారా వారి మనసు కుదుట పడుతుంది. ఆ తరువాత కూడా ఒకవేళ ఎవరయినా ఒక వ్యక్తి వేరొక ఆస్థానంలోకి వెళ్ళి తలవంచినట్లయితే అతని ఉపమానం దైన్యం రుద్దబడిన బిచ్చగాడి వంటిది. అతడు ఒక గడప వద్ద తనకు కావలసిన దానిని పొందిన తరువాత కూడా గడప గడప వద్దకు పోయి 'ధర్మం చేయండి బాబూ, ధర్మం చెయ్యండమ్మా!' అని అరుస్తూ ఉంటాడు.[1] అతని స్వభావంలోని దీనావస్థ ఎంతకి దిగజారిపోతుందంటే, ఒక్కోసారి తనకన్నా అల్పమైన, నిస్సహాయులైన వారి ముందు కూడా చేయి చాపి అర్థించటానికి సిగ్గుపడడు.

వాస్తవానికి మానవుని ఈ పరిస్థితి అతని సిసలైన నైజం కానే కాదు. కాని అది అతని నైజంలో పొడసూపిన విచ్ఛిన్న స్థితి. ఏ విధంగానయితే బిచ్చగాళ్ళ సంఖ్య విపరీతంగా పెరిగిపోయినప్పటికీ మానవుని సిసలయిన నైజం ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం అని మనం నమ్ముతామో అదేవిధంగా బహు దైవారాధకుల సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ మానవ నైజం వాంఛించేది మాత్రం దేవుని ఏకత్వమే (తౌహీద్ మాత్రమే). ఒక భార్య తన భర్తకు తన సర్వస్వాన్ని ఎందుకు అర్పిస్తుందంటే తనలో ఉన్న వెలితిని, అసంపూర్ణతను అతను పూరిస్తాడని ఆశించి మరీ అర్పిస్తుంది. భర్తగా అతడు తన నిర్వహణా కర్తవ్యాన్ని నెరవేర్చనంతవరకు ఈ ఉద్దేశం నెరవేరదు. ఇప్పుడు ఇల్లాలు గనక తనలోని వెలితిని పూరించుకున్న మీదట కూడా పరాయి మగాళ్ళతో చాటుమాటు సరసాలాడితే ఆమె ఒక లంజగా పరిగణించబడుతుంది. ఆమె తన శీల కుసుమాన్ని, సిగ్గు పట్టును, తన స్వాభిమానంలోని సౌందర్యాన్ని, తన పౌరుషంలోని సొగసును పూర్తిగా పోగొట్టుకుంది.

కాబట్టి– ఏ వ్యక్తి అయినా దైవాన్ని నమ్ముతున్నాడంటే, ఎవరయినా ఒకరిని దైవంగా చేసుకోవాలన్న అభిరుచితో చేసుకోడు. దేవుని అవసరం తనకు

---

1. "నిన్ను కాదని వాడవాడన తలను వంచిన వాడనయ్యా!
నిన్ను వదలి గడప గడపన బ్రతుకు గడిపిన వాడనయ్యా!
దిక్కులన్నీ తిరిగి విసిగి, చిక్కుబడినది బ్రతుకునయ్యా!
బిక్కవోయిన బాటసారిని చక్కదిద్దే దారి లేదా?"
అని ఇలాంటి వారి గురించి ఆవేదనను వ్యక్తం చేశారు గురువర్యులు మలిక్ గారు.

ఉంది గనకనే దైవాన్ని నమ్ముతాడు. తనకు ఎన్నో శక్తిసామర్థ్యాలు, తెలివి తేటలు ఉండి కూడా అతను ఏదో వెలితి తనలో ఉందని భావిస్తాడు. దైవాన్ని నమ్మి నడుచుకోనంత వరకు ఆ వెలితి పూరించబడదు. దైవాన్ని నమ్మిన మీదట ఆ ఖాళీ భర్తీ అయిపోయింది. ఇప్పుడు ఒకవేళ అతనితో ఎవరైనా, ఒకే దైవంతో పాటు మరికొంతమంది పూజనీయులు ఉన్నారు, వారిని కూడా పూజించు అని అంటే, 'నాకు ఒకే ఆరాధ్య దైవం చాలు. ఒకవేళ మీకు ఇతర ఆస్థానాలలో కూడా మోకరిల్లే ఆకాంక్ష ఉంటే మీరు పోయి ఆ పరాభవాన్ని సహించండి. నేను మాత్రం రానుగాక రాను' అంటాడు.

మానవ నైజంలోని ఈ ఉన్నతి గురించే మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్) తన ప్రసంగంలో సూచించారు. చెరసాలలోని తన సహచరులనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఇలా అన్నారు :

**అసలు విషయం ఏమిటంటే, అల్లాహ్‌ను విశ్వసించని వారి, పరలోకాన్ని తిరస్కరించే వారి విధానాన్ని నేను వదలిపెట్టి, నా పెద్దలైన ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్, యాఖూబ్‌ల విధానాన్ని అవలంబించాను. ఎవడినైనా అల్లాహ్‌కు భాగస్వామిగా చెయ్యటం మా విధానం కాదు. వాస్తవానికి ఇది అల్లాహ్ అనుగ్రహమే మనపైనా, సమస్త మానవులపైనా (ఆయన మనలను తనకు తప్ప ఇతరులెవ్వరికీ దాసులుగా చెయ్యలేదు అనేది). కాని చాలామంది ప్రజలు కృతజ్ఞతలు చూపరు. నా తోటి ఖైదీలారా! స్వయంగా మీరే ఆలోచించండి, చాలామంది విభిన్న ప్రభువులు మేలా లేక సర్వశక్తిమంతుడు అయిన ఏకైక దేవుడు అల్లాహ్ మేలా? ఆయనను కాదని మీరు దాస్యం చేస్తున్నవారు, మీరూ మీ తాత ముత్తాతలూ కల్పించుకున్న కొన్ని పేర్లు మాత్రమే తప్ప మరొకటేమీ కాదు. వారి కొరకు అల్లాహ్ ఏ నిదర్శనాన్నీ అవతరింపజెయ్యలేదు. పరిపాలించే అధికారం**

**అల్లాహ్‌కు తప్ప మరొకరెవరికీ లేదు. ఆయనను తప్ప మీరు ఎవరి దాస్యాన్నీ చెయ్యకూడదని ఆయన ఆజ్ఞ. ఇదే శుద్ధమైన, సరైన జీవిత విధానం. కాని ఇది చాలామందికి తెలియదు.**

***(యూసుఫ్ : 38-40)***

ఈ ప్రసంగంలోని తొలి భాగం సారాంశం ఏమిటంటే అల్లాహ్ ప్రత్యేక కృప మనపై ఉంది. ఆయన, తనను గాక మరెవరినయినా పూజించమని, వారి దాస్యం చేయమని ఆదేశించలేదు. ఆయన మనిషిలో ఆత్మాభిమానం, ఆధిక్యతా భావం, ఔన్నత్య భావనను ప్రోది చేశాడు. అతని మాన మర్యాదలను, గౌరవా దరణలను దృష్టిలో ఉంచుకుని పరాయివాళ్ళ ముందు తలవంచే అవమానం నుండి మనిషిని కాపాడాడు. కేవలం తన ముందు మాత్రమే మోకరిల్లమని ఆజ్ఞాపించాడు. కాని మానవుడు అల్లాహ్ ప్రసాదించిన ఈ భాగ్యానికి గాను కృతజ్ఞతలు చెల్లించలేదు. ఏ కారణమూ లేకుండానే అతడు తన మనసు పవిత్రతకు కళంకం అంటించుకున్నాడు. తనకన్నా హీనమైన, అల్పమైన జీవుల ముందు సాగిలపడ్డాడు.

ఆ తరువాత ఏమనబడిందంటే, మనిషికి దేవుని అవసరం ఉంది. ఆయన్ని నమ్మి నడుచుకోవటం అతనికి అవశ్యం. మానవుడు తన మనసులో ఆధిక్యతా భావం, ఉన్నతి ఉండి కూడా దైవాన్ని నమ్ముతాడు. ఆయన్ని నమ్మ నంతవరకు అతని నైజంలోని వెలితి (ఖాళీ) పూరించబడదు. ఇప్పుడు మెరుగైనది ఏది? అన్నది ప్రశ్న. ఎందరో వేర్వేరు యజమానులు ఉండాలా? వారందరి ఊడిగం చేయాలా? లేక తిరుగులేని ఒకే దైవానికి విధేయత చూపాలా? ఆత్మాభిమాని అయిన మనిషికి ఒకే ప్రభువు దాస్యం చాలు. అదే ఎక్కువ. అతను ఎందరో ప్రభువులను కల్పించుకోవాల్సిన అవసరం ఏముంది? ఆ ఒకే దేవుడు ఇతరుల ఊడిగం కూడా చేయండి అని చెప్పి ఉంటే దానికి సంబంధించిన రుజువు అవసరం. కాని అలాంటి రుజువు ఏమీ లేదు. దీనికి పూర్తి భిన్నంగా ఆయన ఆజ్ఞ ఏమిటంటే, ఒక్కడైన ఆ దైవాన్ని ఆరాధించాలి. ఇదే ప్రకృతి ధర్మం. సవ్యమైన జీవన సంవిధానం. మానవనైజం కూడా దీని సాక్ష్యాధారాలను తన లోపల, బయట కూడా గ్రహిస్తోంది. కాని ప్రజలలో చాలామంది తమ ప్రకృతి ధర్మాన్ని తెలుసుకోలేదు. షిర్క్ అనే మార్గ విహీనతా లోయల్లో తచ్చాడసాగారు.

మానవ నైజంలోని ఈ 'ఉన్నతి' ఆధారంగానే ఒక బహు దైవోపాసకుని– ఒక ఏకేశ్వరోపాసకుని ఉపమానం విశదీకరించబడింది. మానవుడు స్వతహాగా తౌహీద్‌ను ఇష్టపడతాడు గాని షిర్క్‌ను కాదు అన్నది దాని సారాంశం.

**అల్లాహ్ ఒక దృష్టాంతం ఇస్తున్నాడు– ఒక వ్యక్తి ఉన్నాడు : అతనికి తమ తమ వైపు లాగే జగడాలమారులైన యజమానులు ఎందరో ఉన్నారు. మరొక వ్యక్తి ఉన్నాడు: అతను పూర్తిగా ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. ఆ ఇద్దరు వ్యక్తుల పరిస్థితి ఒక్కటే అవుతుందా? అల్‌హమ్దులిల్లాహ్! (అల్లాహ్‌కే కృతజ్ఞతలు). కాని వారిలో చాలామందికి తెలియదు.** *(అజ్ జుమర్– 29)*

అంటే వివిధ స్వభావాలు, వివిధ ఉద్దేశాలు గల అనేకమందికి బానిసగా ఉండటాన్ని ఎవరయినా ఎలా సహిస్తాడు? ఒక బానిస ఈ అవమానాన్ని భరించటానికి ఇష్టపడనప్పుడు, ఒకే ఆరాధ్య దైవంతోపాటు తన మనసు మెచ్చిన ఇతర అనేక దేవుళ్ళను చేర్చుకోవటాన్ని మనిషి ఎందుకు సహిస్తాడు? ఏమిటీ, ఒకే యజమాని క్రింద ఉన్న బానిస, అనేకమంది యజమానుల క్రింద ఉన్న బానిస సమానులవుతారా? ముమ్మాటికీ సమానులు కాలేరు. ఆ తరువాత మానవ నైజం ఎలుగెత్తి చెబుతుంది– **'అల్‌హమ్దులిల్లాహ్'** కృతజ్ఞతలు అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి– వేరితరులు ఎవరూ ఆయనకు సహవర్తులుగా లేరు. మనిషిలో ఈ భావ ఔన్నత్యాన్ని సంబోధించి ఇలా ప్రశ్నించటం జరిగింది–

**"ఏమిటీ, అల్లాహ్ తన దాసుని కొరకు చాలడా?"**

మనసులోని ఈ ఔన్నత్యాన్నే మానవుడు షిర్క్‌తో కలుషితం చేసి దానిని కోల్పోతాడు. అల్లాహ్ తనను ఏ గౌరవోన్నతుల వినీలాకాశంపైకి లేపాడో, అక్కడి నుండి పరాభవపు పాతాళంలో పడిపోతాడు.

ఈ విషయమే ఖుర్‌ఆన్‌లో ఒక చోట ఇంతకన్నా మరింత తీవ్రంగా చెప్పబడింది :

**ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్తమూ, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలామంది మానవులు, శిక్షకు అర్హులైన చాలా మంది ప్రజలు అల్లాహ్ ముందు వినమ్రులై ఉండటాన్ని నీవు చూడటం లేదా?**

**అల్లాహ్ ఎవరినైతే అవమానం పాలుజేస్తాడో, ఇక అతనికి గౌరవం ఇచ్చేవాడెవ్వడూ ఉండడు. అల్లాహ్ తాను కోరిన దానిని చేస్తాడు.** ***(అల్ హజ్జ్-18)***

ఈ ఆయత్‌లో మానవుని అవమానకర స్థితి ఎటువంటిదో సూచించ బడింది. విశ్వంలోని వస్తువులన్నీ ఒకే దేవుని ముందు ప్రణమిల్లుతున్నాయి. అయినప్పటికీ అల్లాహ్ ఆ వస్తువులన్నింటినీ మానవ సేవలో, అతనికి లబ్ది చేకూర్చటంలో నిమగ్నం చేసి ఉంచాడు. కాని ఆ వస్తువుల్లో ఏ ఒక్కటి కూడా మానవుని దాస్యం చేయడాన్ని సహించలేవు. కాకపోతే ఈ మానవుడే ఆ వస్తువు లన్నింటిపై ఆధిక్యత కలిగి ఉండి కూడా వాటిలో ఎన్నో వస్తువుల్ని పూజిస్తు న్నాడు.

## 4) ఒకవైపు దౌర్బల్యం- మరోవైపు పెత్తనం

నాల్గవ విషయం మానవుని దౌర్బల్యం, పెత్తనం. అంటే ఒకవైపు అతని బలహీనత! మరోవైపు అధికారం, పెత్తనం చెలాయించాలన్న ఉబలాటం! ఇవి రెండూ మనిషి వ్యక్తిగత గుణాలు. నిశ్చయంగా మానవుడు శక్తియుక్తుల, తెలివితేటల చాలా పెద్ద గని తన లోపల కలిగి ఉన్నాడు. తనలో ఉన్న ఈ తెలివితేటల మూలంగా అతను భూమిలో నిక్షిప్తమైన ఖజానాలను వెలికితీస్తాడు. ఆకాశంలో తన సామ్రాజ్య వాద పీఠాన్ని స్థాపిస్తాడు. పర్వతాల రొమ్ము చీలు స్తాడు. సముద్రాలలో తన ఓడల్ని పరుగెత్తిస్తాడు. కాని ఇవన్నీ చేసి కూడా తన బలహీనత ఏమిటో గుర్తెరిగి ఉంటాడు. ఎందుకంటే తనంతట తానుగా ఏమీ చేయలేనన్న విషయం అతనికి తెలుసు. ఎందుకంటే ఏ ప్రజ్ఞాపాటవాల ద్వారా, శక్తియుక్తుల ద్వారా తాను ఈ పనులన్నీ చేయగలిగాడో, వాటిలో ఏ ఒక్కదానిని కూడా తాను ఉనికిలోనికి తీసుకురాలేదన్న దానిని అతను బాహాటంగా చూస్తున్నాడు. ఇంకా ఏ వస్తువులపై తాను ప్రయోగాలు చేస్తున్నాడో వాటిని కూడా తాను ఉనికిలోనికి తీసుకురాలేదు. ఈ వస్తువులన్నీ వేరొకని వర ప్రసాదాలే. పైగా అవన్నీ తమను నిర్మించిన వాని సహజ శాసనాలకు కట్టుబడి ఉన్నాయి. మనిషి స్వాధీనంలో ఉన్నదల్లా సాధన చేసి, పరిశోధించి ఆ శాసనాలను అర్థం చేసుకోవటం, వాటికనుగుణంగా వాటి ద్వారా ప్రయోజనం పొందటం మాత్రమే. మరి ఈ ప్రయోజనం కూడా ఒక నియమిత గడువు

వరకే. ఆ గడువు ముగిసిన తర్వాత అతను లక్ష ప్రయత్నాలు చేసినా, వాటిలో ఏ ఒక్క దాని ద్వారా కూడా ఒక్క క్షణకాలం కూడా లబ్ధి పొందలేడు.

ఈ వస్తువు మనిషిలో సహజంగానే ఒక అగోచర శక్తిపై ఆధారపడక తప్పని స్థితిని జనింపజేస్తుంది. ఆ శక్తియే అతనికి, ఈ వస్తువులన్నింటికీ ఉనికిని ప్రసాదించింది. ఆయన జారీ చేసిన శాసనాలకు కట్టుబడే ఈ విశ్వ కర్మా గారం నడుస్తోంది. మనిషిలోని ఈ దౌర్బల్యం కారణంగానే ఈ విధంగా సెలవీయబడింది : **"ఎల్లవేళలా అల్లాహ్‌పై ఆధారపడి ఉన్న నిర్ధనులు, ఫకీరులు మీరు"** (35: 15). మరో మాటలో చెప్పాలంటే మీకు అల్లాహ్ అవసరం ఉంది.

వేరొక చోట **"అల్లాహ్ అక్కరలేనివాడు, మీరే అగత్యపరులు"** అని అనబడింది.

బుద్ధిమంతులు జీవితంలోని ప్రతి దశలో, దాని ప్రతి మలుపులో, పరివర్త నలో తమ బలహీనతను, అక్కరను తెలుసుకుంటారు. వారెన్నడూ దేవుని పట్ల నిరపేక్షతను, నిర్లక్ష్యాన్ని కలిగి ఉండరు. తమపై వరాల వర్షం కురుస్తున్న కొద్దీ దైవంతో వారి సంబంధం పెరుగుతూ ఉంటుంది. దీనికి అతి గొప్ప దృష్టాంతం మహనీయ దావూద్(అ), మహనీయ సులైమాన్(అ), జుల్‌ఖర్‌నైన్(అ), ఫారూఖె ఆజమ్(రజి)ల జీవితాలు. కాని అల్పబుద్ధి కలవారి పరిస్థితి తద్భిన్నం. వారు తమ చుట్టూ ప్రోగైన సిరిసంపదలను, పదవులను, పటాటోపాలను, అంగరంగ వైభవాన్ని చూసి ఉబ్బి తబ్బిబ్బవుతారు. మిడిసిపడతారు. తమను తాము దైవ త్వంలో భాగస్వాములుగా ఊహించుకుంటారు. ఖుర్‌ఆన్‌లో దీనికి దృష్టాంతంగా ఫిరౌన్, హామాన్, ఖారూన్, అబూ లహబ్‌ల పేర్లు వస్తాయి.

ఎవరెవరికి ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయో, వారి కొరకు ఖుర్‌ఆన్ ఎన్నో చోట్ల మానవుని దౌర్బల్యం, గర్వాహంకారానికి సంబంధించిన వివిధ ఉపమానాల ఆధారంగా ఒక సత్యాన్ని విశదపరుస్తుంది– మానవుడు తన వైభోగంపై మురిసిపోతూ దేవుని పట్ల ఎంత అలసత్వం ప్రదర్శించినా, అతని జీవితంలో ఎదురయ్యే వివిధ సంఘటనలు అతని నిస్సహాయ స్థితిని, అశక్తతను బట్టబయలు చేస్తూనే ఉంటాయి. ఆ క్షణంలో అతని నోట, అతని నైజంలో అణగివున్న పిలుపు ఒక్కసారిగా బయటపడుతుంది. ఆ సమయంలో అతని భాగస్వాములు– వారు తన స్వయం అయినా, లేదా అతని వందిమాగధులైనా

లేదా అతను కొలిచే అగోచర ఇలవేలుపులైనా– అందరూ అతనికి తోడ్పడటం మానేస్తారు. అప్పుడు ఒకే ఒక అస్థిత్వం మిగిలి ఉంటుంది. దాని కారుణ్య ఒడిలోనే అతను సేద తీరగలుగుతాడు. ఈ నిదర్శనం ఖుర్‌ఆన్‌లో వివిధ రకాలుగా విశదీకరించబడింది. మచ్చుకు మేము కొన్ని ఆయత్‌లను మాత్రమే తీసుకుంటున్నాము–

> **ప్రవక్తా! వారిని ఇలా అడుగు: "భూసముద్రాల చీకట్లలోని ప్రమాదాల నుండి మిమ్మల్ని కాపాడేది ఎవరు? మీరు (ఆపద సమయంలో) కడు దీనంగా విలపిస్తూ, అతి గోప్యంగా వేడుకొనేది ఎవరిని? ఈ ఉపద్రవం నుండి ఆయన గనక మమ్మల్ని రక్షిస్తే, మేము తప్పకుండా కృతజ్ఞులం అవుతాము అని మీరు అనేది ఎవరితో?"– ఇలా అను: "అల్లాహ్ మీకు దాని నుండీ, ప్రతి బాధ నుండీ విముక్తి కలిగిస్తాడు. తరువాత మీరు ఇతరులను ఆయనకు భాగస్వాములుగా నిలబెడతారు."**
>
> ***(అల్ అన్‌ఆమ్: 63,64)***

వేరొక చోట ఇలా సెలవిచ్చాడు :

> **మిమ్మల్ని నేలపైనా, నీటిపైనా నడిపేవాడు అల్లాహ్‌యే. కాబట్టి మీరు ఓడలపై ఎక్కి వాయువులు అనుకూలంగా వీస్తూ ఉండగా ఆనందంగా, ఆహ్లాదంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఆ తరువాత అకస్మాత్తుగా ఎదురుగాలి ఉధృతమై అన్ని దిశల నుండి అలల దెబ్బలు తగలగా ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకుపోయామని తెలుసుకుంటారు. ఆ సమయంలో అందరూ తమ ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకొని ఆయనను ఇలా వేడుకుంటారు: "నీవు గనక మాకు ఈ ఆపద నుండి విముక్తి కలిగిస్తే మేము కృతజ్ఞతలు తెలుపుకునే దాసులమవుతాము." కాని ఆయన వారిని రక్షించిన తరువాత వారే సత్యానికి విము ఖులై భూతలంపై తిరుగుబాటు చేస్తారు.**
>
> ***(యూనుస్: 22,23)***

తలబిరుసు అయిన మనిషిలోని తలబిరుసుతనానికి, గర్వాహంకారానికి సంబంధించిన ఎంత నిజమైన దృష్టాంతమిది? ప్రపంచ సముద్రంలో అతని జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతున్నప్పుడు, అతను తన ఓడ దృఢత్వంపై, ఓడలో జరిగిన చక్కని ఏర్పాట్లపై గర్వంతో పొంగిపోతాడు. తన ఉపాయాన్ని మేధాసంపత్తిని చాలా గొప్పగా ఊహించుకుంటాడు. తన సాధనాలపై ఒనరులపై మిడిసిపడతాడు. దైవం పట్ల విధేయతా భావాన్ని, కృతజ్ఞతా భావాన్ని వీడి, ఏ యోగ్యతా లేకపోయినా తన దైవత్వాన్ని ప్రకటించు కుంటాడు. గర్వంతో విర్రవీగుతాడు. అహంభావంతో నీల్గుతాడు. పెద్దరికపు మత్తులో మునిగిపోతాడు. కాని అప్పటివరకూ ఆహ్లాదకరంగా, సానుకూలంగా ఉన్న గాలులు కాస్తా పెనుగాలుల్లా మారినప్పుడు, ఓడ అలల తాకిడికి గురై ఊగిపోతున్నప్పుడు అతను చేసిన ఏర్పాట్లు అన్నీ దేనికీ పనికి రానివైపోతాయి. ఆ క్షణంలో అప్రయత్నంగా అతనిలా మొరపెట్టుకుంటాడు. "దేవా! నీవు ఈ గండం నుండి గనక నన్ను గట్టెక్కిస్తే నీ పట్ల ఎన్నడూ అలసత్వం చూపబోను. ఇక మీదట ఎన్నడూ గర్వాహంకారం ప్రదర్శించను. ఎప్పటికీ నీ దైవత్వంలో భాగస్వామి అయ్యే దుస్సాహసానికి ఒడిగట్టను. పైగా నీకు కృతజ్ఞుడనై ఉంటాను. నీకే విధేయత చూపుతాను. నేను నా స్వయానికి గానీ, వేరితరులకు గానీ విధేయుడనై ఉండను"– కాని ఆపద నుండి విముక్తి పొందగానే మళ్ళీ అదే అలసత్వం, అదే మత్తు తలకెక్కుతుంది. తన ఏ వస్తు సామగ్రిని, ఏ మితిమీరిన ధీమాను పట్టి బూటకంగా భావించాడో, వాటి మత్తులోనే మునిగి పోయి దేవునిపై తిరుగుబాటు చేస్తాడు. బహుదైవోపాసకుడుగా మారిపోతాడు. ఇలాంటి వారినే అల్లాహ్, చేసిన మేలును మరచినవారుగా, కృతఘ్నులుగా, వాగ్దాన భంగానికి పాల్పడినవారుగా పేర్కొన్నాడు. ఎందుకంటే ఆత్మావస్థలో అతను చేసిన ఒడంబడికను కష్టాలు కడగండ్లు వచ్చి అతనికి జ్ఞాపకం చేస్తూ ఉంటాయి. అప్పుడు మానవుడు దానిని పునశ్చరణ చేసుకుంటాడు. కాని పరిస్థితిలో పరివర్తన రాగానే ఆ ఒడంబడికను భగ్నం చేసి మళ్ళీ మేలును మరచినవాడుగా ప్రవర్తిస్తాడు.

ఈ వివరాలను తెలియజేయటంలోని ఉద్దేశం ఏమిటంటే, మానవునిలో

దౌర్బల్యం, ఆధారపడే గుణం సహజమైనది. ఆ దౌర్బల్యమే అతన్ని గొప్ప శక్తి వైపునకు నెట్టుకుని వస్తుంది. మనిషిలో తాను బలహీనుణ్ణి, నిస్సహాయుణ్ణి అనే భావన ఉన్నప్పుడు అతను అహంకారానికి, స్వోత్కర్షకు, గర్వానికి, షిర్క్‌కు లోనవ్వడు. కాని అతడు తరచూ దైవానుగ్రహాలను పొందినప్పుడు తన దౌర్బల్యాన్ని మరచిపోతుంటాడు. కేవలం మరచిపోతాడంతే. అతని నైజం మాత్రం మారదు. అందువల్ల ఎప్పుడు అతనిపై కష్టం వచ్చి, అతని మితిమీరిన ధీమా పునాదులను కుదిపేసినా, అతని ఆంతర్యంలో అణగారి ఉన్న అగ్ని కణం, అతని నైజంలో అణిగివున్న సత్యం ఒక్కసారిగా మేల్కొంటుంది. అంతే, అతను దేవుని వైపునకు పరుగెడతాడు. ఆయన్ని తప్ప అందరినీ మరచిపోతాడు.

కరడుగట్టిన పొగరుబోతుల్లో సయితం ఈ నైజం జాగరూకమవటాన్ని మనం చూస్తుంటాము. గర్వంతో విర్రవీగే మనిషి సయితం– 'మాకు ప్రాప్తమై ఉన్నదంతా మాలోని ప్రతిభ, విజ్ఞానం కారణంగానే ప్రాప్తమైంది' అని ప్రగల్భాలు పలికి దైవాన్ని విస్మరించిన వారు సయితం, తమకు ఏ అర్హతా లేకపోయినా దేవుని భూమిపై తమ దైవత్వపు ధ్వజాన్ని పాతిపెట్టినవారు, తమ వద్ద ఉన్న సామగ్రిని, తమ తెలివిడిని చూసుకుని దేవుని పేరు వినగానే నవ్విపోయిన వారిని (ఇప్పుడు వారంతా ఎక్కడ ఉన్నారు?) నేడు మనం చూస్తున్నాము. వారి వ్యూహాల వైఫల్యం, వారి కట్టుదిట్టమైన ఏర్పాట్లలోని డొల్లతనం మానవుని నిస్సహాయ స్థితి యొక్క రహస్యాన్ని విప్పేసింది. దీనిని గమనించిన వారు బుద్ధిగా దైవ నామాన్ని స్మరిస్తున్నారు.

# తౌహీద్ ప్రత్యేక నిదర్శనాలు

మొదటి అధ్యాయాలలో మేము దైవత్వానికి, దేవుని ఏకత్వానికి సంబంధించి వివరించిన సాక్ష్యాధారాలు సర్వసామాన్యమైన సాక్ష్యాధారాలు. ఇవి ఈ లోకం పోకడపై, మానవ నైజంలోని తిరుగులేని అంశాలపై ఆధారపడి ఉన్నాయి. అందుచేత వీటి తొలి సంబోధితులు అరబ్బులే. అయినప్పటికీ ఇవి అరబ్బు– అరబ్బేతరుల విచక్షణ లేకుండా విశ్వాసులు– అవిశ్వాసులన్న వ్యత్యాసం లేకుండా మొత్తం మనుజ జాతికి సమానంగా వర్తిస్తాయి. ఈ విశ్వం ప్రతి వ్యక్తి ముందు తెరచిన పుస్తకంలాగా వుంది. ప్రకృతిలోని సాక్ష్యాలు కూడా ప్రతి మంచి మనసులో సాక్ష్యంగా ఉన్నాయి. కేవలం తమ కన్నులను పొడుచుకున్నవారు, తమ చెవుల్లో సీసం పోసుకున్నవారు మాత్రమే ఈ యథార్థాలను తిరస్కరించేందుకు సాహసిస్తారు. ఇలాంటి వారిని ప్రపంచంలోని ఏ వస్తువు కూడా ఒప్పించజాలదు, మెప్పించజాలదు. ఇప్పుడు మనం వ్యతిరేకుల అంగీకారాలపై నెలకొని ఉన్న నిదర్శనాలను విశదీకరిస్తాము– ఇవి ప్రత్యేక ఆధారాలు, నిదర్శనాల కోవకు చెందినవి. అంటే సంబోధితుడు ఏ సూత్రాలను అంగీకరిస్తాడో వాటిని ఖుర్ఆన్ సంగ్రహించింది. వాటి ఆధారంగా, అవి వాంఛించే వాటిని విడమరచి చెబుతూ వాటిని అంగీకరించమని సంబోధితులను కోరింది. దాంతోపాటే తిరుగులేని విషయాలకు విరుద్ధంగా ఉన్న వాటిని త్యజించమని కూడా చెప్పింది. ఆధారాలు, నిదర్శనాలను సమర్పించే ఈ శైలి పూర్తిగా బౌద్ధికమైనది. సహజమైనదీను. ఇందులో ఆధారాలకు సరైన ప్రాతిపదిక లేదని ఎవరైనా ఆక్షేపిస్తే అది అర్థంలేని మాట అవుతుంది. కొంతమంది తాత్వికులు, వాదనా ప్రియులు ఖుర్ఆన్ సమర్పించే ఆధారాలన్నీ నిందలు మోపే విధంగా ఉన్నాయని విమర్శించారు. సమస్త మానవాళిని అప్పీలు చేసే ప్రమాణాలు

అందులో లేవని కూడా వారు వాదించారు. ఇది వారి అపోహ మాత్రమే. ఖుర్ఆన్ పరిజ్ఞానం లేని కారణంగానే వారు ఈ విధంగా ఆలోచిస్తున్నారు. ఇప్పుడు మనం దానిని విశదీకరించే ప్రయత్నం చేద్దాం.

## 1. భాగస్వాముల (సహవర్తుల)కు సంబంధించిన నిదర్శనమేదీ లేదు

ఈ సందర్భంగా ఖుర్ఆన్ అరబ్బుల ముందు ఒక సవాలు విసిరింది– మీరు ఎవరెవరిని దైవానికి భాగస్వాములుగా నిలబెడుతున్నారో, దానికి సంబంధించిన సాక్ష్యాధారం మీ వద్ద ఏదయినా ఉందా? నిజ దైవం సంగతి అలా ఉంచండి; ఎందుకంటే మీరు కూడా ఆయన్ని నమ్ముతారు. ఆయనకు సంబంధించిన సాక్ష్యాలు మీ ఆంతర్యంలోనూ, మీ బయటి ప్రపంచంలోనూ లభిస్తున్నాయి. అయితే ఆయనతోపాటు మీరు ఎవరెవరిని సహవర్తులుగా చేర్చారో, వారికి సంబంధించిన సాక్ష్యాధారాలను తేవలసిన బాధ్యత మీపైన ఉంది. ఆధారం, నిదర్శనం లేకుండా సామాన్యమైన విషయాన్ని కూడా అంగీకరించటం మానవ స్వభావానికి విరుద్ధం. కాబట్టి దీనికి సంబంధించిన బౌద్ధిక నిదర్శనం ఏదయినా ఉంటే దానిని సమర్పించండి. ఒకవేళ ఏదైనా నకలు చేయబడిన ఆధారం ఉంటే దానినయినా ముందుకు తీసుకురండి. మా తాతముత్తాతలు పూజిస్తూ ఉండగా మేము చూశామని అంటారా, అది ప్రామాణికం కాజాలదు. ఇంత గంభీరమైన విషయానికి సంబంధించి, దాని రుజువుగా మీరు చెప్పే ఈ మాట సరిపోదు.

> **ఎవడయినా అల్లాహ్‌తోపాటు మరొక ఆరాధ్యుణ్ణి వేడుకుంటే, దానికి అతని వద్ద ఏ ప్రమాణమూ లేదు. అతని లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది.** *(అల్ మోమినూన్ : 117)*
>
> **ఆయనను (నిజదైవాన్ని కాదని) మీరు పూజిస్తున్నవారు, మీరూ మీ తాతముత్తాతలు కల్పించుకున్న కొన్ని పేర్లు మాత్రమే తప్ప మరొకటి ఏమీ కాదు. వారి కొరకు అల్లాహ్ ఏ నిదర్శనాన్నీ అవతరింపజెయ్యలేదు.** *(యూసుఫ్: 40)*
>
> **వారు చేస్తూ ఉన్న షిర్కు యొక్క సత్యతకు సాక్ష్యం పలికే ఏదయినా**

**నిదర్శనాన్ని గానీ, ప్రమాణాన్ని గానీ మేము వారిపై అవతరింప జేశామా?** ***(అర్ రూమ్: 35)***

దీనికి సమాధానంగా అరబ్బులు ఏమన్నారంటే, "మా తాతముత్తాతలు బహుదైవోపాసన చేశారంటే, దైవాజ్ఞ ప్రకారమే చేసి ఉంటారు. మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) శిక్షణ కూడా ఇదే." దీనికి జవాబుగా ఖుర్ఆన్ ఏమందంటే, ఇది అల్లాహ్‌పై అభాండం. అల్లాహ్ ఎప్పుడూ షిర్క్ చేయమని ఆజ్ఞాపించలేదు. ఒకవేళ మీరు ఈ వాదనలో సత్యవంతులే అయితే, పూర్వపు గ్రంథం ఏదయినా తీసుకురండి లేదా జ్ఞానంతో కూడుకున్న ప్రమాణం ఏదన్నా సమర్పించండి :

**ప్రవక్తా వారితో ఇలా అను: "మీరు దేవుణ్ణి త్రోసిరాజని వేడు కుంటున్న శక్తులు అసలు ఏమిటో ఎప్పుడైనా మీరు కళ్లు తెరచి చూశారా? భూమిలో వారు సృష్టించింది ఏమిటో, కొంచెం నాకు చూపండి? లేదా ఆకాశాల సృష్టిలో, వాటి నిర్వహణలో వాటి పాత్ర ఏమైనా ఉందా? ఒకవేళ ఇదివరకు వచ్చిన ఏదైనా గ్రంథం గానీ లేదా జ్ఞాన అవశేషంగానీ (ఈ విశ్వాసాలకు ఆధారంగా) మీ దగ్గర ఉంటే, దాన్నే తీసుకురండి, మీరు సత్యవంతులే అయితే."** ***(అల్ అహ్ఖాఫ్ : 4)***

ఇక మీ పితామహుడు మహనీయ ఇబ్రాహీమ్(అ) ప్రబోధన ఇదే అని అంటున్నారా? ఇది మీరు చెప్పే అబద్ధం. ఆ మహనీయునిపై మీరు కల్పించే అపవాదు ఇది. ఇబ్రాహీమ్(అ) జీవితంలోని త్యాగమయ ఘట్టాలలో ఒకటి ఆయన చేసిన హిజ్రత్ (ప్రస్థానం). ఆ సమయంలో ఆ మహనీయుడు తన స్వస్థలాన్ని, తన కుటుంబీకుల్ని, సర్వస్వాన్ని వదిలిపెట్టారు. అంతేకాదు, హిజ్రత్ సందర్భంగా ఆయన దేవునికి భాగస్వాములుగా ఉన్న వారందరితో తెగతెంపులను ప్రకటించారు. ఆ సందర్భంగా ఆయన పలికిన మాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆ పలుకు ఆయన కుటుంబీకుల్లోని ఒక శాఖ అయిన బనీ ఇస్రాయీల్‌లో సదా ఒక అనుసరణీయ చిహ్నంగా మిగిలి పోయింది. జుఖ్రుఫ్ సూరాలో ఖుర్ఆన్ ఇచ్చిన జవాబు సవివరంగా ఇలా వుంది:

దయామయుడైన దేవుడు (మేము వారిని ఆరాధించకూడదని) కోరి ఉన్నట్లయితే, మేము వారిని ఎన్నటికీ పూజించి ఉండేవారం కాదు" అని వారు అంటారు. వారు ఈ వ్యవహారం యొక్క వాస్త వాన్ని ఏమాత్రం ఎరుగరు, కేవలం ఊహాగానాలు చేస్తున్నారు. మేము దీనికి పూర్వం, వారికి ఏదైనా గ్రంథాన్ని ఇచ్చి ఉన్నామా, దాని ప్రమాణం (ఈ దైవదూతలను పూజించటానికి గాను) వారి వద్ద ఉండటానికి? లేదు, కాని వారు ఏమంటారంటే; "మేము మా తాతముత్తాతలు ఒక మార్గంలో నడుస్తూ ఉండగా చూశాము; మేము వారి అడుగుజాడలలోనే నడుస్తున్నాము" ఇదేవిధంగా నీకు పూర్వం మేము హెచ్చరించేవాణ్ణి ఏ పట్టణానికి పంపినా, అక్కడి సంపన్నులు ఇలానే అన్నారు, "మేము మా పూర్వీకులు ఒక మార్గంలో నడుస్తూ ఉండగా చూశాము, మేము వారి అడుగు జాడలనే అనుసరిస్తున్నాము." ప్రతి దైవప్రవక్తా వారిని ఇలా అడిగాడు; "మీ పూర్వీకులు నడుస్తూ ఉండగా మీరు చూచిన మార్గం కంటే సరియైన, ఉత్తమమైన మార్గాన్ని నేను మీకు చూపి నప్పటికీ మీరు ఆ పూర్వ మార్గంలోనే నడుస్తారా?" వారు దైవ ప్రవక్తలందరికీ ఇలానే సమాధానం ఇచ్చారు, "నీవు ఏ ధర్మం వైపునకు పిలవటానికి పంపబడ్డావో, మేము ఆ ధర్మాన్ని తిరస్క రిస్తున్నాము." చివరకు మేము వారికి తగిన శిక్షను విధించాము. చూడండి, సత్య తిరస్కారుల గతి ఏమయిందో! ఇబ్రాహీమ్ తన తండ్రికీ, తన జాతి వారికీ ఇలా చెప్పిన ఆ సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో, "మీరు పూజిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించిన వానితోనే ఉన్నది. ఆయనే నాకు మార్గం చూపుతాడు." ఇబ్రాహీమ్ ఈ వచనాన్నే తన తరువాత తన సంతానం కోసం విడిచి వెళ్లాడు, వారు దాని వైపునకు మరలేందుకు". *(అజ్ జుఖ్రుఫ్ : 20-28)*

ఈ ఆయత్‌ల భావార్థాలను విశ్లేషించినప్పుడు అర్థమయ్యేదేమంటే,

అరబ్బులు బహుదైవారాధన (షిర్క్)కు సమర్థనగా సమర్పించే ఉల్లేఖనాలు పూర్తిగా నిరాధారమైనవి. దైవప్రవక్త ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) జీవిత గాథ దేవుని ఏకత్వానికి ప్రతీక. ఆయన జీవితం లోకవాసులకు ఆదర్శప్రాయం. ఇస్రాయీల్ సంతతి గ్రంథాలలో ఆయన జీవిత గాథ చెక్కుచెదరకుండా ఉండేది. అరబ్బుల ఈ కట్టుకథలను ఖండించటానికి అదొక్కటే సరిపోయేది. ముఖ్యంగా ఆ మహనీయుని హిజ్రత్ సంఘటన దేవుని ఏకత్వం (తౌహీద్)కు, స్వచ్ఛమయిన  ధర్మావలంబనకు చిరస్మరణీయంగా ఉండిపోయే ఘనకార్యం. కాని శోచనీయం ఏమిటంటే ఇబ్రాహీమ్(అ) కుటుంబీకుల్లోని రెండు శాఖలలో ఏ ఒక్కటి కూడా ఆ 'శేష సద్వచనం'లోని సారాన్ని తెలుసుకోలేకపోయాయి. యూదులు ఈ మార్గ చిహ్నాన్ని కలిగి ఉండి కూడా మార్గం తప్పారు. రుజు మార్గానికి వారు ఎంతగా దూరమైపోయారంటే, దాని వైపునకు మరలి రావటం వారికి అసంభవం అయిపోయింది. తత్కారణంగా అల్లాహ్ వారిని అధిక్షేపించాడు. ఇక అరబ్బుల విషయానికి వస్తే వారు తమ ఉల్లేఖనాల రికార్డు నుండి ఆ గాథనే పోగొట్టుకున్నారు. దానికి ప్రతిగా బహుదైవోపాసనా మతానికి తావు కల్పించే ఉల్లేఖనాలను అల్లుకున్నారు.

అరబ్బుల ఈ మూఢ నమ్మకాలను ఖండిస్తూ ఖుర్ఆన్ అనేక చోట్ల మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) జీవితంలోని వివిధ సంఘటనలను సమర్పించింది. అంతేకాదు, పవిత్ర కాబా నిర్మాణాన్ని, ఆ నిర్మాణం వెనుక ఉన్న లక్ష్యాన్ని, దాని చరిత్రను, దైవప్రవక్తలందరి సందేశంలోని ఉమ్మడి లక్ష్యాన్ని వివరించి, వాటిలో ఏ ఒక్కటీ మీ బహుదైవారాధనను సమర్థించటం లేదని, దేవుడు షిర్క్ చేయమని ఎక్కడా ఆజ్ఞాపించలేదని చెప్పింది. దైవాదేశాలను తెలుసుకునే అతి ముఖ్యమైన సాధనం దైవప్రవక్తలే. దైవప్రవక్తల పిలుపు ఎలా ఉండేదో వెనుకటి గ్రంథాలలో ఉంది. వారిలో ఏ ఒక్కరి సందేశాన్ని కూడా మీరు షిర్క్ (బహుదైవారాధన)కు అనుకూలంగా సమర్పించలేరు. దైవప్రవక్తల చరిత్ర అంతా ఖుర్ఆన్ వాదనను ధ్రువపరుస్తోంది. ఆ చరిత్రలో ఎక్కడయినా ఏదయినా విషయం ప్రక్షిప్తానికి గురైతే దాని ఖండన కూడా స్వయంగా అందులోనే ఉంది.

## 2. దాంతోపాటే...

ఖుర్ఆన్ సమర్పించే ప్రత్యేక నిదర్శనాల రెండవ కోణం ఏమిటంటే, అరబ్బులు దేవుని ఏ గుణగణాలను అంగీకరించేవారో, అవి వాంఛించే వాటిని కూడా అంగీకరించాలని ఖుర్ఆన్ కోరింది. ఈ ఆవశ్యకాలు రెండు రకాలు. ఒకటి; అంగీకరించిన గుణాలకు అనువుగా ఉండేవి. రెండు; ఏ గుణగణాలను అంగీకరించటం వల్ల కొన్ని హక్కులు, బాధ్యతలు విధితమవుతాయో వాటిని నిర్వర్తించటం. అలాగే ఏ ఏ అంశాలు దేవుని హక్కుల విషయంలో వ్యతిరేకంగా పరిణమిస్తాయో అలాంటి నమ్మకాలను, కర్మలను పరిత్యజించటం.

అరబ్బుల గురించి సుప్రసిద్ధమైన విషయం ఏమిటంటే, వారు కేవలం దేవుని ఉనికిని అంగీకరించటమే కాదు, ఆ దైవాన్ని భూమ్యాకాశాల సృష్టికర్తగా, ఉపాధి ప్రదాతగా, శక్తియుక్తులను తెలివితేటలను ప్రసాదించేవాడుగా, జీవన ప్రదాతగా, ప్రణాళికా రచయితగా కూడా అంగీరించేవారు. కాని ఆ దైవాన్ని యజమానిగా, ప్రభువుగా, పాలకునిగా అంగీకరించే విషయం దగ్గరకొచ్చేసరికి ఇతరులను కూడా ఆయనకు భాగస్వాములుగా చేర్చేవారు. ఖుర్ఆన్ వారిని కోరింది ఇదే– దేవుని ఏ గుణగణాలను మీరు అంగీకరిస్తున్నారో వాటితోపాటు ఆయన్ని ప్రభువుగా, పోషకునిగా కూడా అంగీకరించండి–

> **"ఆ అల్లాహ్‌యే మీ నిజమైన ప్రభువు (కాబట్టి మీరు ఈ సత్యాన్ని అంగీకరించి తీరాలి). సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలిందేమిటి?"** ***(యూనుస్ : 32)***

అంటే ఈ విషయాలన్నింటినీ విశ్వసించిన తరువాత, ఆయన్నే పాలకునిగా, పోషకునిగా, యజమానిగా, సార్వభౌమునిగా విశ్వసించటం అనివార్యం. ఒకవేళ ఏ ఆధారమూ లేకపోయినా ఇతరులను విశ్వసిస్తే అది మార్గభ్రష్టత్వం అవుతుంది. అందుకే అల్ ఆరాఫ్ సూరాలో ఏమని సెలవీయబడిందంటే; మీరు భూమ్యాకాశాల నిర్మాతగా ఎవరిని నమ్ముతున్నారో ఆయన్ని మీ ప్రభువుగా నమ్మటం అవశ్యం. ఆయన్ని తప్ప వేరితరులను యజమానిగా, పరిపాలకునిగా చేసుకోకండి.

> **"నిశ్చయంగా భూమ్యాకాశాలను సృష్టించినవాడే మీ ప్రభువు. తెలుసుకోండి! సృష్టించటం, పాలించటం ఆయనకే శోభాయమానం."**

భూమ్యాకాశాల సృష్టికర్తగా నమ్మే వానినే ప్రభువుగా కూడా నమ్మండి. సృష్టించిన వాడొకడుండగా ప్రభువు మరొకడు కావటం జరగదు. పుట్టించిన వాడే పాలించాలి, పోషించాలి. అది ఆయన హక్కు. ఒక ద్వీపాన్ని కనుగొన్న వాడు, ఒక వస్తువును ఆవిష్కరించినవాడు కేవలం తన ఆవిష్కరణ లేక కనుగొనటం ఆధారంగా దానిపై తన యాజమాన్యపు హక్కు ఉండాలన్నప్పుడు, దేవుని ఈ హక్కును ఎలా కాదంటారు? చూడబోతే ఈ జగతికి కర్త, పాలకుడు, పోషకుడు ఆయనే కదా!

అలాగే సృష్టికర్తకు 'జ్ఞాన గుణం' అవశ్యం అని ఖరారు చేయటం. అంటే ఏ అస్థిత్వాన్ని భూమ్యాకాశాల నిర్మాతగా విశ్వసిస్తున్నారో ఆయన జ్ఞానం సమ స్తాన్నీ పరివేష్టించి ఉందని విశ్వసించాలి. **అలా యాలము మన్ ఖలఖ్** (ఏమిటీ, పుట్టించిన ఆయనే ఎరుగకుండా ఉంటాడా?)

అలాగే ఏ అల్లాహ్‌ను సృష్టికర్తగా, నిర్వహణ కర్తగా అంగీకరించారో, ఆయన్ని లాభనష్టాలను చేకూర్చేవానిగా కూడా అంగీకరించటం అవశ్యం.

**"ఒకవేళ అల్లాహ్ మీకు ఏదయినా నష్టం (కీడు) కలిగిస్తే, దానిని తొలగించేవాడు కూడా ఆయనే. ఒకవేళ మీకు ఏదయినా లాభం చేకూరిస్తే, ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు".**

అలాగే దైవత్వానికి వ్యతిరేకంగా ఉన్న గుణాలతో అల్లాహ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఖరారు చేయటం జరిగింది. ఈ విషయం ఎంతో విస్తృత మైనది. దీనిపై మేము 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో కొంతవరకు చర్చించాము. ఇక్కడ కేవలం సూచనా ప్రాయంగా ఒక విషయం ప్రస్తావించదలిచాము.

ఈ సందర్భంగా చెప్పబడిన సూత్రప్రాయమైన విషయం ఏమంటే, అల్లాహ్‌కు కేవలం మంచి గుణాలు మాత్రమే శోభిస్తాయి. ఏ దుర్గుణం అయినా దైవత్వానికి విరుద్ధమైనదే. సకల సద్గుణ సంపన్నుడైన దైవాన్ని నమ్మటం ద్వారానే ఈ జగతి యొక్క పజిల్ పరిష్కృతం కాగలదు. ఒకవేళ దానికి మరేదయినా దుర్గుణం అంటగడితే అది ఆయన సుందర స్వరూపానికి, పరిపూర్ణతకు విరు ద్ధాంశం కాగలదు. అలా గనక అయినట్లయితే పరిష్కృతమైన ఈ పజిల్ కాస్తా మళ్ళీ పజిల్‌గానే మిగిలిపోతుంది. దేవుని నిజ దృక్పథం ఈ జగతిపై నుండి ఏ అంధకారాన్ని తొలగించిందో, అదే గాఢాంధకారం మళ్లీ అలుముకుంటుంది.

**"అల్లాహ్ మంచి పేర్లకు అర్హుడు. ఆయనను మంచి పేర్లతోనే పిలవండి. ఆయనను మంచి పేర్లతో పిలిచే విషయంలో సత్యం నుండి వైదొలిగే వారిని వదలిపెట్టండి. వారు తాము చేస్తున్న దానికి ప్రతిఫలం పొందుతారు."** ***(అల్ ఆరాఫ్ : 180)***

ఇక్కడ భాగస్వాములు, మధ్యవర్తుల పట్ల గల నమ్మకం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నమ్మకం వల్ల దైవానికి గల సూత్రప్రాయమైన గుణా లన్నింటినీ త్రోసిపుచ్చినట్లవుతుంది. ఖుర్ఆన్ వీళ్ళ నమ్మకాల్లోని లొసుగులను క్షుణ్ణంగా వివరించి చెప్పింది. ఉదాహరణకు– మధ్యవర్తులను సామీప్యసాధ నంగా ఎంచటం వల్ల దేవుని జ్ఞానం సర్వతోముఖం కాదని భావించినట్లవు తుంది. ఎందుకంటే దేవుని జ్ఞానం అన్నింటినీ పరివేష్టించి ఉన్నప్పుడు, ఈ మధ్యవర్తులు ఆయన జ్ఞానంలో చేసే వృద్ధి ఏముంటుంది? ఒకవేళ ఆ దైవం– తన జ్ఞానానికి విరుద్ధంగా– కేవలం ఆ మధ్యవర్తుల సిఫారసు ఆధారంగా జనులను సద్వర్తనులుగానో, దుర్వర్తనులుగానో ఖరారు చేసే మాటైతే, ఆయన న్యాయశీలుడు, వివేచనాపరుడు కాడని తేలిపోతుంది. ఒకవేళ ఆ నిజదైవం కటాక్షం పొందడానికి ఆయన ఒక్కణ్ణి మాత్రమే సేవించి విధేయత చూపితే చాలదనీ, వేరొకరిని మధ్యవర్తిగా ఆశ్రయించటం కూడా అవసరమని భావిస్తే ఈ నమ్మకం కారణంగా ప్రతి దాసుడు ఆయన సామీప్యాన్ని, ఆయన కారు ణ్యాన్ని, ఆయన ఔదార్యాన్ని, ఆయన క్షమాగుణాన్ని నిరాకరించిన వాడవుతాడు. ఇది ఒక దాసుడు తన ప్రభువు యెడల లోనయ్యే అత్యంత ఘోరమైన దురనుమానం అవుతుంది.

దివ్య ఖుర్ఆన్ ఇలాంటి విషయాలను ప్రస్తావించినప్పుడల్లా మనిషి ఒక తిరుగులేని విషయాన్ని అంగీకరించినప్పుడు అది వాంఛించే దానిని కూడా అంగీకరించాలని నొక్కి వక్కాణిస్తుంది.

**"అల్లాహ్‌కు కొడుకులు, కూతుళ్ళు ఉన్నారని వీళ్ళు అంటున్నారు. (ఇలాంటి నిందారోపణలకు) అల్లాహ్ అతీతుడు, పవిత్రుడు. పైగా భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ ఆయనదే. అవన్నీ ఆయన ఆజ్ఞలకు తలఒగ్గి ఉన్నాయి. భూమ్యాకాశాలను ప్రప్ర థమంగా సృష్టించినవాడు ఆయనే. ఆయన ఏ పని అయినా**

**చేయ సంకల్పించుకున్నప్పుడు, దానిని 'అయిపో' అని అంటాడు. అంతే, అది అయిపోతుంది."** *(అల్ బఖరా : 116, 117)*

అరబీ మూలంలో **'సుబ్‌హానహూ'** (ఆయన పవిత్రుడు, పరిశుద్ధుడు) అనే పదం ఒక 'ప్రమాణం'గా వచ్చింది. దీని అర్థం ఏమిటంటే దైవానికి సంతానం కలదనే భావన దైవత్వపు భావనకు విరుద్ధం. దైవత్వపు (ఉలూహియత్) భావన కాంక్షించేదేమిటంటే, దైవానికి అన్ని రకాల భాగ స్వామ్యాల నుండి, సహవర్తుల నుండి, సాటి కల్పించే విషయాల నుండి అత్యున్నతునిగా, పరిశుద్ధునిగా భావించాలి. భూమ్యాకాశాల నిర్మాత ఆయనేనని, శూన్యం నుండి అస్థిత్వాన్ని వెలికి తీసినవాడు ఆయనేనని, ఆయన రాజ్యాధికారం ఎంత తిరుగులేనిదంటే, ఆయన దేని గురించి అయినా సంకల్పించుకుని ఉనికిలోనికి రమ్మని ఆజ్ఞాపించగానే అది ఉనికిలోనికి వచ్చేస్తుందని నమ్మినడుచుకోవాలి. ఇలాంటి గొప్ప అస్థిత్వం మాత్రమే దైవం కాగలుగుతుంది. కాని మీరు దేవుని ఈ గుణాలను అంగీకరిస్తూనే, ఆయన దైవత్వానికి విరుద్ధంగా ఉన్నవాటిని కూడా నమ్మినట్లయితే, అది దేవుని ఘనత్వానికి ఏమాత్రం శోభాయమానం కాదు.

వేరొక చోట ఈ విధంగా సెలవీయబడింది :

**"అల్లాహ్‌కు సంతానం కలదని వీరు అంటున్నారు : సుబ్‌హానల్లాహ్! ఆయన ఏ అక్కరా లేనివాడు. ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా ఆయన ఆస్తియే. మీరంటున్న మాటకు మీ వద్ద ఉన్న నిదర్శనమేమిటి?"** *(యూనుస్ : 68)*

ఎంతో బలహీనమైన, నిస్సహాయమైన వాటిని దైవానికి భాగస్వామ్యం కల్పించే వాటిని ఎత్తి చూపుతూ ఖుర్ఆన్ ఏమంటుందో చూడండి :

**మానవులారా! ఒక ఉదాహరణ ఇవ్వబడుతోంది; దానిని శ్రద్ధగా వినండి; అల్లాహ్‌ను కాదని మీరు ఏ దేవుళ్లను వేడుకుంటున్నారో, వారందరూ కలిసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలిచినా, అలా చేయలేరు. అంతేకాదు, ఒకవేళ ఈగ వారి నుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా, వారు దానిని విడిపించుకు రానూ లేరు. సహాయాన్ని అర్థించేవారూ బలహీనులే, సహాయం**

కోసం అర్థింపబడేవారూ బలహీనులే. అల్లాహ్ గొప్పతనాన్నే వారు తెలుసుకోవలసిన విధంగా తెలుసుకోలేదు. నిజానికి అల్లాహ్ మాత్రమే శక్తిమంతుడు, గౌరవనీయుడూను.

***(అల్ హజ్జ్ : 73,74)***

మరో చోట ఇలా ఉపదేశించబడింది :

**ఇక ఆయనను వదలివేసి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారు, (తమ ఈ చర్యకు కారణంగా) "వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము" అని అంటారు. అల్లాహ్ నిశ్చయంగా వారి మధ్యన వారు విభేది స్తున్న అన్ని విషయాలను గురించి తీర్పు చెబుతాడు. అసత్య వాదీ, సత్యధిక్కారీ అయిన ఏ వ్యక్తికీ అల్లాహ్ సన్మార్గం చూపడు. ఒకవేళ అల్లాహ్ ఎవరినైనా తన కుమారుడుగా చేసుకోదలిస్తే, తన సృష్టిలో తాను కోరిన వారిని ఎన్నుకుని ఉండేవాడు. ఆయన పరిశుద్ధుడు. (ఆయనకు కుమారుడు ఉంటాడు అనే విషయా నికి) అతీతుడు. ఆయన అల్లాహ్ ఒక్కడే, అందరిపై ఆధిక్యం కలవాడు. ఆయన ఆకాశాలనూ, భూమినీ సత్యంతో సృష్టిం చాడు. ఆయనే పగటిని రేయితోనూ, రేయిని పగటితోనూ చుట్టి వేస్తాడు. ఆయనే సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ నియమబద్ధులుగా చేసి ఉంచాడు. వాటిలో ప్రతి ఒక్కటీ ఒక నిర్ణీత కాలం వరకు సంచ రిస్తూ ఉంటుంది. తెలుసుకోండి, ఆయన మహాశక్తిమంతుడు మరియు మన్నించేవాడూను. మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించినవాడు ఆయనే, తిరిగి ఆయనే ఆ ప్రాణి నుండి దాని జంటను సృజించాడు. ఇంకా ఆయనే మీ కొరకు పశువులలో ఎనిమిది మగ, ఆడ జాతులను సృష్టించాడు. ఆయన మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి తెరలలో మీకు ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇస్తూ పోతున్నాడు. (ఈ కార్యాలు నిర్వహించే) ఈ దేవుడే మీ ప్రభువు, సృష్టి సామ్రాజ్యం ఆయనదే. ఆయన**

**తప్ప మరొక దేవుడు ఎవ్వడూ లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మరలింపబడుతున్నారు? ఒకవేళ మీరు తిరస్కార వైఖరిని అవలంబిస్తే అల్లాహ్ మీ అక్కర ఎంత మాత్రం లేనివాడు. కాని ఆయన తన దాసులు తిరస్కార వైఖరిని అవలంబించటాన్ని ఇష్టపడడు. ఒకవేళ మీరు కృతజ్ఞతలు తెలిపితే, దాన్ని ఆయన మీ కొరకు ఇష్టపడతాడు. బరువు మోసేవాడెవ్వడూ ఇతరుల బరువును మోయడు. చివరకు మీరందరూ మీ ప్రభువు వైపునకే మరలవలసి ఉంది. అప్పుడు ఆయన మీకు మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో తెలుపుతాడు. ఆయన హృదయాల స్థితిని సైతం ఎరుగును. మనిషిపైకి ఎప్పుడైనా ఏదైనా ఆపద వచ్చిపడితే, అతడు తన ప్రభువు వైపునకు మరలి ఆయనకు మొర పెట్టు కుంటాడు. తరువాత అతడి ప్రభువు అతడికి తన అనుగ్రహాన్ని ప్రసాదించినప్పుడు, అతడు గతంలో ఏ ఆపదను గురించి మొర పెట్టుకున్నాడో, ఆ ఆపదను మరిచిపోయి, ఇతరు లను అల్లాహ్‌కు సమానులుగా నిలబెడతాడు. ఈ విధంగా అతడు (ప్రజలను కూడా) అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తాడు. (ఓ ప్రవక్తా!) అతడితో, 'కొన్నాళ్ళపాటు నీ తిరస్కార వైఖరి ద్వారా ఆనందాన్ని అనుభవించు. చివరకు నీవు తప్పకుండా నరకానికి పోయేవాడివే' అని చెప్పు."** ***(అజ్ జుమర్ : 3-8)***

ఈ ఆయత్‌లపై చింతన చేసిన వ్యక్తి ముందు తౌహీద్‌ను రుజువు చేసే నిదర్శనాలతోపాటు షిర్క్‌ను ఖండించే కోణాలు ఈ క్రమంలో ముందుకు వస్తాయి.

(అ) ఎవరినయినా దైవానికి భాగస్వామ్యం కల్పించేవారు అబద్ధీకులు, మేలును మరచినవారు. దైవం తనతోపాటు ఎవరినయినా పార్ట్‌నర్లుగా చేసుకున్నాడన్న దానికి వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఒకవేళ ఉంటే వారు ఆ సాక్ష్యాధారాలను సమర్పించాలి. ఈ సాక్ష్యాధారానికి సంబంధించిన తప్సీళ్ళు ఈ అధ్యాయం ప్రారంభంలోనే వచ్చాయి. దానిని మళ్ళీ చర్చించాల్సిన అవసరం లేదు.

(ఆ) దేవునికి కూతుళ్ళు ఉన్నారనీ, వారు ఆయన దగ్గర సిఫారసు చేస్తారన్న ఆలోచన పూర్తిగా మిథ్య. దైవానికి సంతానం కలదన్న ఆలోచనే అసలు శుద్ధ తప్పు. దేవుడనేవాడు ఒక్కడై ఉండాలి. తిరుగులేనివాడు అయి ఉండాలి. అందరినీ అదుపులో ఉంచేవాడై ఉండాలి. ఆయన అన్ని రకాల అవసరాలకు, బలహీనతలకు అతీతుడు, ఉన్నతుడు. అలాంటప్పుడు ఆయనకు కొడుకులు, కూతుళ్ళ అవసరం ఏముంది? మరింత ఘోరమైన విషయం ఏమిటంటే, అరబ్బులు దైవానికి కూతుళ్ళు ఉన్నారని నమ్మేవారు. మరి చూడబోతే వాళ్ళు స్వయంగా ఆడపిల్లలను అసహ్యించుకునేవారు. అంటే వారు రెండు తప్పులు చేసేవారు. ఒకటి; వారు దైవానికి సంతానాన్ని ఆపాదించటం. రెండు; ఆ సంతానంలో కూడా, తాము అసహ్యించుకునే కూతుళ్ళను దేవుని పద్దులో జమ చేయటం. ఎంత అడ్డగోలు పంపకం ఇది!

(ఇ) ఈ జగతి ఏదో అల్లాటప్పాగా సృష్టించబడలేదు. దీని సృష్టి వెనుక ఒక లక్ష్యం ఉంది. అంటే ప్రతిఫలం లభించే రోజు ఒకటి తప్పకుండా రానున్నది. ఆనాడు సంపూర్ణ న్యాయం జరగటం తథ్యం. ఈ దృక్పథంతోపాటు సిఫారసు దృక్పథం పొసగదు. సిఫారసు దృక్పథం ఈ లోకం లక్ష్యబద్ధమై ఉందనే దానికి వ్యతిరేకం. సిఫారసు న్యాయానికి విరుద్ధం.

(ఈ) ఈ జగతిని సృష్టించినవాడు సర్వాధిక్యుడు (అజీజ్), క్షమించేవాడు (గఫ్ఫార్) కూడా. అంటే ఆయన అందరిపై ఆధిపత్యం కలవాడు. ఆయన సమ్ముఖంలో ఆయన ఆనతి లేకుండా ఒక్కమాటైనా మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదు. దాంతోపాటు ఆయన 'గఫ్ఫార్' కూడా. అంటే తన దాసులకు క్షమాభిక్ష పెట్టేవాడు, వారి పాపాలను మరుగుపరచేవాడు. అందుచేత ఆయన వద్ద సిఫారసు చేసేవారి అవసరం ఉండదు. మనిషి చేసిన ఆచరణే అతనికి సిఫారసుదారు.

(క) ఆ తర్వాత సృష్టి, పాలన పోషణ నిదర్శనాల ద్వారా తన జ్ఞానపరిధి ఎంత విస్తృతమైనదో చెప్పాడు. మరి దాని ఆధారంగా వెలికి తీసిన ఫలితం ఏమిటంటే ఎవరయితే పుట్టించాడో, ఎవరయితే పోషణ నిమిత్తం సకల ఏర్పాట్లు చేశాడో, మాతృ గర్భాలలో ఒకదాని మీద ఒకటిగా పేరుకుని

ఉన్న పొరల వెనుక తన పనితనపు సొగసును చూపిస్తున్నాడో ఆ దేవుడే 'ప్రభువు' (రబ్) అనదగినవాడు. కనుక ఆయన్నే ప్రభువుగా నమ్మి నడుచుకోండి. గగన భువనాల సార్వభౌమత్వం ఆయన చేతుల్లోనే ఉంది. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఉండకూడదు.

(చ) ఆ తరువాత న్యాయశాసనాల గురించి విడమరచి చెప్పి సిఫారసుకు సంబంధించిన సమస్త ఆశల పునాదులను పెకలించి వేయటం జరిగింది. దేవుడు తన దాసుల తరఫు నుండి తిరస్కార (కుఫ్ర్) వైఖరిని గానీ, కృతఘ్నతా వైఖరిని గానీ ఇష్టపడడు. కాబట్టి కోరినవారు దేవుని కృతజ్ఞులైన దాసులుగా మారి ఆయన ప్రసన్నతను చూరగొనవచ్చు. ఆయన సామీప్యం పొందవచ్చు. అలాగే కోరినవారు మేలును మరచిన వైఖరిని అవలంబించి దేవుని ఆగ్రహానికి గురికావచ్చు. ఈ రెండు విషయాలు మనిషి ఆచరణపై ఆధారపడి ఉన్నాయి. చేసిన మేలును మరచిన 'కృతఘ్నుల'ను ఎవరూ 'కృతజ్ఞులు'గా మార్చలేరు. కృతజ్ఞులను ఎవరూ కృతఘ్నులుగా నిలబెట్టలేరు. బరువును మోసే వాడెవడూ ఇతరుల బరువును మోయడు.

(ట) ఆ తరువాత ఆయన తన జ్ఞానపరిధి గురించి విశ్లేషించి సిఫారసు అవసరం లేదని తేల్చి చెప్పాడు. ఎందుకంటే ఆయన గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు. అలాంటప్పుడు ఆయన జ్ఞానంలో వేరొకరు వృద్ధి నొసగాల్సిన అవసరం ఏముంటుంది?

(త) చివర్లో మనిషి బలహీనత గురించి చెప్పటం జరిగింది. మేము దీనిని తౌహీద్‌కు సంబంధించిన ప్రత్యేక సాక్ష్యాధారాల అధ్యాయంలో విడమరచి చెప్పాము. దీనిపై మరింత విశ్లేషణ అవసరం లేదు.

ఈ ముఖ్యాంశాలు, వాటి అనుబంధ అంశాలను కూడా విశ్లేషించిన మీదట దైవ భావనకు సంబంధించి ముందుకు వచ్చే స్వరూపం ఆయతుల్ కుర్సీ. దాని అర్థం ఇది–

**"అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ**

**రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగల వాడెవ్వడు? ప్రజల ముందు ఉన్న దానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియజెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాల లోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను." *(అల్ బఖరా : 255)***

ఈ విషయానికి సంబంధించిన మరో అత్యుత్తమ దృష్టాంతం అల్ హష్ర్ సూరాలోని ఈ వచనాలలో ఉంది.

**"ఆయనే అల్లాహ్; ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు; దృశ్యా దృశ్య విషయాలన్నీ ఎరిగినవాడు. ఆయనే కరుణామయుడు, కృపాశీలుడు. ఆయనే అల్లాహ్, ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు. ఆయన చక్రవర్తి, ఎంతో పరిశుద్ధుడు, సురక్షితుడు, శాంతి ప్రదాత, సంరక్షకుడు, సర్వాధికుడు, తన ఉత్తరువులను తిరుగు లేని విధంగా అమలుపరచేవాడు, ఎల్లప్పుడూ గొప్పవాడుగానే ఉండేవాడు. ప్రజలు కల్పించే దైవత్వపు భాగస్వామ్యం వర్తించని పరిశుద్ధుడు అల్లాహ్, సృష్టి వ్యూహాన్ని రచించేవాడు, దానిని అమలుపరచేవాడు, ఆపై దాని ప్రకారం రూపకల్పన చేసేవాడు. ఆయనకు మంచి పేర్లు ఉన్నాయి. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ ఆయన పరిశుద్ధతను కీర్తిస్తోంది. ఆయన సర్వాధికుడు, వివేకవంతుడూను." *(అల్ హష్ర్ : 22-24)***

ఈ సందర్భంగా ఇఖ్లాస్ సూరాపై కూడా ఓ సారి దృష్టిని సారించండి:

**"ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ**

**లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.** ***(అల్ ఇఖ్లాస్ : 1-4)***

దైవానికి సంబంధించిన దృక్పథం అరబ్బు జనులు సమ్మతించిన కొన్ని తిరుగులేని అంశాలపైనే ఏర్పడింది. ఖుర్ఆన్ చేసిన పనేమిటంటే దేవుని ఏ ఏ గుణాలను అరబ్బులు నమ్మేవారో, అవి వాంఛించే వాటిని కూడా వారికి బోధించి, వాటిని కూడా నమ్మి నడుచుకోండి అని పురమాయించింది. వాటిని గనక నమ్మి నడుచుకునేటట్లయితే వాటికి విరుద్ధంగా ఉన్న అంశాలను కూడా విడనాడవలసి ఉంటుంది. కాబట్టి వాటిని విడనాడండి అని కూడా ఖుర్ఆన్ చెప్పింది.

అలాగే ఏ ఏ గుణాలను అంగీకరించటం వల్ల అల్లాహ్ ఏ ఏ హక్కులు వారిపై విధితమవుతాయో, వాటిని కూడా పాటించాలని, వాటిలో ఎవరికీ భాగస్వామ్యం కల్పించరాదని ఖుర్ఆన్ కోరింది.

పుట్టించినవాడే మీ ప్రభువు అని, శాసించే హక్కు కూడా ఆయనకే ఉందని అల్ ఆరాఫ్ సూరాలో నిరూపించిన తర్వాత లోలోపల అయినా, బిగ్గరగా అయినా ఆయన్నే పిలువాలనీ, భయంతోనూ ఆశతోనూ ఆయన్నే మొరపెట్టుకోవాలని బోధించటం జరిగింది. కష్టాలను సులభం చేసేవాడు, గండాల నుండి గట్టెక్కించేవాడు, ఆశలు ఆకాంక్షలను నెరవేర్చేవాడు ఆ నిజ దైవమేనని విశదీకరించటం జరిగింది. "మీ ప్రభువును మొరపెట్టుకోండి- విలపిస్తూను, మెల్లమెల్లగానూ" అని అనటం గమనార్హం. "ఆయన్నే మొరపెట్టుకొనండి- భయంతోనూ, ఆశతోనూ" అని కూడా ఉపదేశించటం జరిగింది. ఏ సృష్టికర్తను మీరు నమ్ముతారో, ఆయన దాస్యమే చేయండి, ఆయనకే విధేయత చూపండి. ఆయన దాస్యంలో, విధేయతలో ఇతరులను చేర్చకండి అని ఉద్బోధించటం ప్రత్యేకంగా గమనించదగిన విషయం-

**"మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది."** ***(అల్ బఖరా : 21)***

ఆ నిజ ఆరాధ్యదైవం ఆరాధన కొరకు పదే పదే పెట్టబడిన షరతు విధేయత కేవలం ఆ దైవానికే ప్రత్యేకం కావాలన్నది. అంటే దైవారాధన చేస్తూ

కూడా విధేయత మరొకరికి చూపటం ధర్మసమ్మతం కాదు. **లా ఇలాహ ఇల్లా హువ వద్‌వూహు ముఖ్‌లిసీన లహుద్దీన్** (ఆయన తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేనేలేడు. కనుక ఆయన్నే మొరపెట్టుకోండి. విధేయతను, ధర్మాన్ని కేవలం ఆయనకే ప్రత్యేకించుకుని).

అలాగే ఇంకా ఏమనబడిందంటే, ఏ ప్రభువు కొరకు భూమ్యాకాశాల సార్వభౌమత్వం ప్రత్యేకమై ఉందో ఆయనకే సకల స్తోత్రాలు, కృతజ్ఞతలు శోభిస్తాయి. **లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు** (రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం కూడా ఆయనకే తగును).

అల్ బఖరా సూరాలోనే, అల్లాహ్‌ను సిసలైన వరప్రదాతగా నిరూపించిన మీదట ఏమనబడిందంటే ఆయనే నిజమైన ప్రేమకు కేంద్ర బిందువు కావాలి. **వల్లజీన ఆమనూ అషద్దు హుబ్బన్ లిల్లాహ్** (విశ్వాసులు అన్నిటికంటే అధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు). ఆ తర్వాత చెప్పబడిన విషయం కూడా చాలా ముఖ్య మైనదే– అంతా దైవకటాక్షంతోనే ప్రాప్తమైనప్పుడు, వాటిని హలాల్ (ధర్మ సమ్మతం)గా, హరామ్(నిషిద్ధం)గా ఖరారు చేసే అధికారం కూడా ఆ దైవానికే ఉంది. వాటిని హలాల్, హరామ్‌గా నిర్ణయించే అధికారాన్ని ఇతరులకు కట్ట బెట్టడం షిర్క్ (అల్ బఖరా సూరాలోని 163–169 ఆయత్‌లను చూడండి)

అన్ నహ్ల్ సూరాలో 48–49 ఆయత్‌లలో ఒకే దేవుని నిర్వహణాధి కారాన్ని రుజువు చేసిన మీదట, దాని అనివార్య ఫలితాన్ని ఇలా ప్రకటించటం జరిగింది : **"ఫ ఇయ్యాయ ఫర్‌హబూన్"** (కాబట్టి మీరు నాకే భయపడండి). దైవేతరులకు భయపడటంపై ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ **"అఫ ఘైరల్లాహి యత్తఖూన్?"** (అలాంటప్పుడు మీరు అల్లాహ్‌ను కాదని మరొకరికి భయపడతారా?) అని ప్రశ్నించటం జరిగింది.

అల్ అన్‌ఆమ్ సూరాలో, భూమ్యాకాశాల సృష్టికర్తనే తమ సహాయకునిగా చేసుకోవాలని, ఆయన సమక్షంలోనే ఆత్మ సమర్పణ చేసుకోవాలని ఆదేశిం చటం జరిగింది :

> **ఇలా అను: "భూమ్యాకాశాల సృష్టికర్త, ఉపాధి ప్రదాతే గాని ఉపాధి గ్రహీత కానివాడు అయిన అల్లాహ్‌ను కాదని నేను మరెవరినయినా నా సంరక్షకుడుగా చేసుకోవాలా?" ఇలా చెప్పు:**

**"అందరికంటే ముందు నేను ఆయనకు విధేయుణ్ణి కావాలని నన్ను ఆదేశించటం జరిగింది."** ***(అల్ అన్ఆమ్ : 14)***

యూనుస్ సూరాలో అల్లాహ్‌ను మార్గదర్శకునిగా నిరూపించిన తరువాత, ఆయన్ని అనుసరించటమే శోభాయమానమని నొక్కి వక్కాణించటం జరిగింది

**వారిని ఇలా అడుగు : "మీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో సత్యం వైపునకు మార్గం చూపేవాడు కూడా ఎవడైనా ఉన్నాడా? ఇలా అను; కేవలం అల్లాహ్‌యే సత్యం వైపునకు మార్గం చూపుతాడు. అలాంటప్పుడు మీరే చెప్పండి, సత్యం వైపునకు మార్గం చూపేవాడా విధేయతకు ఎక్కువ అర్హుడు? లేక తనకు ఎవడైనా మార్గం చూపితే తప్ప స్వయంగా మార్గాన్ని పొందలేనివాడా? అసలు మీకేమయింది, ఇటువంటి తలకిందులు నిర్ణయాలు చేస్తున్నారు?** ***(యూనుస్ : 35)***

చెప్పొచ్చేదేమంటే దైవం ఒక్కడేనని నమ్మి నడుచుకునే వ్యక్తి దేవుని హక్కులలో ఏ విధంగా కూడా ఇతరులకు సహవర్తుల్ని కల్పించి ఆయన హక్కుల్ని కాజేసే, ఆయన గుణగణాలను త్రోసిపుచ్చే చేష్టకు ఒడిగట్టరాదు. ఉదాహరణకు– ఏ వ్యక్తి దైవాన్ని గోచర అగోచర విషయాల జ్ఞానం కలవాడిగా నమ్ముతాడో, అతను వేరెవరినయినా సిఫారసు చేసేవానిగా నమ్మి దేవుని జ్ఞాన గుణాన్ని తృణీకరించకూడదు. మరే వ్యక్తి అయితే దైవాన్ని కరుణామయునిగా, కృపాశీలునిగా నమ్ముతున్నాడో అతను 'సిఫారసు నమ్మకం' ఏర్పరచుకుని దేవుని న్యాయశీలం పట్ల దురనుమానం కలిగి ఉండకూడదు.[1] దైవాన్ని

---

1. బహుదైవారాధకులు (ముష్రిక్‌లు) సిఫారసుకు సంబంధించి ఏ నమ్మకం ఏర్పరచుకున్నారో, దానివల్ల దేవుని గుణగణాలలో 'షిర్క్' చేసినట్లు అయ్యింది. అంతేకాదు, ఆయన జ్ఞాన విశేషాలను, న్యాయ గుణాన్ని, వివేచనను తృణీకరించినట్లయింది. ఇది షిర్క్. ఇది కుఫ్ర్. ఈ విధమైన నమ్మకాన్ని దైవదూతలు, దైవప్రవక్తలు, సత్పురుషుల గురించి ఏర్పరచుకోవటం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. వీరిలో ఏ ఒక్కరికి కూడా దైవ సమక్షంలో ప్రమాణబద్ధమైన అధికారం లేదని ఖుర్ఆన్ వచనాల ద్వారా స్పష్టమవుతోంది. అందరూ ఆయన ఎదుట

సార్వభౌమునిగా అంగీకరించిన వాడు, ఆయన సార్వభౌమత్వంలో వేరితరులను చేర్చి వారికి విధేయత చూపకూడదు. దైవాన్ని పరమ పవిత్రునిగా, పరిశుద్ధునిగా నమ్మేవాడు, పరిశుద్ధతనే ఆయన సామీప్యానికి సాధనంగా చేసుకోవాలి. వేరితరులను, భాగస్వాములను పరిశుద్ధులుగా భావించరాదు. దైవాన్ని శాంతి ప్రదాతగా నమ్మేవాడు శాంతి సుఖ సౌఖ్యాల కోసం ఆయన్నే అర్థించాలి. దైవాన్ని శాంతిభద్రతల పరిరక్షకునిగా నమ్మి నడుచుకునేవాడు, దేవుని శరణు జొచ్చి తనను రక్షించుకోవాలి. ఆయన్ని కార్యసాధకునిగా నమ్మేవాడు ఆయనపైనే భరోసా చేయాలి. సహాయం కొరకు ఆయన్నే అర్థిం చాలి. ఆయన్ని సర్వాధిక్యునిగా అంగీకరించినవాడు, వేరితరులందరినీ ఆయన సన్నిధిలో వినమ్రులై ఉండేవారుగా తలపోయాలి. ఆయన్ని పౌరుషవంతునిగా, అభిమాన ధనునిగా నమ్మేవాడు ఇతరులను ఆయనకు భాగస్వాములుగా కల్పించి ఆయన పౌరుషాన్ని కవ్వించకూడదు. ఆయన్ని రెచ్చగొట్టకూడదు. దైవాన్ని సృష్టికర్తగా, రూపశిల్పిగా నమ్మేవాడు ఆయన్ని పరిపూర్ణ జ్ఞానిగా, సంపూర్ణ శక్తిమంతునిగా అంగీకరించడం అవశ్యం.

## 3. న్యాయానికి ప్రమాణ నికషం

న్యాయం అనేది మానవ నైజంలోనే ఉందని మేము తౌహీద్ ప్రత్యేక నిదర్శనాల సందర్భంగా నిరూపించాము. ఈ 'న్యాయం' మనిషిని ఒక్కడైన దేవుని పట్ల కృతజ్ఞతలు చెల్లించుకునేందుకు, ఆయన దాస్యం చేసేందుకు పురి కొల్పుతుంది. ఈ న్యాయ చైతన్యాన్ని ఖుర్ఆన్ అహదె అలస్త్‌గా అభివర్ణించింది. దీని బాధ్యత ప్రతి మనిషిపై మోపింది. అక్కడ ఇది సర్వసామాన్యమైన

---

తలవంచుకుని, నిస్సహాయులుగా నిలబడతారు. ఆయన ఎదుట ఆయన అనుజ్ఞ లేకుండా నోరు విప్పి మాట్లాడే అధికారం ఎవరికీ ఉండదు. ఇంకా, సత్యానికి విరుద్ధంగా వారు ఒక్క మాట కూడా మాట్లాడలేరు. వారు చేసే సిఫారసు వల్ల సత్యం అసత్యంగానో, అసత్యం సత్యంగానో పరిణమించే ఆస్కారం ఎంతమాత్రం ఉండదు. కాకపోతే దైవప్రవక్తలకు, సజ్జనులకు, దైవదూతలకు సిఫారసు చేసే అనుమతి ఉంటుందని చెప్పబడింది. కాని వారి సిఫారసు బహుదైవారాధనా సిఫారసుకు పూర్తిగా విరుద్ధమైనది. దీనిపై క్షుణ్ణంగా 'పరలోక వాస్తవికత' పుస్తకంలో మేము ఇన్షా అల్లాహ్ చర్చించగలము.

నిదర్శనంగా పేర్కొనబడింది. దీని ప్రమాణం అరబ్బులకు, సమస్త మానవ జాతికి సమానంగా వర్తిస్తుంది. దివ్య ఖుర్ఆన్ ఈ మూల సరోవరం నుండే మరి కొన్ని ప్రత్యేక నిదర్శనాలను కూడా వెలికి తీసింది. ఉదాహరణకు– అరబ్బులంతా దైవాన్ని విశ్వ సృష్టికర్తగా, ఉపాధి ప్రదాతగా నమ్మేవారు. కాని ప్రభువుగా, పాలకుడు పోషకునిగా ఇతరులను కల్పించుకునేవారు. అంతేకాదు, ఆ భాగస్వాముల స్థాయిని, అంతస్తును ఎంతగా పెంచేవారంటే, వారిని తీసుకెళ్ళి దేవుని ప్రక్కన కూర్చోబెట్టేసేవారు. పైగా కొన్ని సందర్భాల్లో నిజ దైవం కంటే కూడా ఉన్నత స్థానంలో కూర్చోబెట్టేవారు. మానవ నైజంలో అంతర్లీనమై ఉన్న 'న్యాయం' ఆధారంగా ఖుర్ఆన్ వారిని ఏమని ప్రశ్నించిందంటే, మీ బానిసలు (సేవకులు) మీ సరసన ఉండటాన్ని, మీతోపాటు మీ ఉపాధిని పంచుకోవటాన్ని మీరు ఇష్టపడనప్పుడు, దేవునిచే పుట్టించబడిన వాటిని దేవుని సమాన భాగస్థులుగా ఎలా నిలబెడుతున్నారు? మీ నైజం ఏ విషయాన్ని మీ కొరకు సహించటం లేదో దానిని గొప్పవాడైన అల్లాహ్ కొరకు ఎలా సహిస్తోంది? నిజానికి మీరు దేవుని విషయంలో చాలా సెన్సెటివ్‌గా ఉండాల్సింది. దైవానికి సాటి కల్పించే విషయాన్ని మీరు అసహ్యించుకోవాల్సింది. ఈ మౌలిక విషయాన్ని దృష్టిలో ఉంచుకుని క్రింద పొందుపరచబడిన ఆయత్‌లపై యోచన చేయండి–

> **చూడండి, అల్లాహ్ మీలో కొందరికి కొందరికంటే జీవన సామగ్రి విషయంలో ఆధిక్యం ప్రసాదించాడు. అయితే ఈ ఆధిక్యం ఇవ్వబడినవారు తమ జీవన సామగ్రిని తమ బానిసల వైపునకు మళ్ళించరు కదా? వారు ఇద్దరూ ఈ జీవన సామగ్రిలో సమాన భాగస్తులు అయ్యేటందుకు. అల్లాహ్ ఉపకారాన్నే ఒప్పుకోవటానికి వారు తిరస్కరిస్తున్నారా? అల్లాహ్‌యే మీ కోసం మీ జాతి నుండే భార్యలను చేశాడు. ఆయనే ఆ భార్యల ద్వారా మీకు కుమారులను, మనుమలను ప్రసాదించాడు. మంచి మంచి వస్తువులను మీకు తినటానికి ఇచ్చాడు. అయితే వారు (ఇదంతా చూస్తూ కూడా ఇదంతా తెలిసి కూడా) అసత్యాన్నే విశ్వసిస్తున్నారా! అల్లాహ్ ఉపకారాన్నే తిరస్కరిస్తున్నారా? అల్లాహ్‌ను**

**వదలిపెట్టి ఆకాశాల నుండి గాని, భూమి నుండి గానీ వారికి ఆహారం ఇవ్వనటువంటి వారిని ఆ పని చెయ్యగల శక్తిలేని వారినీ పూజిస్తున్నారా? కనుక అల్లాహ్‌కు పోలికలను కల్పించకండి. అల్లాహ్ ఎరుగును, మీరెరుగరు. అల్లాహ్ ఒక ఉదాహరణను ఇస్తున్నాడు : ఒకడేమో బానిస– ఇతరుల యాజమాన్యంలో ఉన్నవాడు, స్వయంగా ఏ అధికారమూ లేనివాడు. ఇక రెండో వాడు– అతనికి మేము మా తరపు నుండి మంచి ఉపాధిని ప్రసాదించాము, అతడు అందులో నుండి బహిరంగంగానూ, రహస్యంగానూ బాగా ఖర్చు చేస్తాడు. చెప్పండి, వారు ఇద్దరూ సమానులేనా? అల్ హమ్‌దులిల్లాహ్ (స్తోత్రం అల్లాహ్ కొరకే). కాని అనేకులు (ఈ సామాన్య విషయాన్ని) ఎరుగరు. అల్లాహ్ మరొక ఉదాహరణను ఇస్తున్నాడు: ఇద్దరు మనుషులున్నారు. ఒకడు మూగవాడు, చెవిటివాడు. ఏ పనీ చెయ్యలేడు. తన యజమానికి భారమై కూర్చున్నాడు. ఆయన అతన్ని ఎక్కడకు పంపినా అతని వల్ల మంచి పని ఏదీ జరగదు. ఇక రెండో మనిషి– అతడు న్యాయం చెయ్యండి అని ఆజ్ఞాపిస్తాడు, స్వయంగా సన్మార్గంలో స్థిరంగా ఉన్నాడు. చెప్పండి, వారు ఇద్దరూ సమానులేనా?** ***(అన్ నహ్ల్ : 71–76)***

## గ్రంథం కల ప్రజలు, కపటులు

అంటే యూదులు, క్రైస్తవులు, ద్వంద్వ నీతిపరులు (మునాఫిఖీన్).

మేము 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో వివరించినట్లుగా వీరు సర్వసాధారణంగా దేవుని గుణగణాల సిసలైన దృక్పథంలో గాడి తప్పారు. లేదా ఈ నేపథ్యంలో లోపభూయిష్టమైన విషయాలను నమ్మి నడుచుకునేవారు లేదా ఆ గుణగణాలు వాంఛించే వాటిని స్వీకరించడానికి వెనుకాడేవారు. ఈ కారణంగా వారికి సర్వ సామాన్యమైన నిదర్శనాలకు బదులు ప్రత్యేక నిదర్శనాలు చూపాల్సి వచ్చింది. అంటే మీరు ఏ లోపభూయిష్టమైన అంశాలను నమ్ముతున్నారో వాటిని పరిత్యజించండి, ఏ ఏ విషయాలు అవశ్యంగా పాటించవలసి ఉందో వాటిని

స్వీకరించండి అని గట్టిగా చెప్పటం జరిగింది. వారి ముందు దేవుని ఏకత్వ వాస్తవికతను కూలంకషంగా సమర్పించటం జరిగింది. ఆ వివరాలు 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో ఉన్నాయి. వాటిని ఇక్కడ పునరావృతం చేయాల్సిన అవసరం లేదు. కేవలం కొన్ని ముఖ్యాంశాలను చూచాయగా ప్రస్తావిస్తే సరిపోతుంది.

ఉదాహరణకు - నిజ ఆరాధ్య దైవం తప్ప మరో ప్రభువు లేడు అనేది గ్రంథవహుల వద్ద తిరుగులేని విషయం. మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్)ను, మీ పండితులను 'ప్రభువు'గా చేసుకోకండి అని ఖుర్ఆన్ చెప్పింది. ధర్మాధర్మాల (హలాల్- హరామ్)ను నిర్ణయించి, వాటిని జారీ చేసే హక్కు ఎవరికయినా ఉందని అంగీకరించటం కూడా వాస్తవానికి అతనికి ప్రభువుగా ఎంచటమేనని కూడా ఖుర్ఆన్ స్పష్టం చేసింది- మీరు నోటితో అతనిని ప్రభువు అని చెప్పినా చెప్పకపోయినా అది షిర్కే.

అలాగే యూదులకు తమ గురించి ఉన్న ఊహ ప్రకారం వారు దేవునికి ప్రియతములు, ఇతర దాసులకన్నా వారు ఉన్నతులు. వారి ఈ ఊహ తప్పు అని వారి చరిత్ర ఆధారంగానే ఖుర్ఆన్ నిరూపించింది. వారి తరతరాల చరిత్ర చాటి చెప్పేదేమంటే, వారు ఎప్పుడు దైవదాస్యం, దైవ విధేయతా పరిధికి వెలుపల అడుగు వేసినా, దేవుడు వారికి గుణపాఠంతో కూడిన శిక్షల్ని విధించాడు. వారి స్థాయి మానవ మాత్రునికి మించి ఒక్క అంగుళం కూడా ఉన్నతమైనది కాదని ఆ సంఘటనలే నిరూపించాయి. అంతేకాదు, మహనీయ ఇబ్రాహీమ్(అ) జీవిత గాథనంతటినీ వారికి వినిపించి, వారికి స్పష్టం చేసిన విషయం ఏమిటంటే ఇబ్రాహీమ్(అ)కు దైవ సన్నిధిలో లభించిన సామీప్యానికి, అంతస్తుకు అసలు కారణం ఆయనలోని స్వచ్ఛమైన దాస్య భావనే. మరి అలాంటప్పుడు ఇబ్రాహీమ్ (అ) సంతతి నుండే వచ్చిన వారికి దైవత్వపు స్థానం ఎలా ప్రాప్తమయింది?

అలాగే క్రైస్తవులు, మహనీయ మసీహ్(ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్) ఆనవాయితీకి భిన్నంగా పుట్టడాన్ని ఆయన దైవత్వానికి రుజువుగా పేర్కొన్నారు. ఖుర్ఆన్ వారి ఈ వాదనను వారి మెడలోనే వేస్తూ "మీరు ఆది మానవుడైన ఆదమ్(అ), దైవప్రవక్త యహ్యా(అ) పుట్టుక కూడా ఆనవాయితీకి భిన్నంగా ఉందని నమ్ముతారు కదా! మరైతే వారిద్దరికీ దైవత్వపు స్థాయి ఎందుకు

కట్టబెట్టలేదు?" అని నిలదీసింది. అదీగాక మహనీయ మసీహ్(అ), ఆయన తల్లి మర్యమ్– ఇద్దరూ అన్నం తినేవారు. అన్నపానీయాలు తీసుకోవటం మానవ మాత్రులనడానికి ఒక తిరుగులేని ఆధారం. ఎందుకంటే భోజనం చేయటం కూడా యూదులు, క్రైస్తవుల దృష్టిలో మానవ మాత్రులనడానికి ఒక రుజువు. ఈ సాక్ష్యాధారం ద్వారానే మహనీయ మసీహ్(అలైహిస్సలామ్) తన విషయంలో తన శిష్యుల్లో ఉన్న ఒక అపోహను దూరం చేశారు. దీని వివరాలు 'షిర్క్ వాస్తవికత' పుస్తకంలో గడిచాయి. ఇంకా మహనీయ ఏసుక్రీస్తు (అ) వారి కొన్ని ప్రవచనాల తర్జుమాలో తప్పులు దొర్లాయి. వాటిని దివ్య ఖుర్ఆన్ సరిదిద్దింది. ఉదాహరణకు– మహనీయ ఏసుక్రీస్తు (అలైహిస్సలామ్) నోట సువార్తలలో పదేపదే జాలువారిన వాక్యం **'నా తండ్రి, మీ తండ్రి'.** ఖుర్ఆన్ దీనిని **"రబ్బీ వ రబ్బుకుమ్"** (నా ప్రభువు, మీ ప్రభువు)గా పేర్కొంది. ఈ అభివర్ణన సువార్తల మూల భాష అయిన హెబ్రూ పరిభాషకు అనుగుణంగా ఉంది.

ఇక కపట విశ్వాసుల (మునాఫిఖీన్) మార్గభ్రష్టతకు ప్రధాన కారణం; విశ్వసించిన మీదట వారిపై విధితమయ్యే దేవుని హక్కులను వారు నెరవేర్చటంలో కనబరిచిన అశ్రద్ధ. విశ్వాసం (ఈమాన్) వాంఛించేదేమిటో వారికి తెలియక కాదు. ఆ విషయాలన్నీ వారికి విదితమే. ఒకవేళ వారికి ఏవైనా సందేహాలు, సంశయాలున్నా ఖుర్ఆన్ పదేపదే చేసిన సందేహాల నివృత్తితో అవి దూరమైపోయాయి. అయితే ఈ ద్వంద్వ నీతిపరుల (మునాఫిఖీన్) రోగం తార్కిక రోగం కాదు, అది మనో రోగం. దేవుని ఏకత్వం (తౌహీద్) వాంఛించే వాటిని నెరవేరుస్తూ ముందుకు సాగే గుండె ధైర్యం వారికి లేకపోయింది. అందుకే ఒక దారి గుండా దైవధర్మంలో ప్రవేశిస్తే మరో దారి గుండా పరారవడానికి సంసిద్ధమై ఉండేవారు. వారిలోని ఈ బలహీనతను దూరం చేయడానికి ఖుర్ఆన్ రెండు విధాలుగా ప్రయత్నించింది. ఒక వైపున ముస్లింలు బలహీనులుగా, అల్ప సంఖ్యలో ఉన్నప్పటికీ దైవ సహాయంతో వారెలా విజయతీరాలకు చేరుకున్నారో విడమరచి చెప్పింది. మరోవైపు దేవుని ఏకత్వం యొక్క విభాగాలన్నింటినీ పూసగుచ్చినట్లుగా తెలియజేసింది. జగతిలోని వస్తువులన్నీ ఏకేశ్వరుడైన అల్లాహ్ సన్నిధిలో మోకరిల్లి ఆయన్ని స్తుతిస్తున్నాయనీ, ఆయన పవిత్రతను కొనియాడటంలో లీనమై ఉన్నాయని కూడా బోధపరిచింది. ఆ విధంగానయినా వారికి మనోనిబ్బరం అబ్బుతుందని ఆశించటం జరిగింది. ముస్లింలు చాలా తక్కువ

సంఖ్యలో ఉండటం చూసి వారి ఆత్మ విశ్వాసం సన్నగిల్లకూడదనీ, తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ ఈ ముస్లింల మనోబలం చెక్కుచెదరకుండా ఉన్నంత కాలం వారి పయన బృందాలు రహదారిలో కిక్కిరిసిపోయేలా ఉంటాయని వారికి సంకేతప్రాయంగా ఉపదేశించటం జరిగింది. అంటే వారి తక్కువ సంఖ్య మూలంగా రహదారి, పైకి నిర్మానుష్యంగా కనిపించినప్పటికీ, వారు నడయాడే ప్రదేశాలు విశ్వాస బలంతో కళకళలాడుతూ ఉంటాయని ఉద్బోధించటం జరిగింది. దివ్య ఖుర్‌ఆన్‌లోని 'మస్‌జాత్'[1] ఆత్మను అర్థం చేసుకున్నవారికి, మా సంకేతాలను అర్థం చేసుకోవటంలో ఎలాంటి ఇబ్బంది ఎదురవదు.

---

1. 'మస్‌జాత్' అంటే 'సబ్బహ', 'యుసబ్బిహు' లాంటి పదాలతో మొదలయ్యే సూరాలు. ఈ సూరాలలో సాధారణంగా అన్యాపదేశంగా కపటులు సంబోధితులై ఉంటారు. వారు దేవుని ఏకత్వాన్ని అంగీకరించడానికైతే అంగీకరించారు గాని, దాని బాధ్యతలను నిర్వర్తించడంలో చంచలత్వం ప్రదర్శించారు. తడబడ్డారు. పిరికిపందలుగా నిరూపించుకున్నారు. వారు మక్కా బహుదైవారాధకుల, యూదుల కూటమికి భయపడేవారు. ఒకవైపు ముస్లింల శత్రువులతో లోపాయికారి ఒప్పందం చేసుకుంటూనే, మరోవైపు దైవప్రవక్త(స) శ్రేయాన్ని అభిలషించే వారుగా నటించేవారు. అందుకే ఖుర్‌ఆన్ వారికి పదేపదే ఒక విషయం గుర్తు చేసేది- చూడండి, భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువు దైవస్తోత్రం చేస్తూ, దేవుని పరిశుద్ధతను కొనియాడుతోంది. వాటిలో ఏ ఒక్కటి కూడా దైవాజ్ఞల పట్ల విముఖత చూపటం లేదు. అవి తమ ఆచరణ ద్వారా, అందరూ ఆ దైవానికే విధేయత కనబరచాలని పిలుపు ఇస్తున్నాయి. ఇంకా అవి ఏమని చాటి చెబుతున్నాయంటే, దైవానికి విధేయత చూపే దాసుల సంఖ్య చాలా తక్కువగా ఉందని భావించి నిరుత్సాహానికి లోనవకూడదు. ఎందుకంటే యథార్థం తద్భిన్నంగా ఉంది. ఈ విశ్వంలోని ప్రతిదీ దైవాజ్ఞలను శిరసావహిస్తోంది. ఆయన ఆజ్ఞలను ధిక్కరించేవారు ఎవరయినా ఉన్నారంటే వారు మనుజ జాతిలోని వారే. కాబట్టి దైవమార్గంలో ముందడుగు వేసిన వారెవరయినా సరే తనను ఒంటరివానిగా ఊహించుకోరాదు. పైగా అతను, ఇతరులను ఆరాధ్య దైవంగా చేసుకున్న కొద్ది మంది తుచ్ఛులు తప్ప నింగి నుండి నేలవరకూ ఒక్కొక్క అణువు తనకు తోడుగా ఉందని తలపోస్తూ ముందుకు సాగాలి.

# మానవ జీవితంపై తౌహీద్ ప్రభావం

వెనుకటి అధ్యాయాలలో దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి ముందుంచబడిన యథార్థం ద్వారా పూర్తిగా స్పష్టమైన విషయం ఏమిటంటే, తౌహీద్ కేవలం ఒక శాస్త్రీయ యథార్థం కాదు, పైగా అది అత్యంత ముఖ్యమైన క్రియాత్మక యథార్థం. మానవ జీవితంపై- అది వ్యక్తిగతమైనదైనా, సామూహిక మైనదైనా- దానివల్ల పడే ప్రభావాలు లోతైనవి. వాటిలో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించదలిచాము.

వ్యక్తిగత జీవితంపై తౌహీద్ వల్ల పడే ప్రభావం ఎటువంటిదంటే ఈ నమ్మకం (అఖీదా) మనిషిని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల శిఖరాగ్రానికి చేరుస్తుంది. మానవుడు సృష్టి శ్రేష్టుడైన కారణంగా ఈ స్వేచ్ఛకు, ఆత్మ గౌరవానికి అతను హక్కుదారుడు. ఈ విశ్వమంతా మానవుని కోసమే సృష్టించబడింది. కాని మానవుడు దేవుని ఏకత్వాన్ని ఆశ్రయించనంతవరకు అతడు దీనావస్థలోనే ఉంటాడు. అతడు ప్రపంచంలోని అల్పమైన వస్తువులకు కూడా భయపడి పోతాడు. గజగజా వణికిపోతుంటాడు. ఏ వస్తువులు అతనికి లోబడి ఉండ టానికి, అతనికి విధేయత చూపటానికి పుట్టించబడ్డాయో వాటికి తానే స్వయంగా లొంగిపోతాడు. వాటికి విధేయత చూపుతాడు. తన లాంటి ఒక మనిషినే తన ప్రభువుగా, యజమానిగా చేసుకుని వారి ముందు బానిసలా తలవంచుతాడు. వారినే అన్నదాతలుగా, వరప్రదాతలుగా, పేదల పరిపోషకు లుగా- బిరుదులిచ్చి- సంబోధిస్తాడు. వారికి ఆజ్ఞాపించే, శాసించే హక్కు

ఉందని అంగీకరిస్తాడు. కడకు బ్రతికి ఉన్న వారి ముందరే కాకుండా మృతుల సమాధులపై కూడా దరఖాస్తులను, విజ్ఞాపనా పత్రాలను సమర్పించుకుంటాడు. వారిని జగతి నిర్వహణలో భాగస్తులుగా, లాభనష్టాలు చేకూర్చేవారిగా భావిస్తాడు. ఆఖరికి ప్రతి నున్నని రాతిగుండును, ఎత్తయిన ప్రతి చెట్టు పుట్టను దైవంగా చేసుకుంటాడు. ఆఖరికి ప్రతి దట్టమైన అడవి, ప్రతి నిర్మానుష్యమైన ప్రదేశం, ప్రతి ప్రవహించే నది, ప్రతి హానికరమైన శక్తి, ప్రతి లాభదాయకమైన వస్తువు అతనిని తన దాస్యం కోసం పిలుపునిస్తుంది. వాటిలో ఏ ఒక్కదాని ముందు కూడా తన అంతరాత్మను వంచించుకోవడానికి అతను సంకోచించడు. అతనిలోని పౌరుషం నీరుగారిపోతుంది. ఒకసారి అతను తన గౌరవ స్థానం నుండి పడిపోయాడంటే, ఇక అతను పడిపోతూనే ఉంటాడు. అతనికి అల్లాహ్ ఏ ఔన్నత్యాన్ని ప్రసాదించాడో దానిని ఒక్కసారిగా పోగొట్టుకుంటాడు. సూరయె హజ్జ్‌లోని క్రింది ఆయత్‌లో ఈ విషయమే ఇలా చెప్పబడింది:

> **"ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు ఆకాశం నుండి క్రిందపడిపోయినట్లే. అతనిని, ఇక పక్షులైనా తన్నుకు పోతాయి లేదా గాలి అతనిని ముక్కలు ముక్కలయ్యే ప్రదేశానికైనా విసిరివేస్తుంది."** ***(అల్ హజ్జ్- 31)***

అల్లాహ్ ఏ ఏ వస్తువులను మానవ సేవలో నియోగించాడో అవి అతని సేవలో నిమగ్నమై ఉన్నప్పటికీ, అతనికి సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేయడానికి ఒక్క క్షణకాలం కూడా సహించవు. వాటి సాష్టాంగ ప్రణామం అల్లాహ్‌కే ప్రత్యేకం. కాని ఈ మానవుడే మరీ అన్యాయం. అతని దీనావస్థ గురించి ఏం చెప్పేది!? అతని నుదుటిపై గడప గడప వద్ద సాష్టాంగపడిన గుర్తులున్నాయి.

> **"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్తమూ, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలా మంది మానవులు, శిక్షకు అర్హులైన చాలామంది ప్రజలు అల్లాహ్ ముందు వినమ్రులై ఉండటాన్ని నీవు చూడటం లేదా? అల్లాహ్ ఎవరినైతే అవమానం పాలు చేస్తాడో, ఇక అతనికి గౌరవం ఇచ్చే వాడెవ్వడూ ఉండడు. అల్లాహ్ తాను కోరిన దానిని చేస్తాడు."**
>
> ***(అల్ హజ్జ్- 18)***

కాని తౌహీద్ (ఏకేశ్వరోపాసన) మెరుపు ప్రాప్తమవగానే ఒక్కసారిగా అతని పరిస్థితిలో విప్లవాత్మకమైన మార్పు వచ్చేస్తుంది. ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువు కన్నా అట్టడుగు స్థానంలో ఉన్న మనిషిని మనం ఇందాక చూశాము. ఇప్పుడతను ఎంతటి ఉన్నత స్థానానికి చేరుకుంటాడంటే ఆ ఏకైక దేవుడు తప్ప ప్రతి వస్తువు అతని క్రిందికి వచ్చేస్తుంది. ఈ పరివర్తనకు సంబంధించిన అత్యుత్తమ ఉపమానం మనకు మహనీయ మూసా (అ)– ఆయనకు ఎదురుగా ఉన్న మంత్రగాళ్ళ గాథలో దొరుకుతుంది. ఏ మంత్రగాళ్ళను ఫిరౌన్ సమీక రించాడో, కొద్దిసేపటి క్రితం వారి దీనావస్థ ఎలా ఉందంటే, పోటీ కోసం రంగం లోకి రాకముందు తమకు లభించవలసిన వేతనం కోసం రాజుగారి నుండి హామీ పొందగోరారు. తమకు ముట్టవలసిన పారితోషికం కోసం ఎంతో దయ నీయ స్థితిలో ఇలా విన్నవించుకున్నారు: (మహాప్రభో!) ఒకవేళ మేము గెలిస్తే మాకు దీని ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది కదా!” (7: 114).

కాని ఎక్కువ సమయం గడవలేదు. తౌహీద్ యొక్క ఒక ఛాయ వారి మీద పడగానే, వారి స్వభావంలో అనూహ్యమైన గొప్ప పరివర్తన వచ్చేసింది. వారు నిజదైవాన్ని విశ్వసించినందుకు కఠినాతికఠినంగా శిక్షిస్తానని ఫిరౌన్ బెదిరించాడు. ‘మీ కాళ్ళు చేతుల్ని నరికి మిమ్మల్ని ఉరికంబంపైకి ఎక్కిస్తాన’ని అంటాడు. కాని ఈ బెదిరింపు ప్రభావం వారిపై ఎంత మాత్రం పడలేదు. వారు ఎలాంటి జంకు లేకుండా– నిర్భయంగా– ఇలా జవాబిచ్చారు: ‘మరేమీ ఫరవా లేదు. ఎట్టి పరిస్థితిలోనూ మేము మరలవలసింది మా ప్రభువు వద్దకే. నీకు చేతనయింది చేసుకో. నీ జోరు ఈ ప్రపంచ జీవితం వరకే నడుస్తుంది.” (అల్ ఆరాఫ్ 125వ వచనం ఆధారంగా).

ఇలా ఎందుకు? ఎందుకంటే, సుఖమైనా దుఃఖమైనా, జీవితమైనా మరణమైనా, ప్రతిదీ వచ్చే పోయే మార్గం ఒక్కటేనన్న పరమ రహస్యం ఏకేశ్వరోపాసకునికి తెలిసిపోయింది. అందుకే అతను సర్వకాల సర్వావస్థల్లో ఆ ఒక్కనిపైనే ఆశ పెట్టుకుంటాడు. ఆయనకే భయపడతాడు. ఈ ప్రపంచం అనేక దేవీదేవతల, కార్య నిర్వాహకుల క్షేత్రం కాదన్న సంగతి అతనికి తెలుసు. ఒకే వివేచనా పరుడు, సర్వాధిక్యుడు తన శక్తిసామర్థ్యాల చేత ఈ విశ్వకర్మా గారాన్ని నడుపుతున్నాడన్న వాస్తవం అతనికి సుబోధకం అయింది. ఆయన ఇచ్ఛకు వ్యతిరేకంగా విశ్వ వ్యవస్థలో, దాని వ్యవహారాలలో ఎవరికీ ఏ కాస్త

ప్రమేయం కూడా లేదు. ఈ విశ్వాన్ని సృష్టించిన కర్త సత్యమని, ఆయన ప్రేమ సత్యమని, అందుచేత ఈ జగతిలో కేవలం అసత్యమే ఉనికిలో లేదన్న విషయం కూడా అతనికి తెలుసు. అసత్యం లేక అధర్మం యొక్క స్థాయి పాక్షికమైనది, సాపేక్షికమైనది, సాంద్రమైనది. సత్యం ఉన్నచోట అదీ ఉంటుంది. పరోక్షంగా సత్యానికే తోడ్పడుతూ ఉంటుంది. ఎవరయితే ఈ పరమ రహస్యాన్ని తెలుసు కున్నాడో అతను ఈ జగతిలోని సౌభాగ్యాన్ని పొందాడు. అతని సౌభాగ్యం అరిగి పోనిది, కరిగిపోనిది. అతని జీవితం అనశ్వరం. అతనెన్నడూ ఒత్తిడికి గురికాడు. ఒంటరితనం అతనిని బాధించదు. అతను నిత్యం నవనవలాడే, పండ్లు ఫలాల నిచ్చే వృక్షం నుండి తింటాడు. సదా ప్రవహించే సెలయేరు నుండి దాహం తీర్చుకుంటాడు.

> **"పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఏ వస్తువుతో పోల్చాడో మీరు గమనించటం లేదా? దాని పోలిక ఇలా ఉంది : ఒక మేలు జాతి చెట్టు వుంది. దాని వేరు భూమిలో లోతుగా నాటుకుపోయింది. కొమ్మలు ఆకాశాన్ని అంటాయి. ప్రతి క్షణం అది తన ప్రభువు ఆజ్ఞానుసారం తన పండ్లను ఇస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకో వాలని అల్లాహ్ ఇటువంటి ఉపమానాలను ఇస్తున్నాడు"**
>
> ***(ఇబ్రాహీమ్: 24,25)***

ఇలాంటి వారే ధన్యులు. కష్టంలోనూ, సుఖంలోనూ వారి మతి చలిం చదు. సర్వకాల సర్వావస్థలో వారి మస్తిష్కం సమతౌల్యంలో ఉంటుంది. కలిమి గానీ, లేమి గానీ ఏ స్థితి కూడా వారి మనశ్శాంతిని అతలాకుతలం చేయదు. వారి మదిలో కలవరం ఉండదు. వారు నిరాశా నిస్పృహలను దరికి రానీయరు. వారు నిక్కుతూ నడవరు. గర్వాహంకారం ప్రదర్శించరు. వినయ పూర్వకంగా వారు విశ్రాంతి గడియలను స్వాగతించినట్లే నగుమోముతో పరీక్షలను, కష్టాలు కడగండ్లను కూడా ఆహ్వానిస్తారు. (మరి వారికి లభించే స్వాగతం కూడా అలాగే ఉంటుంది) **"నెమ్మదిని ఆస్వాదించిన ఓ మనసా! పద, నీ ప్రభువు వైపునకు, నీకు లభించే సత్ఫలితానికి పరవశించి పోతూ. నీ ప్రభువునకు ఇష్టమైన దానివై."**

ఇదీ ఏక దైవారాధకుని అంతరంగం. అతను తన అంతరంగంలో పూర్తిగా

ఏకాగ్రచిత్తుడై ఉంటాడు. ఇలాంటి ఏకాగ్రతే అతని బాహ్యంపై కూడా ప్రస్ఫుటం అవుతుంది. ఏ విధంగానైతే స్వాభావిక శాసనాల ముందు అతను అశక్తుడై, వివశుడై ఉంటాడో, అదే అశక్తతను, వివశతను దైవాజ్ఞల ముందు కూడా పుణికి పుచ్చుకుంటాడు. అల్లాహ్ అతనికి ప్రసాదించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంతోషంగా, ఇష్టపూర్వకంగా దైవేచ్ఛకు లోబడి ఉండేలా మసలుకుంటాడు. సూర్యచంద్రులు, గాలులు, మేఘాలు, నదీనదాలు, పర్వతాలు గత్యంతరం లేక దైవానికి విధేయులై ఉంటాయి. ముకుతాడుతో బంధించబడిన ఒంటెల మాదిరిగా అవి తమకు నిర్దేశించబడిన మార్గాల్లో సాగిపోతూ ఉంటాయి. కాని విశ్వాసి అయిన మానవుడు తాను స్వయంగా, తన స్వహస్తాలతో తన ముక్కులో తాడు బిగించుకుని ఈ పయన బృందంలో చేరిపోతాడు. ఇదే మానవుని అసలు సిసలు గౌరవం. ఇదే అతని విశిష్టత. స్వేచ్ఛ ఉండి కూడా తనను తాను దైవాజ్ఞలకు బద్ధుడై ఉండటం అంటే ఇదే. ఇదే తౌహీద్ (ఏకేశ్వరోపాసన) ఊపిరి. ఈ నిర్బంధంలో (అంటే తన్నుతాను కట్టిపడేసుకోవటంలో) అతను ఎంతగా పరిణతి చెందుతాడో, అంతగానే అతని 'తౌహీద్' పరిపక్వత నొందుతుంది. తౌహీద్ మార్గంలో మొదటి దశ ఏమిటంటే మానవుడు తన మనోవాంఛల దాస్యాన్ని వీడి, అల్లాహ్ సమక్షంలో ఆత్మ సమర్పణ చేసుకుంటాడు. తన దాస్యాన్ని, ఉపాసనను అల్లాహ్‌కే ప్రత్యేకించుకుంటాడు. రెండవ దశ ఏమిటంటే అతడు తన జాతి జనుల ఆచార దురాచారాలను, మూఢనమ్మకాలను, అవసరమైతే తన స్వస్థలాన్ని వదలి నిజ ఆరాధ్య దైవం వైపునకు పరుగెత్తుతాడు. ఆఖరి దశ ఏమిటంటే, ఈ జీవితంపై దైవ సామీప్యానికి, ఆయన ప్రసన్నతకు ప్రాధాన్యతనిస్తాడు.

**ఇన్న సలాతీ వ నుసుకీ వ మహ్యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్- లా షరీకలహూ వ బిజాలిక ఉమిర్తు వ అనా అవ్వలుల్ ముస్లిమీన్** (నా నమాజ్, నా సకల ఉపాసనారీతులు, నా జీవనం, నా మరణం- సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. నాకు ఈ ఆజ్ఞయే ఇవ్వబడింది. తలవంచే వారిలో నేను తొలివాడను) (అల్ అన్‌ఆమ్- 162)

అలాగే తౌహీద్ సామూహిక ప్రభావం కూడా ఎంతో లోతైనది. సామాజిక వ్యవహారాలకు ప్రాతిపదిక సంపూర్ణ న్యాయం, సమానత్వం. దేవుని

ఏకత్వభావన, మానవులంతా ఒక్కటేనన్న భావన లేకుండా సంపూర్ణ న్యాయంగానీ, సమానత్వం గానీ నెలకొనవు. ప్రస్తుత ప్రపంచంలో పతనానికి, వినాశానికి అసలు కారణమేమంటే, ప్రపంచంలో సైన్సు అభివృద్ధి చెందు తున్నంత వేగంగా నాగరికతా స్పృహ అభివృద్ధి చెందటం లేదు. సైన్సు ఎంతగా పురోగమించిందంటే మానవులు భౌగోళిక హద్దులన్నీ అతిక్రమించారు. తమ ఆవిష్కరణల, యంత్రాల శక్తితో సువిశాలమైన ఈ భూభాగాన్ని ఒక ఇంటి ప్రాంగణం మాదిరిగా మార్చేశారు. కాని మనో మస్తిష్కాల సంకుచిత స్థితి ఎలా ఉందంటే ప్రతి జాతికీ వేర్వేరు దేవుడున్నాడు. ప్రతి ఒక్కరి మానవ జాతి కూడా వేరుగానే ఉంది. ఒకవేళ ఈ రకమయిన మనుషులు గనక తమ హద్దులను దాటి ఒకరింకొకరి సరిహద్దుల లోపలికి చొచ్చుకుపోతే, నేడు ప్రపంచంలో వివిధ జాతుల మధ్య చూస్తున్న సంకుల సమరమే, మారణకాండే వీరి మధ్య కూడా జరగగలదు. వీరి రూపురేఖలు మానవుల్లాగా ఉన్నాయి. కాని వీరి మనసులు క్రూర మృగాలను పోలినవి. ప్రకృతి వీళ్ళను నదీనదాలు, కొండలు, అడవుల సరిహద్దుల ద్వారా వేర్వేరుగా ఉంచింది. కాని సైన్సు ఈ హద్దులను మీరిపోయింది. తత్ఫలితంగా వీరు ఒండొకరిపై అడవి మృగాల్లా విరుచుకు పడ్డారు. దాంతో ప్రపంచ శాంతి కరువైపోయింది. ఈ విపత్కర పరిస్థితులపై చింతన చేసిన వారు ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం ఏ సూత్రాలపై మన ప్రస్తుత సంస్కృతీ నాగరికతలు, సామాజిక వ్యవహారాల కట్టడం నిలబడి ఉందో, ఆ సూత్రాలు ప్రస్తుత ప్రపంచానికి సరిపోవు. పసితనంలో తొడిగిన ఈ చడ్డీ ఆరడుగుల మనిషికి మరీ కురచ అయిపోయింది. ఇప్పుడు దాని పొడవు వెడల్పు దృష్ట్యా దాని కోసం ఓ సరికొత్త తొడుగును తయారు చేయాల్సి ఉంది. జాతి, వంశం, వర్ణం, ప్రాంతం, భూమి పుత్ర మూలాలపై ఏ సంస్కృతీ నాగరికతలు వెలిసాయో, ఏ రాజకీయ సంస్థలు ఉనికిలోనికి వచ్చాయో అవి అంతం కావలసిన సమయం ఆసన్నమయింది. ఇప్పుడు ప్రపంచం ఓ నూతన వ్యవస్థ (New Order) అన్వేషణలో ఉంది. అయితే ఆ నూతన వ్యవస్థ ఏది కాగలదు?

ఈ ప్రశ్నకు జవాబు ఇంతవరకు ఎవరూ ఇవ్వలేకపోయారు. ఇప్పుడు ప్రపంచానికి జాతీయ ప్రభుత్వాల స్థానే అంతర్జాతీయ లేక ప్రపంచ ప్రభుత్వం (World State) అవసరమనీ, దానికి ప్రాతిపదిక విశ్వజనీన మానవతా

దృక్పథం అయి ఉండాలని కొందరు ప్రతిపాదిస్తున్నారు. అయితే శుభప్రదమైన ఈ విశ్వజనీన మానవతా దృక్పథం ఏ విధంగా ఉనికిలోనికి రాగలదో వారు చెప్పలేకపోతున్నారు. వివిధ జాతుల పోకడ ఎలా ఉందంటే, వాటికి ఉమ్మడి దేవుడు లేడు. వారి మూలపురుషుడు ఆదమ్ కూడా ఒక్కడు కాడు. ప్రతి ఒక్క జాతి చెప్పేదొక్కటే– నేనే అసలైన దానిని. మిగతా జాతులకు ఏ ప్రాతిపదికా లేదు. ప్రతి ఒక్క జాతి దేవుడు వేరు. దాని సంతతి వేరు. దాని తండ్రి ఆదమ్ వేరు. అది తన నాగరికతలో, నమ్మకాలలో, తన నైతికతలో పూర్తిగా వేరైనది. అది తన ఈ వేర్పాటును (ప్రత్యేకతను) కేవలం మిగిల్చి ఉంచటంతోనే సరిపెట్టుకోక, దానిని ఇతరులపై బలవంతంగా రుద్దాలని కోరుకుంటున్నది.

మస్తిష్కాలలోని ఈ ముడి విచ్చుకోనంత వరకు ఈ జాతుల మధ్యన సంగరితత్వపు ఉమ్మడి బాంధవ్యమేదీ ఏర్పడదు. ఆ ఉమ్మడి బాంధవ్యం ఒక్కటే కాగలదు– అదే అందరూ ఒక్కడైన దైవాన్ని తమ దైవంగా అంగీకరించాలి. ఆయన పంపిన శాసనాన్నే అందరూ తమ శాసన స్మృతిగా ఆశ్రయించాలి. అందరూ ఒకే పితామహుని– మూల పురుషుని– సంతానమని నమ్మి, తాము ఆ సంతతికి చెందిన సభ్యులమని భావించాలి. ఈ ప్రాతిపదికపై నిశ్చయంగా ఒక విశ్వజనీన జాతీయత, ఒక అంతర్జాతీయ రాజకీయ సంస్థ ఏర్పడగలదు. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొని ఉన్న సంక్షోభాలు, విపత్తులు అంతం కాగలవు. ఇది కాకుండా వేరితర ఎన్ని ఉపాయాల ద్వారా ఈ సంక్షోభాన్ని అధిగమించాలని ప్రయత్నించినా గండం నుంచి గట్టెక్కటం సంగతి అలావుంచి, మరొక చిక్కు ముడిని పెంచినట్లవుతుంది.

ఈ పరమార్థం దృష్ట్యానే ఖుర్ఆన్ (అన్ నిసా సూరా ఆరంభంలో) మానవ సమాజం ప్రాతిపదికను మతధర్మం, కుటుంబం అనే రెండు విషయాలపై నెలకొల్పింది. తరువాత ఆ మత ధర్మాన్ని దేవుని ఏకత్వం (తౌహీద్) పునాదిపై నిలబెట్టింది. అంటే కేవలం అల్లాహ్‌నే ప్రభువుగా, శాసన ప్రదాతగా అంగీకరించాలి. ఇతరులకు ఇందులో ఎలాంటి భాగస్వామ్యం కల్పించరాదు. ఇక కుటుంబానికి ప్రాతిపదిక ఆది మానవుడైన ఆదం అందరికీ తండ్రి అని నమ్మి నడుచుకోవాలి. అంటే మానవ జాతి అంతా ఒక్కటేనని, వారిలో ఎవరికీ ఎవరిపైనా ఎలాంటి ఆధిక్యత, ప్రాధాన్యత లేదని ఒప్పుకోవాలి. ఒకవేళ ప్రాధాన్యత

అంటూ ఎవరికయినా ఉంటే భయభక్తుల ఆధారంగా, మంచితనం, నిజాయితీ తత్పరత ఆధారంగానే ఉంటుందని నమ్మాలి.

మొదటి విషయం బహుదైవాల నుండి, ఎందరో శాసనకర్తల మధ్య ఏర్పడే సంఘర్షణ నుండి ఖుర్‌ఆన్ లోకానికి విముక్తిని ప్రసాదించింది. రెండవ విషయం వంశం, వర్ణం, కుటుంబం ఆధారంగా తలెత్తే గర్వాహంకారాన్ని అణచివేసింది. మానవులంతా ఒకే దేవుని దాసులుగా, ఒకే ఆదమ్ సంతానంగా ఖరారయ్యారు. నల్లవానికీ – తెల్లవానికీ, అరబ్బుకు– అరబ్బేతరునికి మధ్య ఎలాంటి భేదభావం మిగులలేదు. అందరికీ ఒకే చట్టం, ఒకే వ్యవస్థ. అందరికీ సమన్యాయం, అందరికీ ఒకే శాంతిభద్రతల వ్యవస్థ. పరిశ్రమించడానికి అందరికీ ఒకే కార్యక్షేత్రం. అందరికీ సమానమైన హక్కులు, సమానమైన బాధ్యతలు. అక్కడ ఏ సంతతి వారినైనా, వారు జన్మతః బానిసలని భావించటం ఘోరమైన పాపం. అక్కడ ఈరానీయులకు– సామీ సంతతి వారికి మధ్య ఏ రకమైన వివక్ష కనబరిచినా అది భువిలో కల్లోలం రేకెత్తించటం లాంటిదే. అక్కడ రెడ్ ఇండియన్లను కేవలం రంగు ఆధారంగా హక్కుల నుండి వంచితుల్ని చేయటం ఘోరమైన అన్యాయం, దౌర్జన్యం. ఈ వ్యవస్థలో ఈ సూత్రాలను త్రోసిపుచ్చిన వారే ఈ సమన్యాయానికి, హక్కులకు నోచుకోకుండా పోతారు. ఎందుకంటే వారు మానవతా విరోధులు. శాంతికీ, న్యాయానికి శత్రువులు. వారు ధరణిలో అరాచకాన్ని, విధ్వంసాన్ని సృష్టించగోర్తున్నారు. మానవ సమాజం ఏ మూలికలకు దూరమై ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోజాలదో, ఆ మూలికలను వారు కూకటివేళ్ళతో పెకలించాలని కోరుకుంటున్నారు.

నేడు ప్రపంచం కొరకు ఒక నూతన వ్యవస్థకై అన్వేషించే వారు దేవుని ఏకత్వపు (తౌహీద్) వాస్తవికతను అర్థం చేసుకోనంత వరకు తమ లక్ష్యసాధనలో సఫలీకృతులు కాలేరు. దైవదాస్యం చేయటం, దైవానికి విధేయత చూపటం అనేది మానవ నైజంలో అంతర్లీనమై ఉన్న విషయం. ఇది ఎంత మహత్తరమైన విషయమంటే, సమస్త మానవ జాతిని దీని వైపునకు పిలువవచ్చు. మంచి స్వభావం కల ప్రతి వ్యక్తీ– అతను ఏ జాతికి, సంతతికి చెందినవాడైనా– ఎలాంటి దురభిమానం, పక్షపాతం చూపకుండా ఈ సందేశాన్ని స్వీకరించగలడు. ఈ

తౌహీద్ సందేశంలో మానవ నైజం వాంఛించే, మానవ సమాజం కాంక్షించే దివ్య ఆయస్కాంతం ఉంది. మనిషి అంతరంగంలోనూ, బాహ్య ప్రపంచంలోనూ ఎవరూ త్రోసిపుచ్చలేని సాక్ష్యాధారాలు, నిదర్శనాలు ఇందులో ఉన్నాయి. ఇది మినహా మిగిలిన వాదాలన్నీ అజ్ఞానంతో కూడుకున్నవే. మానవ నైజాన్ని అప్పీలు చేసే శక్తి వాటిలో లేదు. పోనీ విశ్వ వ్యవస్థతో అవి సమరసం చెందుతున్నాయా అంటే అదీ లేదు. ఒకవేళ బలవంతంగా వాటిని ఈ ప్రపంచంపై రుద్దే ప్రయత్నం చేస్తే ప్రపంచ స్వభావం దానిని జీర్ణించుకోదు, దానిని కక్కేసే ప్రయత్నం చేస్తుంది. ఫలితం సుస్పష్టమే. ఈ ప్రయత్నం విఫలమైనా అవుతుంది. లేదా ఒకవేళ అది విజయవంతం అయినా మింగలేక కక్కలేక గొంతులో ఇరుక్కుని ఉంటుంది. ప్రపంచంలో నెలకొని ఉన్న మిథ్యా ధర్మాలలో మరో మిథ్యా ధర్మం అధికమవుతుంది.

# ధర్మంలో తౌహీద్ ప్రాముఖ్యత

వెనుకటి అధ్యాయాలను శ్రద్ధగా చదివిన వారినుండి ఒక యథార్థం కనుమరుగై ఉండదు. అదేమిటంటే, ధార్మిక వ్యవస్థలో దేవుని ఏకత్వానికి (తౌహీద్‌కు) గల ప్రాముఖ్యత ఎనలేనిది. శరీరంలో హృదయానికి ఎలాంటి స్థానం ప్రాప్తమై ఉందో, ధర్మం (దీన్)లో తౌహీద్‌కు అటువంటి స్థానమే ఉంది. హృదయానికి గనక జబ్బు చేస్తే శరీరమంతటికీ జబ్బు చేస్తుంది. హృదయం గనక ఆరోగ్యవంతంగా ఉంటే శరీరమంతా ఆరోగ్యవంతంగా, బలంగా ఉంటుంది. అందుకే తౌహీద్ లేనిదే మనిషి ఆచరణ ఏదీ స్వీకార యోగ్యం కాజాలదు. తౌహీద్ గనక ఉంటే అతని వల్ల జరిగిన ప్రతి తప్పూ మన్నించబడే అవకాశం ఉంది. అందుకే ఈ విధంగా సెలవీయబడింది:"అల్లాహ్ షిర్క్ (బహుదైవారాధన)ను క్షమించడు. అది తప్ప తాను కోరిన వారి ఇతర తప్పులను క్షమిస్తాడు."

తౌహీద్‌కు (దేవుని ఏకత్వానికి, ఏకేశ్వరోపాసనకు) గల ఈ ప్రాముఖ్యానికి కారణమేమంటే ధర్మం (దీన్) అనే కట్టడం మూడు విషయాలపై నిలబడి ఉంది- 1) తౌహీద్(ఏకేశ్వరోపాసన), 2) రిసాలత్ (దైవదౌత్యం) 3) మఆద్ (పరలోకం). మరో మాటలో చెప్పాలంటే 'తౌహీద్' దీన్‌లో మూడవ వంతు భాగం. ఈ కారణంగానే స్వచ్ఛమైన తౌహీద్‌తో కూడుకుని ఉన్న చిన్న సూరా- సూరయె ఇఖ్లాస్-ను మూడో వంతు ఖుర్‌ఆన్‌గా పేర్కొనటం జరిగింది. మరింత లోతుగా ఆలోచిస్తే అవగతమయ్యేదేమంటే దైవదౌత్యం (రిసాలత్), పరలోకం

(మఆద్) కూడా తౌహీద్ క్రిందికే వస్తాయి. దైవదౌత్యం (రిసాలత్) కూడా తౌహీద్‌లోని భాగమే అనడానికి ఆధారం ఏమిటంటే ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను శాసనకర్తగా నమ్మటం కూడా తౌహీద్ వాంఛించే అంశాలలో ఒక అంశమే. కాగా, అల్లాహ్ తన ఆదేశాలను, శాసనాలను తన ప్రవక్త ద్వారా పంపిస్తాడు. ఈ అంశంపై మేము 'హఖీఖతె రిసాలత్' పుస్తకంలో క్షుణ్ణంగా చర్చించగలము. **'లా ఇలాహ ఇల్లల్లాహ్'**తో **'ముహమ్మదుర్రసూలుల్లాహ్'**కు గల సంబంధం ఎట్టిదో విడమరిచి చెబుతాము. మహాప్రవక్త (సఅసమ్)ను ప్రవక్తగా, జీవితపు అన్ని రంగాలలో ఆయనకు విధేయత చూపటం ఎందుకు అనివార్యమో అక్కడ ఈ యథార్థం సుబోధకం కాగలదు. ఎవరయితే అల్లాహ్ ఒక్కడే అని అంటూనే ప్రవక్త ముహమ్మద్(స) షరీఅత్ పట్ల విముఖత ప్రదర్శిస్తాడో అతను ఒక ముష్రిక్ (బహుదైవోపాసకుడు). అతనికి తౌహీద్‌తో ఎట్టి సంబంధం లేదు.

ఇక మిగిలింది పరలోక విషయం; ఇది తౌహీద్ క్రింద వివిధ కోణాల నుండి వచ్చి చేర్తుంది. మేము మా పుస్తకం 'హఖీఖతె మఆద్'లో క్షుణ్ణంగా దీనిపై చర్చించగలము. దేవుని గుణగణాలు వాంఛించే వాటిలో పరలోకం (మఆద్) ఒకటి. ఇక్కడ గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశం ఏమిటంటే పరలోక విశ్వాసం యొక్క ఊపిరి ఆసాంతం దేవుని ఏకత్వమే (తౌహీద్). ఎవరయినా పరలోకాన్ని విశ్వసిస్తూనే దైవానికి భాగస్వాములను కల్పిస్తూ, సిఫారసు దారులపై కూడా నమ్మకం పెట్టుకుంటే, వారు తమ కొరకు సిఫారసు చేస్తారని మితిమీరిన ధీమాను ప్రదర్శిస్తే, అలాంటి వారి పరలోక విశ్వాసం పసలేనిది, అది వట్టి బూటకం. దేవుని సమక్షంలో జవాబు ఇచ్చుకోవలసి ఉందన్న తలంపునకు పరలోకాన్ని తిరస్కరించేవారు ఎలా భయపడరో వీరూ అలాగే భయపడరు. అరబ్బులు, యూదులు, క్రైస్తవుల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. వారు పరలోక ప్రాముఖ్యాన్నంతటినీ సిఫారసు లేదా పరిహార నమ్మకం ద్వారా వ్యర్థం చేసేశారు. ముస్లింలలోని కొన్ని వర్గాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఈ కారణంగానే దివ్యఖుర్‌ఆన్‌లో దేవుని ఏకత్వం, పరలోకం ఒక దాని తర్వాత ఒకటిగా ప్రస్తావించబడతాయి. ఎందుకంటే తౌహీద్ (దేవుని ఏకత్వం) భావనలో ఏ కాస్త అంతరాయం ఏర్పడినా పరలోక వాస్తవికత అంతా గాలికి ఎగిరిపోతుంది. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే 'దీన్' (ధార్మిక) వ్యవస్థ అంతా తౌహీద్‌తోనే జ్యోతిర్మయమై ఉంది. ఈ శరీరానికి ఆత్మ, ఈ కంటికి పాప తౌహీద్ మాత్రమే.

ఇది లేకుండా ఏ విశ్వాసం గానీ, ఏ ఆచరణ గానీ ప్రభావవంతం కాజాలదు. ఇక్కడి నుండే దీన్ యొక్క మొదటి అడుగు ముందుకు పడుతుంది. దాని ఆఖరి అడుగు కూడా అదే అయి ఉంటుంది. ఇదే ధార్మిక (దీన్) పరిధి. ఈ పరిధి లోపల ఉన్నప్పుడే ధర్మం పదిలంగా ఉంటుంది. అందుచేతనే బనీ ఇస్రాయీల్ సూరాలో ప్రకృతి ధర్మమైన ఇస్లామ్ ఆజ్ఞల, శాసనాల గురించి బోధించబడి నప్పుడు దాని ఆరంభమే **"అల్లాహ్‌తో పాటు వేరితరులను ఆరాధ్యులుగా చేసుకోకు"** అనే వాక్యంతో అయింది... మరి తౌహీద్ వచనంతోనే ఈ మెనిఫెస్టో పూర్తయింది. అంటే **"ఇవి వివేకంతో నిండివున్న విషయాలు. వాటిని నీ ప్రభువు నీకు వహీ ద్వారా తెలియజేశాడు. చూడు! అల్లాహ్‌తోపాటు మరొకరిని ఆరాధ్యుడుగా చేసుకోకు..."** అని ఉపదేశించటం జరిగింది.[1] దీనినిబట్టి అవగతమయ్యే దేమంటే దీన్ ఆరంభం కూడా తౌహీద్‌తోనే జరిగింది. దీన్ ఆఖరి మాట కూడా తౌహీద్‌తోనే పూర్తయింది. ఇక షరీఅత్, దాని అనుబంధ ఆదేశాలన్నీ పరిపూర్ణ తౌహీద్ వరకు చేరే సాధనాలే.

తౌహీద్‌కు గల ఈ ప్రాముఖ్యత కారణంగానే, ప్రపంచంలో ఎందరు ప్రవక్తలు వచ్చినా, వారు తమ సందేశ కార్యాన్ని తౌహీద్‌తోనే ఆరంభించటం మనం గమనిస్తున్నాము. వారు ఈ కేంద్ర బిందువుపై ఎంత గట్టిగా నిలబడ్డా రంటే, దాని నుండి వెంట్రుక మందం కూడా ప్రక్కకు వైదొలగటానికి అంగీక రించలేదు. దైవప్రవక్త తన ఈ ముక్కుసూటి ధోరణి గురించి పునరాలోచన చేయాలనీ, కాస్త పారదర్శకంగా వ్యవహరించాలని, కాస్త మృదువుగా మసలుకో వాలని వ్యతిరేకులు ఎంత కోరినా ఆయన రాజీపడలేదు. కనీసం తమ పూజ్యదైవాల అశక్తతను ఎత్తి చూపరాదని వారు కోరారు. దైవప్రవక్త(స) గనక కాస్త మెత్తబడితే, ఆయనతో ఒప్పందం చేసుకునేందుకు బహు దైవారాధకులు ప్రయత్నించారు. **"నీవు గనక రాజీపడితే వారు కూడా రాజీపడదామని అనుకుంటున్నారు"** (అల్ ఖలమ్ :9). కాని దైవప్రవక్త(స) ఒక్క క్షణం కోసం కూడా సర్దుబాటుకు ఒప్పుకోలేదు. ప్రత్యర్థి వర్గం వారు వేధింపుల ద్వారా భయ పెట్టదలిచారు. బెదిరించారు. తాము చేయగలిగిందంతా చేశారు. కాని ఆయన్ని ఆయన స్థానం నుండి ఒక్క అంగుళం కూడా కదిలించలేకపోయారు. వారు ప్రలోభపెట్టారు. లంచంగా తాము ఇవ్వగలిగిందంతా ఇవ్వడానికి సిద్ధమయ్యారు.

1. చూడండి : బనీ ఇస్రాయీల్ సూరాలోని 22-39 ఆయత్‌లు

కాని వారి పప్పులేమీ ఉడకలేదు. గౌరవనీయుల కుటుంబంలో పెళ్ళి చేయిస్తా మన్నారు. సిరిసంపదల రాశిని సమర్పించుకుంటామని ప్రతిపాదించారు. నాయకత్వం కట్టబెడతామని ఎరవేశారు. అయితే ఈ ప్రలోభాలన్నింటికీ జవాబుగా ఆయన ఒకే మాటన్నారు. అదే తౌహీద్. వారు తమ ఎత్తుగడ లన్నింటిలో విఫలమయ్యాక, తమ ఆఖరి ఎత్తుగడలో భాగంగా దైవప్రవక్తపై, ఆయన ప్రియ సహచరులపై దండోపాయానికి పూనుకున్నారు. అంటే వారు తమ కుటుంబీకులను, ఆస్తిపాస్తులను, స్వస్థలాన్నీ వదలిపోవాలన్నారు. దైవప్రవక్తలంతా దీనిని కూడా సహించారు. ఖుర్ఆన్ మన ముందు ఉంది. అందులో ఎంతోమంది దైవప్రవక్తల వలస (హిజ్రత్) గాథలు ప్రస్తావించ బడ్డాయి. వాటిని చదవండి. ప్రతి ప్రవక్త నోట తన స్వదేశాన్ని వదిలివెళ్ళే సమ యంలో జాలువారే వచనం ఒక్కటే– అదే దేవుని ఏకత్వపు (తౌహీద్) వచనం.

దీని కోసమే అతను సర్వస్వాన్ని వదిలివేస్తాడు. అన్నింటినీ వదలి ఆ ఒక్క కలిమానే తన నేస్తంగా చేసుకుంటాడు. ఆలోచించండి! ఇలా ఎందుకు? మనిషి సమస్తాన్నీ వదులుకుని తౌహీద్‌కు విఘాతం కలగకుండా జాగ్రత్తపడతాడు. ఎందుకు? బద్ర్ రణరంగంలో తండ్రి కొడుకుపై, బాబాయి తన భ్రాతృజునిపై, మేనమామ తన మేనల్లుడిపై, అన్న తన తమ్మునిపై తౌహీద్ కోసం ఖడ్గం ఝుళిపించారు. ఈ తౌహీద్ కోసమే భార్యలు తమ భర్తల నుండి, భర్తలు తమ భార్యల నుండి వేరైపోయారు. అనుబంధం ఆత్మీయతలపై, బంధుత్వ సంబంధా లపై కత్తెర పడింది. మానవత్వం పరిమళించే మంచి మనుషులే, బంధుత్వ సంబంధాల పటిష్టత కోసం ధ్వజమెత్తినవారే తౌహీద్ కోసం తెగత్రెంపులకు సిద్ధపడ్డారు. మహనీయ మూసా(అలైహిస్సలామ్) జాతి జనులలో కొందరు ఆవుదూడ పూజకు ఒడిగట్టినప్పుడు, ఆ పనికి ఒడిగట్టినవాడు ఏ తెగవాడైతే, ఆ తెగవారే అతనిని హతమార్చాలని ఆయన ఆజ్ఞాపించారు. **'మీలోని ఘోర పాతకులను సంహరించండి"** (2: 54). బద్ర్ యుద్ధ ఖైదీల భవితవ్యాన్ని తేల్చే విషయమై సంప్రతింపులు జరిపినప్పుడు, ప్రతి వ్యక్తీ తనకు బంధువు అయిన ఖైదీని సంహరించాలని మహనీయ ఉమర్(రజి) సలహా ఇస్తారు. అల్లాహు అక్బర్!

తౌహీద్‌కు గల ఔన్నత్యానికి ప్రధాన కారణం పైన వివిధ అధ్యాయాలలో వివరించబడిన అంశాలే. న్యాయానికి, సమత్వం సమతూకానికి పునాది ఇదే.

ఈ హక్కును తెలుసుకోనివాడు, ఎవరి హక్కునూ తెలుసుకోలేడు. కడకు అతను తన ఆత్మ హక్కును కూడా తెలుసుకోడు. నేటి ఆధునిక యుగంలో దౌర్జన్య పరుల, కృతఘ్నుల ద్వారా జరిగే నేరాలు ఘోరాలే ఇతని ద్వారా కూడా జరుగు తాయి. దైవప్రవక్త ఇచ్చే సందేశం ఆద్యంతం సత్యంపై, న్యాయంపై దేవుని ఏకత్వంపై నెలకొని ఉంటుంది. తౌహీద్ వ్యవహారంలో వారు ఎవరితోనయినా, ఎలాంటి రాజీ ఒప్పందమైనా ఎలా చేసుకోగలరు? ఎందుకంటే దేవుని ఏకత్వమే (తౌహీదే) హక్కులన్నిటికీ ప్రాతిపదిక. వారు ఈ వ్యవహారంలో తండ్రిని గానీ, పినతండ్రిని గానీ, కన్న కొడుకును గానీ, కట్టుకున్న ఇల్లాలిని గానీ మన్నించరు. హక్కును నిర్వర్తించటంలో ఏ వస్తువు అడ్డంకిగా ఉన్నా, దానిని దారి నుండి తొలగించవలసిన ఆవశ్యకత ఉంది.

దైవప్రవక్తల సకల ప్రయత్నాల ప్రధాన లక్ష్యం స్వచ్ఛమైన తౌహీద్‌ను స్థాపించటమే. దేవుని దాసులను ఇతరత్రా దాస్యాల నుండి విముక్తి కల్పించి దైవదాస్యంలోనికి తీసుకువచ్చేందుకే ప్రవక్తలు ఈ ప్రపంచంలో ప్రభవింపజేయ బడతారు. అంటే వారు నిజ దైవాన్నే సృష్టికర్తగా నమ్మాలి. ఆయన్నే సార్వభౌము నిగా అంగీకరించాలి. ఆయనకే విధేయులై ఉండాలి. ఆయన్నే నమ్ముకోవాలి. ఆయనపైనే కార్యభారం మోపాలి. సహాయం కొరకు ఆయన్నే అర్థించాలి. ప్రసాదం లభిస్తే ఆయనకే కృతజ్ఞతలు తెలుపాలి. ఆపద వస్తే, దానిని తొలగించ మని ఆయన్నే ప్రార్థించాలి. ఆశతోనూ, భయంతోనూ ఆయన్ని వేడుకోవాలి. సర్వకాల సర్వావస్థల్లో వారి మనసు ఆ దేవుని యందే లగ్నమై ఉండాలి. వారు తమ సమస్త వ్యవహారాలను ఆయనకే అప్పగించాలి. వారి ప్రేమ ఆయన ప్రేమకు లోబడి ఉండాలి. వారి ఇష్టం ఆయన ఇష్టానికి అనుగుణంగా ఉండాలి. ఆయన అస్థిత్వంలో, ఆయన గుణగణాలలో, ఆయన హక్కులలో ఆయన 'ఏకత్వాన్ని' అంగీకరించాలి. ఏ కోణం నుండి కూడా ఈ విషయాలలో ఎవరినీ భాగస్వాములుగా నిలబెట్టకూడదు– ఏ దైవదూతను గానీ, ఏ జిన్నును గానీ, ఏ ప్రవక్తను గానీ, ఏ వలీని గానీ, వేరెవరినిగానీ, తన స్వయాన్ని గానీ భాగ స్వామిగా చేర్చరాదు.

తౌహీద్‌కు సంబంధించిన ఈ వాస్తవికత స్పష్టమయ్యాక, అసలు సిసలు యథార్థం రీత్యా తౌహీద్ కేవలం దీన్(ధర్మం)లోని ఒక భాగం కాదనీ, ఇది సమస్త దీన్‌ను పరివేష్టించి ఉందని తేటతెల్లమైపోయింది. వేరే మాటల్లో దీని అర్థం

ఏమిటంటే, తౌహీద్‌కు వెలుపల ధార్మిక భావనను అసలు ఊహించనైనా లేము. దైవప్రవక్తలు తౌహీద్‌తోనే తమ కార్యాన్ని మొదలుపెడతారు. తౌహీద్‌తోనే ముగింపు పలుకుతారు. ఈ కారణంగానే దివ్య ఖుర్‌ఆన్ తౌహీద్‌తోనే ఆరంభమై తౌహీద్‌పైనే పూర్తవుతుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లోని మొట్టమొదటి సూరా ఫాతిహా సూరా. దైవానికి నిష్కల్మష హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకోవటం, సంపూర్ణ ఆత్మ సమర్పణ చేసుకోవటం దీని అసలు ఊపిరి. చివరి సూరాల్లో ఒకటైన నస్ర్‌లో మక్కా విజయ శుభవార్త ఉంది. సూరయె లహబ్‌లో అసత్యం ఓటమి పాలవుతుందన్న భవిష్యవాణి చెప్పబడింది. దీని తరువాతి సూరా సూరయె ఇఖ్లాస్. ఇందులో స్వచ్ఛమైన దేవుని ఏకత్వం గురించి వివరించబడింది. దీన్ (ధర్మం) యొక్క కేంద్ర బిందువు తౌహీదేనన్న వాస్తవం ఈ సూరాలో విశదీకరించబడింది. దీంతో ధర్మం (దీన్) తన కేంద్ర స్థానానికి చేరుకుంది. ఆ తర్వాత 'ముఅవ్విజతైన్' (ఖుల్ అవూజు బి రబ్బిల్ ఫలఖ్– ఖుల్ అవూజు బి రబ్బిన్నాస్ సూరాలు) ఉంచ బడ్డాయి. పైశాచిక శక్తుల బారి నుండి ఈ సూరాలు తౌహీద్ ధనాగారాన్ని కాపాడుతున్నాయి. ఎందుకంటే షైతాన్‌కు ఆదమ్ సంతతి పట్ల అసూయ ఉంది. ఈ అసూయావేశంలో వాడు చేసే ప్రయత్నాల్లో మొట్టమొదటి ప్రయత్నం మానవుణ్ణి 'తౌహీద్' అనే కేంద్ర బిందువు నుంచి తొలగించటం. ఈ కారణం గానే వాడు, **"నేను నీ దాసుల కోసం నీ రుజుమార్గంపై మాటేసి కూర్చుంటాను"** అని అల్లాహ్‌కు సవాలు విసిరాడు. అంటే వారిని తౌహీద్ మార్గంలో ఉండనివ్వను అన్నాడు. **"నీవు వారిలో చాలామందిని నీ కృతజ్ఞులుగా పొందవు"** అని కూడా సవాలు విసిరాడు. అంటే వారిలో చాలామంది షిర్క్‌కు ఒడిగడతారు.

**- : సమాప్తం :-**

# Notes :

## తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

సందేశ భవనం, ఛత్తాబజార్, హైదరాబాద్- 500 002
ఫోన్ : 040-24564583, 24576237
ఈ- మెయిల్ : geeturaiweekly@gmail.com

## మీ సేవలో మా ప్రచురణలు

ఇస్లామిక్ సాహిత్య భాండాగారం అపారం! కొన్ని లక్షలపేజీల అమూల్య అక్షర సంపదకు నెలవైన మహోన్నత భావనల ఖజానా అది. పదిహేను వందల సంవత్సరాల పరమాద్భుత చరిత్ర గల ఇస్లామ్ కేంద్ర బిందువుగా వెలువడిన విస్తృతమైన, వైవిధ్యభరితమైన ధార్మిక సాహిత్యం శాఖోప శాఖలుగా వ్యాపించి వుంది. మహా ప్రభువు నిర్దేశించిన, మహత్తర భావనలు ప్రాతిపదికగా పుంఖానుపుంఖాలుగా వెలువడిన ఇస్లామీయ సాహిత్యాన్ని తెలుగులో విస్తృతంగా ప్రచారం చేయవలసిన బాధ్యతను గుర్తించి ఉనికిలోకి వచ్చిన ప్రచురణ సంస్థ **తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** హైదరాబాద్‌లోని 'సందేశ భవనం' తన ప్రచురణ కృషి ప్రారంభించిన ఈ **50** సంవత్సరాలలో **355** పుస్తకాలను ప్రచురించింది.

అనంత దయామయుడైన అల్లాహ్ అనుగ్రహం వల్ల 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్' దివ్య ఖుర్ఆన్ తెలుగు అనువాదంతోపాటు మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనాలను, ఇస్లామ్‌ను పరిచయం చేసే పుస్తకాల నుంచి, ఇస్లామ్ పట్ల గల అపార్థాలను తొలగించే మహోపయుక్తమైన గ్రంథాల వరకు ఇస్లామీయ జీవన విధానాన్ని గురించి ముస్లిం సోదరులలోనూ, ముస్లిమేతర సోదరులలోనూ తలెత్తే రకరకాల సందేహాలను నివృత్తి చేసే ప్రశ్నోత్తర సంపుటం నుంచి, నమాజ్‌కు సంబంధిం చిన విధి విధానాలను వివరించే పుస్తకాలవరకు తేటతెలుగులో, విభిన్న రంగా లకు చెందిన రచనలను వెలువరించింది. వీటిలో అరబిక్, ఉర్దూ, ఆంగ్లం, తమిళం వంటి భాషల నుంచి చేసిన అనువాదాలూ, తెలుగులో రచించిన మౌలిక గ్రంథాలూ ఉన్నాయి.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (**TIP Trust**) ధర్మసేవలో చేస్తోన్న ఈ కృషికి మీ చేదోడు వాదోడు ఎంతో అవసరం. మా ప్రచురణలను ఆదరంతో చదవండి. లోటుపాట్లేమైనా ఉంటే నిర్మొహమాటంగా మాకు రాయండి. మీ సూచనలు, మీ అభిప్రాయాలు మాకు ఎంతో అవసరం.

## పుస్తకాల కొరకు సంప్రతించండి:

**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST**
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. Ph: 040-24564583, 24576237
E-mail : geeturaiweekly@gmail.com

సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | రూ.15 |
| వార్షిక చందా | రూ.750 |
| ఆరు నెలలచందా | రూ375 |

చదవండి ఒకవారం చదువుతారు ప్రతివారం

దురభిమానాలకు దూరంగా
సదాశయాలకు స్నేహంగా
సోదరభావం, సాంఘిక న్యాయం
సత్యం, ధర్మం, నీతి న్యాయాల కోసం
నిష్పక్షపాతంగా కృషి చేసే పత్రిక

**Geeturai Weekly**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Contact on : 9704317015 (Jaleel M.A.)

Bank Details: A/c. No. 1042789768 IFSC Code. CBIN0282407
**Central Bank of India,** Noor Khan Bazar Branch, Hyderabad

పైకాన్ని యం.ఓ. లేక డిడి. ద్వారా పంపవచ్చు.
డి.డి. ద్వారా పంపదలిస్తే డి.డి.ని Geeturai Weekly పేర మాత్రమే తీయాలి.

# అనుపమ

మహిళా మాసపత్రిక

**ANUPAMA**

*Womens Monthly Magazine*

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Contact on : 9704317015 (Jaleel M.A.)

## చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | రూ.15 |
| వార్షిక చందా | రూ.150 |
| ఆరు నెలలచందా | రూ.250 |
| విదేశాలకు సం. చందా | రూ.1000 |

Bank Details: A/c. No. 3309747713
IFSC Code. CBIN0282407
**Central Bank of India,**
Noorkhan Bazar Branch, Hyderabad

పైకాన్ని యం.ఓ. లేక డిడి. ద్వారా పంపవచ్చు.
డి.డి. ద్వారా పంపదలిస్తే డి.డి.ని
**ANUPAMA** పేర మాత్రమే తీయాలి.

చదవండి ఒక మాసం
చదువుతారు ప్రతి మాసం